# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శనివారం 17-8-2019 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :25 | సంచిక: 279 | పేజీలు 8 | వెల: రూ.1/-


## కశ్మీర్‌లో ప్రాణనష్టం జరగలేదు: చీఫ్ సెక్రటరీ

హైదరాబాద్, ఆగష్టు 16: జమ్మూకశ్మీర్ చీఫ్ సెక్రటరీ బీవీఆర్ సుబ్రమణ్యం ఇవాళ శ్రీనగర్‌లో మీడియాతో మాట్లాడారు. శాంతి భద్రతల నేపథ్యంలో ముందస్తుగా కొందర్ని అరెస్టు చేయాల్సి వచ్చిందన్నారు. అనేక చోట్ల టెలికం ఆంక్షలను విధించామన్నారు. అయితే సోమవారం నుంచి స్కూళ్లు తెరుచుకోనున్నట్లు ఆయన చెప్పారు. ప్రజా రవాణా వ్యవస్థను క్రమంగా ఆపరేట్ చేస్తామన్నారు. ఇవాళ్టి నుంచే ప్రభుత్వ ఆఫీసులు పనిచేస్తున్నాయని సుబ్రమణ్యం చెప్పారు. దశల వారీగా టెలికం సేవలను పునరుద్ధరించనున్నట్లు తెలిపారు. గత 12 రోజులగా కశ్మీర్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అయితే ఈ సమయంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని ఆయన తెలిపారు.

# వాజ్‌పేయ్ తొలి వర్ధంతి

### ఘనంగా నివాళి అర్పించిన రాష్ట్రపతి, ప్రధాని

న్యూఢిల్లీ,ఆగస్ట్16(ఆర్ఎన్ఎ): మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి తొలి వర్ధంతి సందర్భంగా ఆయనకు బీజేపీ ఘనంగా నివాళులు అర్పించింది. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డా సహా ఆ పార్టీకి చెందిన నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున వాజ్‌పేయి స్మారకం 'సదైవ అటల్' వద్దకు చేరుకుని పుష్పాంజలి ఘటించారు. వాజ్‌పేయి దత్తపుత్రిక నమిత కౌల్ భట్టాచార్య, మనవరాలు నిహారికలను కలుసుకుని యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గతేడాది వాజ్‌పేయ్ ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. 1924 డిసెంబర్ 25న మధ్య ప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో వాజ్‌పేయి జన్మించారు. మూడు సార్లు దేశ ప్రధానిగా సేవలందించారు. 2015లో భారత ప్రభుత్వం వాజ్‌పేయికి అత్యంత ప్రతిష్టాత్మకమైన భారత రత్న పురస్కారం అందించింది. నాలుగు దశాబ్దాల పాటు ఎంపీగా పదిసార్లు పార్లమెంట్‌కు ప్రాతినిథ్యం వహించారు. రెండు సార్లు రాజ్యసభకు ఎంపికయ్యారు. క్రియాశీల రాజకీయాలకు దూరమయ్యేంత వరకూ వాజ్‌పేయి యూపీలోని లక్నో నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించారు. దీర్ఘకాలిక అస్వస్థత కారణంగా గతేడాది ఆగస్టు 16న వాజ్‌పేయి కన్నుమూశారు. ఆయన స్మృత్యర్థం ఢిల్లీలోని రాజ్‌ఘాట్ సమీపంలో రూ.10.51 కోట్ల వ్యయంతో 'సదైవ అటల్'ను నిర్మించారు. అటల్ స్మృతి న్యాస్ సొసైటీ 1.5 ఎకరాల స్థలంలో దీన్ని నిర్మించింది. ఈ సందర్భంగా సర్వమత ప్రార్థనలు జరిగాయి.

## స్పా కేంద్రంలో దూరి బెదిరించి .. బలవంతంగా డబ్బు వసూలు

### ముగ్గురు నకిలీ విలేకరులపై కేసు

హైదరాబాద్,ఆగస్ట్16(ఆర్ఎన్ఎ): స్పా కేంద్రం నిర్వాహకులను బెదిరించి డబ్బులు వసూలు చేసిన ముగ్గురు నకిలీ విలేకరులపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ మురళీకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... ఈనెల 7వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో ఎస్ఆర్‌నగర్‌లోని ఆర్‌వై ఫ్యామిలీ బ్యూటీ పార్లర్ అండ్ స్పా కేంద్రానికి ముగ్గురు వ్యక్తులు వెళ్లారు. తాము ఓ చానెల్ విలేకరులమని చెప్పి లోపలికి వెళ్లి ఫొటోలు, వీడియోలు తీయడం ప్రారంభించారు. స్పా కేంద్రం నిర్వాహకుడు రావాలని డిమాండ్ చేయడంతో యజమాని రమణ హుటాహుటిన అక్కడకు చేరుకున్నాడు.

## ర్యాష్ డ్రైవింగ్..ఎంపి తనయుడి అరెస్ట్

కోల్‌కతా,ఆగస్ట్16(ఆర్ఎన్ఎ): బీజేపీ ఎంపీ రూపా గంగూలీ కుమారుడు ఆకాశ్ ముఖర్జీని కోల్‌కతా పోలీసులు అరెస్టు చేశారు. అతివేగంగా కారును నడిపిన అతను.. కోల్‌కతాలోని ఓ క్లబ్ గోడను ఢీకొట్టాడు. గురువారం రాత్రి 9 గంటల ప్రాంతంలో ఎంపీ రూపా కుమారుడు ముఖర్జీని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు చెప్పారు. ర్యాష్ డ్రైవింగ్‌తో పాటు ఆస్తులను ధ్వంసం చేసిన కేసులో అతన్ని అరెస్టు చేశారు. ఆకాశ్ తాగి డ్రైవ్ చేస్తున్నాడా అన్న కోణంలో విచారణ సాగుతున్నది. కోల్‌కతాలోని అలిపోర్ కోర్టులో అతన్ని ప్రవేశపెట్టనున్నారు. చట్టం ప్రకారమే పోలీసులు చర్యలు తీసుకోవాలని ఎంపీ రూపా గంగూలీ ఈ ఘటనపై అభిప్రాయం వ్యక్తం చేశారు.

### గత పాలకుల నిర్లక్ష్యమే..

# పాలమూరు ప్రజల కష్టాలకు కారణం

- కృష్ణా నది ఎత్తిపోస్తున్నా.. నీటిని నిల్వచేసుకోలేని దుస్థితి
- గత పాలకుల అసమానతలు సరిచేసేందుకే కేసీఆర్ కృషి
- నూతన రిజర్వాయర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టాం
- త్వరలోనే సీఎం కేసీఆర్ రెండురోజులు పర్యటిస్తారు
- వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- రంగసముద్రం రిజర్వాయర్‌లో చేపపిల్లలు వదిలిన మంత్రి

వనపర్తి, ఆగస్టు16(ఆర్ఎన్ఎ): గత పాలకుల నిర్లక్ష్యం, పాలమూరు ప్రాజెక్టుల పట్ల వివక్ష మూలంగా పాలమూరు ప్రాంత ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. శుక్రవారం వనపర్తి జిల్లా శ్రీ రంగాపురం మండల కేంద్రంలోని రంగసముద్రం రిజర్వాయర్ లో మంత్రి రెండు లక్షల చేప పిల్లలను వదిలారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. గత పాలకుల తీరుపై మండిపడ్డారు. కృష్ణా నదికి పెద్దఎత్తున వరదలు వస్తున్నా నీటిని ఎత్తిపోసుకుని నిల్వచేసుకోలేని దుస్థితి పాలమూరు ప్రాంతంలో ఉందన్నారు. ఏ హక్కులు లేకున్నా రాయలసీమ, ఆంధ్రలో 400 టీఎంసీలు నిల్వచేసుకునే రిజర్వాయర్లు నిర్మించారని, అదే పద్ధతిలో కనీసం వంద టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్లు నిర్మించి ఉన్నా పాలమూరు సస్యశ్యాలం అయ్యేదని అన్నారు. పాలమూరులోని కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు ఎత్తిపోతల పథకాల కింద కనీసం 10టీఎంసీలు నిల్వ చేసుకునే పరిస్థితి లేదని నిరంజన్ రెడ్డి అన్నారు. గత పాలకుల అసమానతలు సరిచేసేందుకే సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని, నూతన రిజర్వాయర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని మంత్రి అన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల కింద 40 ఆన్ లైన్ రిజర్వాయర్లు నిర్మించనున్నామని, త్వరలోనే సీఎం జిల్లాలో రెండురోజులు పర్యటించి, ఈ ప్రాంతంలో గల సమస్యలను పరిశీలించి నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు పనులు వేగవంతం చేసేందుకు కేసీఆర్ దృష్టిసారించారని, వేగంగా ఆ ప్రాజెక్టును పూర్తిచేయటం జరుగుతుందని అన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తిగా ఉమ్మడి పాలమూరు సస్యశ్యామలం అవుతుందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ఉమ్మడి పాలమూరు జిల్లాలోని చెరువుల్లోకి వర్షంనీరు వచ్చిచేరుతుందని అన్నారు.అన్ని చెరువులు, రిజర్వాయర్లలో చేపపిల్లలను వదులడం ద్వారా మత్స్యకారులకు జీవనోపాదికి ఉపయోగపడుతుందన్నారు. మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారిని అన్ని విధాల ఆదుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ శ్వేతామొహంతి, జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్ రెడ్డి హాజరయ్యారు.



.చేపపిల్లలను వదిలే కార్యక్రమం చేపట్టిన సందర్భంగా వరంగల్ జిల్లాలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు. చిత్రంలో స్టేషన్ ఘనాపూర్ ఎమ్మెల్యే రాజయ్య, వరంగల్ కలెక్టర్ ప్రశాంత్ పాటిల్ తదితరులు

# కాళేశ్వరం వద్ద మళ్లీ పెరుగుతున్న గోదావరి

### ప్రాణహిత నుంచి వస్తోన్న వరద

హైదరాబాద్,ఆగస్ట్16(ఆర్ఎన్ఎ): కాళేశ్వరం వద్ద గోదావరికి వరద స్థిరంగా కొనసాగుతుతోంది. ప్రాణహితలో మళ్లీ ప్రవాహం పెరిగడంతో ఎగువ నుంచి భారీగా వరద వస్తోంది. మరోవైపు భద్రాచలం ఏజెన్సీలో గోదావరి మళ్లీ పెరుగుతున్నది. గత కొద్ది రోజులుగా తగ్గుతూ వచ్చిన గోదావరి గురువారం ఉదయం నుంచి మళ్లీ పెరిగింది. భద్రాద్రి వద్ద గురువారం రాత్రి 39.9 అడుగులకు చేరుకున్నది. పేరూరు వద్దుగా వరద ప్రవాహం 3.70 లక్షల క్యూసెక్కులుగా నమోదైంది. ప్రాణహిత నది నుంచి గోదావరికి వరద కొనసాగుతుండటంతో.. లక్ష్మీ బరాజ్‌లో 55 గేట్లు ఎత్తి 3.61 లక్షల క్యూసెక్కుల వరదను దిగువకు వదులుతున్నారు. మరోవైపు శ్రీరాంసాగర్‌కు ఇన్‌ఫ్లోలు ఇంకా తక్కువగానే ఉన్నాయి. జలాశయంలో నీటినిల్వ 90 టీఎంసీలకు గాను 17.18 టీఎంసీలుగానే ఉన్నది. కడెంకు కూడా వరద స్వల్పంగా పెరిగింది. ఎల్లంపల్లి జలాశయానికి వరద కొంత తగ్గింది. ప్రస్తుతం జలాశయంలో 20.17 టీఎంసీల పూర్తిస్థాయి నిల్వకుగాను 19.62 టీఎంసీల నిల్వ ఉన్నది. మరోవైపు ఏటూరునాగారం మండలం రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి వరద 8.34 మీటర్లకు చేరింది. దేవాదుల ఇన్‌టేక్ వెల్ వద్ద 84.50 మీటర్లకు చేరుకున్నది. దీంతో రెండు మోటర్ల ద్వారా భీం ఘనపూర్ రిజర్వాయర్‌కు నీటిని పంపింగ్ చేస్తున్నారు. ఇప్పటివరకు గోదావరి జలాలు 1342 టీఎంసీలు సముద్రంలో కలిశాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలోని మిడ్‌మానేరు జలాశయానికి 1600 క్యూసెక్కుల నీరు చేరింది. కాళేశ్వరం ఎనిమిదో ప్యాకేజీ కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంప్‌హౌస్‌లో 4, 5వ బాహుబలి మోటర్ల వెట్ రన్ కొనసాగుతున్నది. ఈ రెండు మోటర్లను పూర్తి సామర్థ్యంతో నడిపిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మోటర్లు ఎత్తిపోసిన జలాలు మిడ్ మానేరు జలాశయానికి చేరుకొన్నాయి. దీంతో మిడ్‌మానేరు జలాశయం కింద రైతులను అధికారులు అప్రమత్తంచేశారు.

# మతిలేని వాళ్లే అమెరికాలో కాల్పులకు కారణం

### - కాల్పుల ఘటనలపై ట్రంప్ కామెంట్

న్యూజెర్సీ, ఆగస్టు16(ఆర్ఎన్ఎ) : మతిలేని వాళ్ల వల్లే అమెరికాలో కాల్పుల ఘటనలు చోటు చేసుకుంటున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా న్యూజెర్సీలో పర్యటించిన ఆయన దీనిపై స్పందించారు. నిజాయతీ ఉన్న వాళ్ల వద్ద గన్ ఉంటే ఎలాంటి సమస్య ఉండదని, వారికి నేను మద్దతిస్తానని, కానీ మానసిక స్థితి సరిగా లేనివాళ్లు మాత్రమే ఇలాంటి కాల్పులకు తెగబడతారన్నారు. అందుకే వారందరి కోసం అమెరికాలో మరిన్ని విద్యాసంస్థలు ఏర్పాటు చేస్తావన్నారు. ఈ మేరకు నేను అధికారులతోనూ మాట్లాడానని, పిచ్చోళ్ల వద్ద గన్‌లు ఉండటం చాలా ప్రమాదకరమని అన్నారు. ఈ ఘటనలను మేం తీవ్రంగా పరిగణిస్తున్నామని, ఈ తుపాకీ సంస్కృతిని గమనిస్తూనే ఉన్నామని, 1960, 70ల్లో మానసిక విద్యాసంస్థలను మూసి వేయడం వల్ల వాళ్లంతా వీధిన పడ్డారు. అదే సమస్య ఇప్పటికీ కొనసాగుతోందని అన్నారు. అమెరికాలో వారంవ్యవధిలో రెండు సార్లు కాల్పుల ఘటనలు చోటు చేసుకున్నాయని అన్నారు. గత నెల 31న విస్కాన్సిన్ రాష్ట్రంలో జరిగిన రెండు ఘటనల్లో నలుగురు బలయ్యారని, వీరితో పాటు హంతకుడూ విగతజీవుడై కనిపించాడని, ఆగస్టు 4న టెక్సాస్ రాష్ట్రంలోని ఎల్‌పాసోలో ఉన్న వాల్‌మార్ట్ స్టోర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరిపారన్నారు. ఈ కాల్పుల్లో 20 మంది వరకు మరణించారని

# ఉస్మానియా యూనివర్సిటీలో ఏబీవీపీ ఆందోళన

- కాలేజీ హాస్టల్‌లో అమ్మాయిలకు భద్రత కల్పించాలంటూ డిమాండ్
- అర్ధరాత్రి అగంతుకులు వస్తున్నా పట్టించుకోలేదు
- నిందితుడిని వెంటనే పట్టుకోవాలని డిమాండ్

హైదరాబాద్, ఆగస్టు16(ఆంఎన్ఎ): ఉస్మానియా యూనివర్సిటీలో ఇంజనీరింగ్ విద్యార్థులు ధర్నాకు దిగారు. క్యాంపస్ లేడీస్ హాస్టల్‌లో గురువారం అర్ధరాత్రి ఆగంతకుడు ప్రవేశించి, అమ్మాయితో అసభ్యంగా ప్రవర్తించిన ఘటన నేపథ్యంలో విద్యార్థులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో క్యాంపస్ లోని లేడీస్ హాస్టల్ ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఘటన జరిగి రెండు రోజులైనా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఇప్పటివరకు స్పందించక పోవడం సిగ్గుచేటని ఏబీవీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలేజీ హాస్టల్‌లో అమ్మాయిలకు భద్రత లేదంటూ ఆవేదన వెలిబుచ్చారు. యూనివర్సిటీలోకి అర్ధరాత్రి ఆగంతకులు దూరుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. నిందితుడిని వీలైనంత త్వరగా పట్టుకోవడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళన ఉధృతంగా మారుతున్న క్రమంలో పోలీసులు వారిని వారించే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు, ఆందోళన కారుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. తాజా ఘటనపై విశ్వవిద్యాలయ అధికారులు స్పందించారు. వసతిగృహం ప్రహరీగోడ ఎత్తు పెంచుతామని, సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని, రాత్రివేళల్లో మహిళా గార్డులను ఏర్పాటు చేసి భద్రతను కట్టుదిట్టం చేస్తామని తెలిపారు. అవసరమైన చోట ఎల్ఈడీ దీపాలను ఏర్పాటు చేస్తామని, దీని కోసం ఇప్పటికే సంబంధిత శాఖకు ఆదేశాలు జారీ చేశామని అధికారులు వివరించారు. ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లోని లేడీస్ హాస్టల్‌లోకి అర్ధరాత్రి ఓ ఆగంతకుడు ప్రవేశించిన విషయం తెలిసిందే. ఇంజనీరింగ్ కాలేజీ లేడీస్ హాస్టల్‌లోకి గురువారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి చొరబడ్డాడు. ఓ విద్యార్థిని బాత్‌రూమ్‌కి వెళ్లడం గమనించిన దుండగుడు డోర్ బయట నుంచి గడియ పెట్టి పైనుంచి బాత్‌రూం లోపలికి ప్రవేశించాడు. అమ్మాయికి కత్తితో బెదిరించి అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో దీంతో మిగిలిన విద్యార్థులు అక్కడికి పరుగెత్తుకొచ్చారు. అది గమనించిన దుండగుడు అమ్మాయి సెల్‌ఫోన్ లాక్కొని వచ్చిన దారి వెంటే పారిపోయాడు.

# ఆరోగ్యశ్రీ సేవలకు బ్రేక్

- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద రోగులు
- బకాయిలు చెల్లించేవరకు సేవలు నిలిపివేస్తాం
- స్పష్టం చేసిన ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు
- చర్చలకు ఆహ్వానించిన ప్రభుత్వం

హైదరాబాద్, ఆగస్టు16(ఆంఎన్ఎ) : తెలంగాణలో ఆరోగ్యశ్రీ సేవలకు బ్రేక్ పడింది. ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు ఇప్పటికీ అందకపోవడంతో శుక్రవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ ఆసుపత్రులు ఆరోగ్య శ్రీతోపాటు, ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్), జర్నలిస్టుల ఆరోగ్య పథకం (జేహెచ్ఎస్)ల కింద వైద్య సేవలన్నింటినీ నిలిపి వేశాయి. కొంతకాలంగా ప్రభుత్వం ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించడంలేదని నిరసిస్తూ ప్రైవేటు ఆస్పత్రులు ఆందోళనకు దిగాయి. ఎంతకీ ప్రభుత్వం దిగిరాకపోవటంతో శుక్రవారం ఉదయం నుంచి ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్, జేహెచ్ఎస్ వైద్యసేవలను నిలిపివేశాయి. కార్పోరేట్ ఆస్పత్రులతోపాటు 240 వరకు ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ వైద్యసేవలు ఆగిపోయాయి. ప్రభుత్వం బకాయిలు చెల్లించేంతవరకు వైద్యసేవలు నిలిపివేస్తున్నట్లు నెట్‌వర్క్ ఆస్పత్రులు ప్రకటనలో తెలిపాయి. దీంతో ఆసుపత్రులకు చేరుకున్న నిరుపేద రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. నగదు రహిత వైద్యానికి ప్రైవేట్ హాస్పిటల్స్ నిరాకరించడంతో రోగులు అత్యవసర చికిత్సలకు తప్పనిసరి పరిస్థితుల్లో డబ్బులు చెల్లించి వైద్యం చేయించుకుంటున్నారు. ఆరోగ్య శ్రీ సేవల కింద రూ. 1500కోట్ల బకాయిల చెల్లింపుతోపాటు, 2007లో చేసుకున్న ఎంవోయూ, ప్యాకేజీ రేట్ల సవరణ చేయాలని ప్రభుత్వానికి ప్రైవేటు ఆసుపత్రుల సంఘం విధించిన గడువు గురువారంతో ముగిసింది. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంతో వైద్య సేవలను నిలిపి వేయాలని నిర్ణయం తీసుకుంది.

బకాయిల చెల్లింపు కోసం ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు ఇప్పటికే చాలాసార్లు ప్రభుత్వానికి మొరపెట్టుకున్నాయి.

పెండింగ్ బిల్లుల చెల్లింపుల కోసం గతేడాది నవంబర్‌లోనే ప్రైవేటు ఆసుపత్రులన్నీ ఆందోళన చేపట్టాయి. అప్పట్లో ఒత్తిడితో దిగివచ్చిన ప్రభుత్వం బకాయిలను వెంటనే చెల్లిస్తామని ప్రకటించింది. కానీ, కేవలం రూ. 132 కోట్లు మాత్రమే చెల్లించింది. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న మొత్తం రూ. 1500 కోట్లకు చేరింది. దీంతో ఈసారి బకాయిల్లో 70 శాతం అయినా చెల్లిస్తేనే వైద్య సేవలను పునరుద్ధరిస్తామని ఆసుపత్రులు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో వారి సమస్యలను తెలుసుకునేందుకు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులను ప్రభుత్వం మధ్యాహ్నం 3గంటలకు చర్చలకు పిలిచింది.

## మధ్యప్రదేశ్‌లో పొంగిపొర్లుతున్న వాగులు

### నదిని దాటుతూ ఇద్దరు గల్లంతు

భోపాల్,ఆగస్ట్16(ఆర్ఎన్ఎ): భారీ వర్షాలకు మధ్యప్రదేశ్‌లో వర్షాలు పోటెత్తాయి. నదులు, వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ప్రధాన వాగులు పొంగిపొర్లడంతో రహదారులపైకి భారీగా వరద నీరు చేరింది. చాలా గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. రాజ్‌ఘర్ జిల్లాలో నెవాజ్ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. చుట్టుప్రక్కల గ్రామాల మధ్య రకపోకలు నిలిచిపోయాయి. ఉధృతంగా ప్రవహిస్తున్న నదిని దాటుతూ ఇద్దరు వ్యక్తులు గల్లంతయ్యారు. వారిలో ఒకరిని స్థానికులు రక్షించారు. మరొకరి ఆచూకి తెలియరాలేదు. రగంలోకి దిగిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

## చరిత్రలో నేటినిజం



కం॥ కంటిని - మదిలో - "కొడవటి
గంటి"ని - నవలలను వ్రాయు కావ్యసమధ్రునే
గంటిని - "కుటుంబరావు"ను -
తంటిని - యింటిని - గలపెడి కవితామూర్తిన్!!

( ఆగష్టు 17 కొడవటిగంటి కటుంబరావు పుణ్యతిథి...)త

-రాధశ్రీ

సెల్: 9494481210

# అశ్లీల మాధ్యమాలకు అడ్డుకట్ట వేయాలి..

నేటి నిజం
శనివారం 17-8-2019

ముక్కు పచ్చలారని పసిగొడ్డును కర్కశంగా కడతేర్చిన కర్కోటకుడికి ఎట్టకేలకు 48 రోజుల విచారణ, దర్యాప్తు భూమి మీద బతికే హక్కు లేదని న్యాయస్థానం తీర్పు నిచ్చింది. నిజంగా అందరికీ ఆనందం. రాఖీ పండుగ కు ముందు కామదహనం ఎందుకో అర్ధమయ్యే రీతిలో ఆ దహనంలో ఇలాంటివారిని వేసి తగులపెట్టినా తప్పుకాదు. కానీ, వయసుతో సంబంధం లేకుండా ఆడశిశువులపై, బాలికలపై, యువతులపై, గృహిణులపై మన దేశంలో అఘాయిత్యాలు అంతకంతకూ పెరిగిపోతూనే ఉన్నాయి. 'సంచలనాత్మక ఘటనలు' జరిగిన ప్రతిసారీ ప్రజలు ఆందోళనలు జరిపాక ప్రభుత్వాలు మేల్కొని కొత్త చట్టాలు తేవడం, ఉన్న చట్టాలను కఠినతరం చేయడం పరిపాటిగా మారింది. 2012లో దేశ రాజధానిలో ఓ విద్యార్థినిపై సామూహిక అత్యాచార ఘటన తర్వాత 2013లో 'నిర్భయ చట్టం' రూపొందింది. ఈ చట్టం కింద నమోదయ్యే కేసుల సంఖ్య పెరుగుతోందే తప్ప నేరాలు మాత్రం తగ్గుముఖం పట్టిన దాఖలాలు లేవు. 'జాతీయ నేర గణాంకాల నమోదు సంస్థ' నివేదిక ప్రకారం 2013 నాటికి దేశ వ్యాప్తంగా బాలికలపై అత్యాచారాలకు సంబంధించి 33,328 కేసులు విచారణ దశలో ఉండగా, కేవలం 1,611 కేసుల్లో నిందితులకు శిక్షలు పడ్డాయి. తగిన సాక్ష్యాధారాలు లేక వేలాది కేసులు వీగిపోతున్నాయి. పెండింగ్ కేసుల రేటు 84.5 శాతంగాను, శిక్షల రేటు 31.5 శాతంగాను ఉంది. బాలికలపై అత్యాచారాల విషయంలో దేశం మొత్తం మీద నమోదయ్యే కేసుల్లో 14 శాతం కేసులు ఢిల్లీలోనే నమోదు కావడం గమనార్హం. దేశ రాజధానిలోని ఓ అంధుల పాఠశాలలో ముగ్గురు బాలికలపై లైంగిక నేరానికి పాల్పడిన ఓ బ్రిటన్ జాతీయుడిపై కేసు నమోదు కావడం విశేషం. ఇళ్లలో, మురికివాడల్లో, తమకు తెలిసిన ప్రాంతాల్లోనే బాలికలు ఎక్కువగా లైంగిక దాడులకు గురవుతున్నారు. 38.8 శాతం కేసుల్లో సమీప బంధువులే నిందితులు కావడం ఆందోళనకరం. 60.8 శాతం మేరకు అత్యాచారాలు ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల్లో చోటు చేసుకొంటున్నాయని, బాధితుల్లో 90 శాతం మంది తమపై జరిగిన అఘాయిత్యాల గురించి ఫిర్యాదు చేసేందుకు జంకుతున్నారని గణాంకాలు ఘోషిస్తున్నాయి.

బాలలపై లైంగిక నేరాలు పెరిగిపోవడాన్ని సుప్రీం కోర్టు తీవ్రంగా పరిగణించి, కేసుల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని కేంద్రానికి, రాష్ట్రాలకు సూచించింది. 'లైంగిక నేరాల నుంచి బాలల రక్షణ' (పోక్సో) చట్టం 2012లో అమలులోకి వచ్చినా పరిస్థితిలో మార్పు రాలేదు. ఈ నేపథ్యంలో 'పోక్సో' చట్టానికి ప్రతిపాదించిన సవరణలను ఇటీవల పార్లమెంటు ఆమోదించింది. దేశ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలను పరిగణనలోకి తీసుకొని 'పోక్సో' చట్టంలో సవరణలు చేశారు. సాక్షులను విచారించేందుకు కోర్టుల్లో ప్రత్యేక గదులను ఏర్పాటు చేయాలని, బాధిత బాలలు గౌరవంగా జీవించేలా అనుకూల వాతావరణం కలిగించాలని సవరణలు చేశారు. 'పోక్సో' సవరణ చట్టంపై ప్రజానీకంలో తగిన అవగాహన కలిగించేలా వివిధ మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని ప్రతిపాదించారు. కేసు విచారణలో ఫోరెన్సిక్, డీఎన్ఏ నివేదికలు సకాలంలో అందేలా ఏర్పాట్లు చేయాలని, దేశ వ్యాప్తంగా వంద ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను నెలకొల్పాలని సూచించారు. కఠిన చట్టాలు అమలు చేస్తే తప్ప నేరగాళ్లలో భయం ఏర్పడదన్న భావంతో 'పోక్సో'లో ఇపుడు మరణదండనను చేర్చారు. బాలలతో నీలిచిత్రాలు తీసేవారికి, వాటిని వ్యాప్తి చేసేవారికి జైలుశిక్షలను, జరిమానాలను భారీగా పెంచాలని నిర్ణయించారు. 'పోక్సో' సవరణ చట్టం ప్రకారం నేరగాళ్లకు ఇరవై ఏళ్ల జైలుశిక్ష మొదలు మరణించే వరకూ జైలులోనే ఉండేలా జీవిత ఖైదు విధించడానికి అవకాశం ఉంటుంది. 2012లో అమలులోకి వచ్చిన 'పోక్సో' చట్టం కింద కేసుల సంఖ్య పెరుగుతున్నా, శిక్షలు పడుతున్న సందర్భాలు చాలా తక్కువ. కేవలం 9 శాతం కేసుల్లోనే శిక్షలు పడుతున్నాయి. 2016 నాటికి 'పోక్సో' చట్టం కింద 36,022 కేసులు నమోదు కాగా, దాదాపు 12వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. 40 శాతం మంది బాధితులకు చట్ట సహాయం కూడా అందడం లేదు. గతంలో నమోదైన కేసులతో కలిపి, ఈ చట్టం వచ్చాక పెండింగ్ కేసుల సంఖ్య లక్ష దాటింది.

ఆధునిక సాంకేతికత అందుబాటులోకి వచ్చాక సెల్‌ఫోన్లలో సామాజిక మాధ్యమాల్లో విహరించేవారి సంఖ్య అనూహ్యంగా పెరిగి సమాజంలో వికృత పోకడలు చోటుచేసుకొంటున్నాయి. ఫేస్‌బుక్, యూ ట్యూబ్, టిక్‌టాక్, వాట్సాప్ వంటి మాధ్యమాల్లో అశ్లీలం విశృంఖలమవుతోంది. సెల్‌ఫోన్లలోకి చొరబడే అశ్లీలాన్ని నిరోధించేందుకు ప్రభుత్వ పరంగా ఎలాంటి ప్రయత్నాలు జరగడం లేదు. ఫోన్లతో నిత్యం కాలక్షేపం చేసే బాలలు, యువతలో కొంతమంది దారి తప్పుతున్నారు. ఇళ్లలో తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపించడం, విద్యాసంస్థల్లో నైతిక విలువలను బోధించకపోవడంతో విపరీత పరిణామాలు అనివార్యమవుతున్నాయి. సమాజంలో విస్తరిస్తున్న వికృత పోకడలకు అడ్డుకట్ట వేయనంత కాలం– ఎన్ని కఠోర చట్టాలు తెచ్చినా, కఠిన శిక్షలు వేసినా నేరాలను రూపుమాపడం అంటే ఒక విధంగా కత్తిమీద సామే..!

## మిజిల్స్, రుబెల్లా వ్యాక్సిన్‌లపై విస్తృత ప్రచారం

### ప్రజల్లో చైతన్యం తీసుకుని వచ్చేలా కార్యక్రమం

హైదరాబాద్,ఆగస్టు16(ఆర్ఎన్ఎ): వ్యాధి నిరోధక టీకాలైన మిజిల్స్, రుబెల్లా తదితర వ్యాక్సిన్‌ల ద్వారా వ్యాధినివారణకు ప్రభుత్వం నడుం బిగించింది. నెలల నుంచి 15 ఏళ్లలోపు వయస్సుగల పిల్లలకు మిజిల్స్, రుబెల్లా, తట్టు టీకాలను వేయించవచ్చని వైద్యాధికారులు తెలిపారు. గతంలో వేయించిన పిల్లలకు వ్యాక్సినేషన్ డ్రైవ్‌లో అదనపు డోసును వేయించవచ్చని వైద్యాధికారులు స్పష్టం చేశారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పీహెచ్‌సీలు, ఏరియా, జిల్లా దవాఖానలు, ప్రసూతి కేంద్రాల్లో ఉచితంగా ఈ టీకాలను వేస్తారని అధికారులు తెలిపారు. ఈ మేరకు వివిధ జిల్లాలకు చెందిన వైద్యాధి కారులు విస్తృత ప్రచారం జరుపుతున్నారు. వ్యాక్సినేషన్‌పై సమీక్ష నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాల వైద్యయంత్రాంగం ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలతో పాటు జిల్లా వైద్యాధికారులు వ్యాక్సినేషన్ పై ప్రచారం జరుపుతున్నారు. జిల్లాల్లోని అన్ని ఆరోగ్య కేంద్రాలు, బస్తీల్లో పోస్టర్లు, కరపత్రాలతో పాటు అవగాహన సదస్సుల ద్వారా టీకాలపై ప్రచారం, అవగాహన కల్పిస్తున్నారు. వ్యాధులు వచ్చిన తరువాత దవాఖానలకు పరుగెత్తడం కంటే రోగాలు రాకుండా ముందుజాగ్రత్త పడడమే ఉత్తమమని, అందుకోసం వ్యాధినిరోధక శక్తిని పెంచే టీకాలు వేయించాలని వైద్యులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. మిజిల్స్, రుబెల్లా టీకాలు వేయడం వల్ల వ్యాధులు రాకుండా ఉంటుందని పలు అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజలకు చెబుతున్నారు. వ్యాధులు రాకుండా ముందస్తు వ్యాక్సినేషన్ చేయించుకోవడం, ఒక వేళ రోగాలు వ్యాపిస్తే వాటిని ప్రారంభదశలోనే గుర్తించి, సరైన చికిత్స చేయడం తదితర వాటిపై వైద్యాధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ టీకాల వల్ల ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవని, వాటిపై ఎలాంటి అపోహలు, అనుమానాలు పెట్టుకోనవసరంలేదని వైద్యాధికారులు స్పష్టం చేశారు. గతంలో వేయించుకున్నవారు మళ్లీ వేయించుకోవచ్చని సూచిస్తున్నారు.

## సేంద్రియ ఎరువులపై రైతుల అనాసక్తి

### రసాయన వినియోగాలకే మొగ్గు

వరంగల్,ఆగస్టు16(ఆర్ఎన్ఎ): సేంద్రీయ ఎరువుల వాడకం పెంచేందుకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా ప్రోత్సహిస్తున్నా రైతుల్లో అవగాహన కల్పించకపోవడంతో కనీసం నిర్దేశిరచిన లక్ష్యాన్ని కూడా చేరుకోలేకపోతున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా గుంతల నిర్మాణం చేపట్టుకుంటే రైతులకు వ్యయం భారం తగ్గడమే కాకుండా సేంద్రీయ ఎరువులను తయారు చేసుకోవచ్చని అధికారులు అన్నారు. అయితే అధికారులు క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పించకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరక పోవడంతోపాటు రైతులకు ప్రయోజనం లేకుండా పోతుంది.పంట పొలాల్లో రసాయనిక ఎరువులు తగ్గించాలని ప్రచారం చేయిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉచితంగా రైతులకు ఉపాధి హామీ ద్వారా నిర్మాణాలు చేపడుతున్నా అధికారుల పర్యవేక్షణతోపాటు నిర్లక్ష్యంలో లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు. అధికారులు దృష్టి సారించకపోవడంతో కనీస లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు.ప్రభుత్వం ఉపాధి హామీ పథకం రైతుల ఇళ్లలో నాడెప్ కంపోస్టు గుంతల కింద గుర్రపు నాడల గుంతల నిర్మాణాలను చేవట్టాలని ఆదేశించినా ఎక్కడా పూర్తి కాకపోవడంతో లక్ష్యం చేరుకోలేక పోతున్నారు. గుంతలను సద్వినియోగం చేసుకుంటే రైతులకు ఎంతగానో ఉపయోగకరంగా మారనుంది. సేంద్రీయ ఎరువు తయారీ చేయుటకు రైతుల భూమిలోని చెత్తను, ఇళ్ల పరిసరాల్లోని చెత్తను కంపోస్టు గుంతలో ఒకసారి మూడు వరసలో చెత్తను వేసి చేసుకునేలా సూచనలు చేస్తున్నారు. గుంత నింపిన తరువాత దానిపై గోనె సంచులు వేసి ప్రతి రోజు ఉదయం, సాయంత్రం నీళ్లు చల్లుతూ ఉండాలి. ఇలా మూడు, నాలుగు నెలల్లో సేంద్రీయ ఎరువు తయారవుతుంది. ఇలా ఎరువు తయారీ చేసుకోవడంతో రసాయనిక ఎరువులను తగ్గించడమే కాకుండా భూసారాన్ని పెంచుకుని అధిక దిగుబడులు సాధించుకోవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. కంపోస్టు గుంతల నిర్మాణాలపై ఇప్పటికే అవగాహన కల్పించారు. అయినప్పటికీ రైతులు ముందుకు రావడంలేదు. మరింత అవగాహన కల్పించి నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

# పటిష్టమైన డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అవసరం

హైదరాబాద్, జూన్ 16:దేశవ్యాప్తంగా భారీవర్షాలు,వరదలు అతలాకుతలం సహాయక చర్యలు అందక అనేకులు ఇక్కట్లు పడుతున్నారు. వివిధ రాష్ట్రాల్లో నష్టం విపరీతంగా ఉంది. సాయం కోసం మళ్లీకేంద్రం వైపు చూడాల్సిన ఆగత్యం ఏర్పడింది. దేశస్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు జరుపుకుంటున్న వేళ అనేకులు నీటిలోనే గడపాల్సిన దుర్గతి పట్టింది. ఇలాంటి దుస్థితి పోయేలా దేశాన్ని విపత్తు నిర్వహణా రంగంలో పటిష్టం చేసుకోవాల్సి ఉంది. ఇటీవలి కాలంలో ఉత్తరాది, దక్షిణాది అన్న తేడా లేకుండా వరదలు ముంచెత్తాయి. హిమాచల్ ప్రదేశ్, కేరళ రాష్ట్రాలు ఇంకా భారీ వర్షాలతో అల్లాడుతున్నాయి. మహారాష్ట్ర అల్లాడుతోంది. దీంతో సాయం కోసం ఇరు రాష్ట్రాలు ఎదురు చూస్తున్నాయి. దేశంలోని వివిధ ప్రాంతాల్లో భారీగా వరదలు వచ్చి పడ్డాయి. అనేక భవనాలు, రోడ్లు ధ్వంసం అయ్యాయి. కళ్లముందే భవనాలు, కొండచరియలు కూలిపడ్డాయి. చెట్లు కూకటి వేళ్లతో కూలాయి. మొత్తం జలమయమయ్యాయి. కళ్లముందే అంతా వర్షార్పణం అవుతుంటే గ్రాఫిక్ సినిమాలు తలపించేలా పరిస్థితి ఉంది. ఇక కేరళ,మహారాష్ట్ర, కర్నాటకలోనూ ఇంకా పరిస్థితి కుదుటపడలేదు. భారీ వర్షాల మూలంగా పెద్దయెత్తున నీరు వచ్చి చేరుతుండడంతో ప్రధానమైన డ్యాముల గేట్లను తెరవాల్సి రావడంతో దిగువన ఉన్న లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధనం లో చిక్కుకుని విలవిల్లాడుతున్నాయి.కేంద్రం విదిలింపులపై రాష్ట్రాలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయి. విపత్తుల సమయంలో ఇలాంటి విమర్శలకు తావులేకుండా స్వతంత్ర వ్యవస్థ రంగంలోకి దిగి ప్రజలను కాపాడడంతో పాటు, సహాయాక చర్యల్లో నిమగ్నమయ్యేలా ఉంటే విమర్శలకు ఆస్కారం ఉండదు. హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక, కేరళలో గతవారం రోజులుగా కుండపోతగా కురుస్తున్న వర్షాలు పెను విలయాన్ని సృష్టించాయి. పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు, విరిగిపడుతున్న కొండ చరియలు, తెగిపోయిన రోడ్లు సాధారణ పౌర జీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. లోతట్టు ప్రాంత ప్రజలను సకాలంలో సహాయక శిబిరాలకు తరలించడం, ప్రాణ నష్టాన్ని తగ్గించగలగడం అన్నది ఇలాంటి సమయాల్లో ముఖ్యం. పునరావాస శిబిరాల్లో బాధితులకు మంచినీరు, ఆహారం, మందులు వంటి కనీస సదుపాయాలు కల్పించడం,అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం కూడా ముఖ్యమే. ప్రత్యేక యంత్రాంగం ఉండివుంటే వెంటనే రంగంలోకి దిగి యుద్ధ ప్రాతిపదికపై సహాయక చర్యలు చేపట్టే వీలుంటుంది. విపత్తు నిర్వహణ అన్నది ఉమ్మడి వ్యవహారంగా ఉంటనే ఏదైనా ప్రమాదం జరిగినపుడు తక్షణం ఆదుకునేలా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. దీనికి ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటు చేసుకోవాలి. ప్రత్యేకంగా నిధులను సమకూర్చాలి. లేదా కేంద్ర,రాష్ట్రాలు ఉమ్మడిగా నిధులు సమకూర్చాలి. అలాగే దీనిని సైన్యంలో ఒక భాగంగా చేస్తే మంచి ఫలితాలు వస్తాయి. భారత్ లాంటి దేశానికి ఇది తక్షణావసరమని పాలకులు గుర్తించాలి. ఇప్పటివరకు జరిగిన అనేక విపత్తులను దృష్టిలో పెట్టుకుని తగిన తర్ఫీదు ఇచ్చి స్వయం శక్తిగా దీనిని రూపొదించాలి. దేశంలో ఎక్కడ ఏ మూలన ఎలాంటి ఉపద్రవం వచ్చిపడినా తక్షణం రంగంలోకి దిగేలా అన్ని రాష్ట్రాల్లో సన్నద్ధంగా ఉండేలా చూడాలి. ప్రస్తుత వ్యవస్థలో ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షితంగా బయటకు తీసుకురావడంలో కేంద్ర, రాష్ట్ర విపత్తు, సహాయక బృందాలు ప్రశంసనీయమైన కృషిచేస్తున్నాయి. అయితే ఇందులో ప్రధాన భూమిక రాష్ట్రాలదిగానే ఉంటోంది. అలాగాకుండా వ్యవస్థ ఉంటే సాయం కోసం కేంద్రంవైపు చూడాల్సిన ఆగత్యం రాదు. ఇప్పటికే స్వచ్ఛంద సంస్థలు, సహకార సంఘాలు, చలన చిత్ర పరిశ్రమ, ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రజలు ఉదారంగా ముందుకు వచ్చి విరాళాలందిస్తున్నారు. అయితే ఏటా ఎక్కడో ఓ చోట ఇలాంటి విపత్తులు సర్వ

సాధారణంగా మారిన దశలో ప్రత్యేక,శాశ్వత ఏర్పాటు అవసరాన్ని గుర్తించాలి. అసాధారణ వరదలు కావడంతో పెద్దయెత్తున ఆస్తినష్టం కలిగించాయి. కేరళలో అధికారిక లెక్కల ప్రకారం ఇప్పటివరకు 95 మంది ప్రాణాలు కోల్పోయారు. వేల ఎకరాల్లో పంటలు తుడిచి పెట్టుకునిపోయాయి. రాష్ట్ర విపత్తుల నిర్వహణ, సహాయక అథారిటీని పటిష్టపరచినప్పటికీ ఇప్పుడు సంభవించిన విపత్తు అసాధారణ మైనది. దీనిని ఎదుర్కోవడం అంత తేలికేమీ కాదు. అయినా, పరిస్థితి తీవ్రతకు మించిన వేగంతో ప్రభుత్వం కదిలింది. నదికి ఇరువైపులా వున్న ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసింది. విపత్తులను ఎదుర్కో వడంలో ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు అనుసరించిన మార్గాలే ఇప్పుడు శరణ్యంగా మారాయి. ఈ దుస్తితి పోవాలంటే ఓ అత్యున్నత వ్యవస్థ అవసరం అన్నది గుర్తించాలి. కేంద్రరాష్ట్రాలు ఇందుకు ముందుకు రావాలి. ఉమ్మడిగా వ్యవస్థను తయారుచేసుకోవాలి. దీనిని ఆర్మీలో భాగంగా చేస్తే మరీ మంచిది. సాధారణ ఆర్మీ ఇలాంటి సమయాల్లో అంతగా పనిచేయకపోవచ్చు. కానీ విపత్తు నిర్వహణకు కూడా ఆర్మీలాంటి దళాన్ని ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తే మంచిది. భూకంపాలు, అగ్నిప్రమాలు, వరదలు లాంటి ప్రమాదాల సమయాల్లో తక్షణం స్పందించేలా శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. ఇలాంటి దళాలను ఏర్పాటు చేయడంతో పాటు,ఆర్థిక సంపత్తిని కూడా కట్టిబెడితే మంచిది. దీనిద్వారా విపత్తు నిర్వహణతో పాటు, నిరుద్యోగ సమస్యకూడా కొంతమేర తీరవచ్చు. ఈ దిశగా ఆలోచనలు చేసి ఆచరణకు సిద్ధపడాలి. అప్పుడు ఎక్కడ ఏ ఉపద్రవం వచ్చినా రంగంలోకి దిగేలా అవకాశం ఉంటుంది.

# గ్రామాల్లో ప్రజా చైతన్యంతో పారిశుధ్యం

## పల్లెల్లో శ్రమదానాలతో పాటు పారిశుధ్య పనులు

హైదరాబాద్,ఆగస్టు16(ఆర్ఎన్ఎ): పంచాయితీల్లో పచ్చదనం పారిశుద్యం కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టాలన్న లక్ష్యం మేరకు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ వ్యాప్తంగా కార్యక్రమం మొదలయ్యింది. ఇప్పటికే ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశాలతో గ్రామల్లో పారిశుద్య కార్యక్రమాలను చేపట్టారు. దీంతో పల్లెల్లో పరిశుద్యానికి ప్రాధాన్యం రాబోతుంది.

పారిశుధ్యం, పచ్చదనం, తాగునీరు అందరి హక్కుగా ఉండాలని ముఖ్యమంత్రి సంకల్పం నెరవేరబోతుంది. ప్రతీ పల్లె పచ్చగా ఉండేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ప్రతీ పల్లె పచ్చగా పారిశుధ్య లోపం లేకుండా ఉండాలని అందరికీ కనీస మౌలిక సదుపాయాలు అందాలని ప్రభుత్వ ఆలోచన త్వరలో కార్యరూపం దాల్చనుంది. ఇందుకు గానూ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. గ్రామసర్పంచ్‌లకు మార్గనిర్దేశనం చేశారు.

దీంతో గ్రామాల్లో శ్రమదానాలు చేపట్టారు. ఇప్పటికే పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. దీంతో కొత్త పాత పంచాయతీల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. మంత్రి ఆదేశాలు రావడంతో పల్లెల్లో శ్రమదానాలకు యువత ముందుకు వచ్చింది. పలు గ్రామాల్లో అధికారులు కూడా ఇందులో పాల్గొంటున్నారు. ఇక నుంచి పచ్చగా ఉండాలని పారిశుధ్యం మెరుగుపడేలా అధికారులు ప్రత్యేక కృషి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేస్తున్నది. నిత్యం పారిశుధ్యం పనులు చేసే కార్మికులు ఏనాటి నుండో చాలి చాలని జీతాలతో గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న వారి జీవితాల్లో మార్పులు తీసుకు రావడంతో పాటు వారి వేతనాలు పెంచే కార్యక్రమం చేపట్టింది. గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రథమ ప్రాధాన్యమివ్వాలనే ఉద్దేశంతో పారిశుధ్య కార్మికులను ప్రతీ గ్రామపంచాయతీలో ఉండాలని నిర్ణయించారు. దీంతో జిల్లాలో కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీలకు కూడా పారిశుధ్యకార్మికులను నియమించుకునే అవకాశలున్నాయి. జిల్లాలో ఇప్పటికే మేజర్ గ్రామపంచాయతీల్లో 900మందికి పైగా పారిశుధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వీరు కేవలం మేజర్ గ్రామ పంచాయతీలో ఉండగా, తాజాగా నియమించే పారిశుధ్య కార్మికులు ఇక నుంచి అన్ని గ్రామ పంచాయతీల్లో ఉండనున్నారు. కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీలకు కొత్త కార్యదర్శులను నియమించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందుకు కార్యాచరణ పూర్తి కావస్తుంది. అన్ని పంచాయతీల్లో పారిశుధ్య కార్మికులు ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. ఇందుకు అవసరమైన నిధులు కేటాయించాలని ప్రభుత్వం ఇటీవల తాజాగా నిర్ణయం తీసుకుంది. ప్రత్యేక అధికారులకు ఈ బాధ్యతలను అప్పగించనున్నారు. గ్రామాల్లో ప్రత్యేక అధికారులే సుప్రీంగా వారికి నిర్ణయాధికారాలు ఇవ్వనున్నారు. ప్రతీ పల్లె చక్కటి వాతావరణంలో ఉండాలని, తాగునీరు, పచ్చదనం, పారిశుధ్యం అందరి హక్కుగా ఉండాలని నిర్ణయించారు. గ్రామాల్లో పారిశుధ్యం పనులు మెరుగు పడేందుకు పారిశుధ్య కార్మికులను నియమించేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేసింది. ఇందుకోసం వారి వేతనాలు కనీసం రూ.8500 ఉండాలని నిర్ణయించారు. జీపీల్లో పని చేసే కార్మికుడికి ఈ వేతనం వర్తింప జేయాలని ఆదేశాలు కూడా అధికారులకు అందాయి. వీరితో పాటు కొత్త కార్యదర్శులను నియమించనున్నారు. మిగతా సిబ్బందిని త్వరలో నియమించనున్నారు. గ్రామంలో మొక్కలు పెంచేలా గ్రామస్తులను అవగాహన

కల్పించాలని, ఇందుకు ప్రత్యేకాధికారులు చర్యలు తీసుకునేలా ఏర్పాట్లు చేయాలని సూచించింది. అలాగే, గ్రామాల్లో ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేవారికి అధికారాలు కూడా ఇవ్వనున్నారు

## కర్నాటకపై ప్రభావం చూపుతున్న వర్షాలు

### ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు వంకలు
### ప్రజలను వెన్నాడుతున్న అంటువ్యాధుల భయం

బెంగళూరు,ఆగస్టు16(ఆర్ఎన్ఎ): కేరళను ముంచెత్తుతున్న భారీ వర్షాల ప్రభావం.. సరిహద్దు కర్ణాటక జిల్లాలపై పడింది. అనేక జిల్లాల ప్రజలు అగచాట్ల పాలవుతున్నారు. కర్నాటక వర్షలు కూడా తోడవ్వడంతో అనేక గ్రామాఉ వరదల్లో చిక్కుకుని బురదలో కూరుకుపోయాయి. ప్రధాన పట్టణాల నుంచి మారుమూల అనేక గ్రామాలకు సంబంధాలు తెగిపోయాయి. పశ్చిమ కనుమల్లోని కొండదారుల్లో మట్టిదిబ్బలు విరిగి పడుతుండడంతో వాహన రాకపోకలకు అడ్డంకులు తప్పడం లేదు. వేలాది ఎకరాల్లో పంట పొలాల్లో నీరు చేరింది. ఈదురుగాలులకు పోక, అరటి, కాఫీ తోటలకు నష్టం వాటిల్లింది. తుంగ, భద్ర నదులు పొంగుతుండడంతో వంతెనలు నీట మునిగాయి. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని సముద్రతీరంలో హెచ్చరికలను జారీ చేశారు. నదీ పరివాహక ప్రాంతాల్లో ఉంటున్న వారిని ఇప్పటికే ఖాళీ చేయించి, సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అనేక ప్రాంతాల్లో కొండ చరియలు విరిగి పడుతుండడంతో వాటిని తొలగించే పనులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. తుంగా నది ప్రమాద స్థాయిని దాటి ప్రవహిస్తోంది. విరిగిపడ్డ కొండచరియల్ని తొలగించే పక్రియను యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. వరద తగ్గుముఖం పట్టినా అంటువ్యాదులు బెంబేలెత్తిస్తున్నాయి. వరదలు మిగిల్చిన చేదు అనుభవం ఒక ఎత్తైతే పరిసరాల్ని శుభ్రం చేయడం మరోఎత్తుగా ఉంది. పరిశుభ్రత ప్రాధాన్యతను గుర్తించిన ప్రభుత్వంలో ఇతర ప్రాంతాల నుంచి పెద్ద యెత్తున వైద్య ఆరోగ్య సిబ్బందిని వరద ప్రాంతాలకు తరలించింది. పారిశుద్ధ్య కార్మికుల సహకారాన్ని తీసుకోవడంతో పాటు ఔట్‌సోర్సింగ్ విధానం ద్వారా ఆయా స్థానిక సంస్థలు సిబ్బందిని నియమించుకుని స్వచ్ఛతా చర్యల్ని కొనసాగిస్తున్నాయి. ప్రవాహాలు తగ్గుముఖం పట్టడంతో పశువుల కళేబరాలు ఒక్కొక్కటిగా వెలుపలికి వస్తున్నాయి. వారం రోజుల పాటు ఇవి నీటిలోనే ఉండడంతో ఇప్పటికే బాగా కుళ్లాయి. వీటి వల్ల కలిగే వ్యాధులపై ప్రజల్ని అప్రమత్తం చేయడం, ప్రబలకుండా ముందు జాగ్రత్తల్ని తీసుకోవడంపై చైతన్యం కల్గించే పక్రియ ఎంతైనా అవసరం. మృతి చెందిన పశువులు ఎవరికి చెందినవో గుర్తించడం కూడా అంతే ప్రధానమైందిగా అధికారులు సూచించారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా మృతి చెందిన పశువుల యజమానులకు పరిహారాన్ని అందించేందుకు ఆధార్ కార్డులను తప్పనిసరిగా చూపాల్సి ఉంటుంది. వ్యాధులు సోకకుండా కళేబరాల్ని ఆయా గ్రామాల్లో ఒకేచోట నిప్పుపెట్టేందుకు చర్యలు తీసుకున్నారు.

వివిధ ప్రాంతాల్లో నెలకొల్పిన సహాయ కేంద్రాల్లోని బాధితులకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆత్మస్థైర్యాన్ని కల్గిస్తున్నారు. కొడగు జిల్లాలోని సహాయ కేంద్రాలకు ఈ దిశగా చైతన్యం కల్గించాలనే ఉద్దేశ్యంతో చామరాజనగర, మండ్య జిల్లాల నుంచి ఐదు మంది వైద్యుల బృందాన్ని ఆహ్వానించారు. అతిసార వ్యాధితో పాటు టైఫాయిడ్, పోలియో, కామెర్లు, నులిపురుగుల వల్ల కలిగే వ్యాధుల నివారణకు ఎలా వ్యవహరించాలో వివరిస్తున్నారు. ట్యాంకర్ల ద్వారా శుభ్రమైన తాగునీటిని అందించే ఏర్పాట్లలో నిమగ్నమైనారు.

## అన్నదాతకు అండగా బీమా సౌకర్యం

సిద్దిపేట,ఆగస్టు16(ఆర్ఎన్ఎ): టీఆర్ఎస్ సర్కార్ అన్నదాతకు అండగా నిలుస్తోందని దుబ్బాక ఎమ్మెల్యే రామలింగారెడ్డి అన్నారు. రైతుబంధు బీమా బాండ్ల పంపిణీ ఓ యజ్ఞంలా సాగుతోందని అన్నారు.రైతులకు పంట పెట్టుబడుల కోసం సీజన్‌కు ఎకరాకు రూ.5వేల చొప్పున అందించే సర్కారు

దేశంలో మరే రాష్ట్రం లేదన్నారు. రైతుల రక్షణకు భద్రతను కల్పిస్తూ రూ.5 లక్షల బీమాను కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని అన్నారు. తెలంగాణలోని కేసీఆర్ సర్కార్ రైతులు, అన్ని వర్గాల ప్రభుత్వమన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న కంటి వెలుగు పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజలను అన్ని విధాలుగా ఆదుకుంటుందని మాజీ ఎంపి గోడం నగేశ్ అన్నారు. ప్రతిపక్ష నాయకులకు అభివృద్ధి కనిపించడం లేదని ఎద్దేవా చేశారు.

# ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

## స్నేహితుడి భార్యను ఆశించి ప్రాణాలు పోగొట్టుకున్న వ్యక్తి

హైదరాబాద్,ఆగస్టు16(ఆర్ఎన్ఎ): వివాహేతర సంబంధం ప్రాణం తీసింది. వివాహేతర సంబంధం పెట్టుకున్న వ్యక్తిని.. మహిళ భర్త, బంధువులతో కలిసి గదిలో సంబంధించి తీవ్రంగా కొట్టారు. తోట ఇస్నేహితుడే నమ్మక ద్రోహం చేసి తన భార్యతో అక్రమ సంబంధంపెట్టుకోవడాన్ని జీర్ణించుకోలేని వ్యక్తి అతడిని చితకబాదండతో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. ఈ సంఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా, నర్సాపూర్కు చెందిన సూర్యనారాయణ, సునీల్లు కుటుంబాలతో కలిసి నగరానికి వచ్చి గాజుల రామారంలో నివాసం ఉంటున్నారు. సూర్యనారాయణ ఇన్ఫ్రాజెవెల్ గ్రాండ్ అపార్టుమెంట్లో ఉంటున్నాడు. కాగా.. ఒకే ఊరువారు కావడంతో సునీల్... సూర్యనారాయణ ఇంటికి తరచూ వస్తుండేవాడు. ఈ క్రమంలో సునీల్.. సూర్యనారాయణ భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. విషయం సూర్యనారాయణకు తెలియడంతో సునీల్కు బుద్ధి చెప్పాలనుకున్నాడు. ఇందుకు బావమర్దులు కిషోర్, మణికంఠ, స్నేహితుడు నాగరాజుతో కలిసి పథకం రూపొందించాడు. ఈ క్రమంలో సునీల్ రాగానే సమాచారం అందించాలని అపార్టుమెంట్ వాచ్మన్ నాగరాజ్కు చెప్పాడు. సాయంత్రం సునీల్.. అపార్టుమెంట్కు రాగానే... విషయాన్ని వాచ్మన్ సూర్యనారాయణకు చెప్పాడు. వెంటనే అతను ఇద్దరు బావమర్దులు, స్నేహితుడు, వాచ్మెన్తో కలిసి సునీల్ను అపార్టుమెంట్పై ఉన్న పెంట్ హౌజ్లో నిర్బందించి తీవ్రంగా కొట్టారు. ప్రాణాపాయ స్థితిలో ఉండగా.. వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే సునీల్ను గాంధీ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ ఉదయం సునీల్ మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ రమణారెడ్డి తెలిపారు. సంఘటనా స్థలాన్ని బాలానగర్ ఏసీపీ గోవర్ధన్ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు

# పూసల కులస్తులను ఆదుకోవాలి

### రుణాల్లో పూసల గంపకు ప్రాధాన్యత ఇవ్వాలి

వరంగల్, ఆగస్టు 16 (ఆర్ఎన్ఎ)): బీసీలలో కూడా పెద్దకులాలలోని చాలా కులాలకు ఉప కులాలున్నాయి. వాటికి ప్రభుత్వ పథకాలు ఇంకా సమర్థవంతంగా చేరాల్సి ఉంది. పూసల కులస్తులు సంచార జాతిగా అత్యంత వెనుకబాటులో ఉన్నారు. వీరిని అత్యంత వెనుకబడిన బీసీ జాబితాలో చేర్చాల్సి ఉంది. గతంలో ఉన్న అనేక కులాలు గత పాలకుల నిర్లక్ష్యం వల్ల కనుమరుగు అయ్యే పరిస్థితి ఏర్పడింది. పూసల కులస్తులు కోరినట్లు వారికి అన్నికులాల మాదిరిగానే నిధులు సమకూర్చాల్సి. అదేవిధంగా హైదరాబాద్లో కూడా ప్రతి కులాని సిఎం కేసిఆర్ కమ్యూనిటీ హాల్ కోసం స్థలం, నిధులు కేటాయిస్తున్నారని, అదే వరసలో పూసల కులస్తులకు కూడా కమ్యూనిటీ హాల్, స్థలం ఇవ్వాలని ఆ కులస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే బ్యాంకులతో సంబంధం లేకుండా రునాలు ఇవ్వాలని తెలిపారు. పూసల తల్లులు గంపను నెత్తిన పెట్టుకుని ఇప్పటికీ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతున్నారని, వీరికి బ్యాంకుతో లింక్ లేని ఈ రుణాల వల్ల చాలా మేలు జరుగుతుందన్నారు. అన్ని కులాల్లోని ఉప కులాలు, సంచార కులాలకు న్యాయం జరిగే విధంగాచూడాలని బీసీ కమిషన్ను కోరారు. బీసీలలో అత్యంత వెనుకబడిన వారికి ఆర్థిక సాయం, రుణం ఇవ్వడానికి వారికి అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించడానికి అత్యంత వెనుకబడిన బీసీల(ఎంబీసీ) కార్పోరేషన్ ఏర్పాటు చేశారు. పూసల కులస్తులు గతంలో సంచార జాతులుగా ఉండి ఎక్కడెక్కడో ఉండేవారిని, తెలంగాణ ప్రభుత్వం వచ్చాక ఇప్పుడు వీరంతా సంఘటితం అవుతున్నారని అన్నారు. వీరి శక్తిని గుర్తించాల్సిన అవసరం ప్రభుత్వాలకు కూడా ఉందన్నారు.

# మున్సిపాలిటీల్లో ఎల్ఇడి వెలుగులు

## విద్యుత్ బిల్లుల ఆదాకు యత్నాలు

కొత్తగూడెం,ఆగస్ట్16 (ఆర్ఎన్ఎ): కొత్తగూడెం ఇక ఎల్ఇడి బల్బులతో జిగేల్మననుంది. ఈ మేరకు పట్టణంలో ఈ బల్బుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో కరెంట్ ఆదా కాగలదని, మున్సిపాలిటీకి విద్యుత్ భారం తగ్గనుంది. కొత్తగూడెంతో పాటు ముప్పై మున్సిపాలిటీలలో ఎల్ఈడి బల్బులే వినియోగించేందుకు అవసరమైన ప్రణాళికను చేసింది. కొత్తగూడెం నియోజకవర్గంలోని కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలను కూడా ఈ జాబితాలో చేర్చింది. ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్కు చెందిన సిబ్బంది ఈ పట్టణాలలో సర్వే పూర్తి చేశారు. రాష్ట్రంలోని ఎంపిక చేసిన మున్సిపాలిటీలలో ఈ సంస్థనే ఎల్ఈడీ బల్బులను అమర్చేందుకు ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. కొత్తగూడెం మున్సిపాలిటీలలోని 33వార్డులలో ఇలా వీధి దీపాలను అమర్చనున్నారు. మున్సిపాలిటీలో ఇప్పుడున్న వీధిదీపాల స్థానంలో వీటిని అమరిస్తే ప్రతిరోజు సుమారు రూ.4500లు ఆదా అయ్యే అవకాశం ఉంటుంది. ఇలా నెలకు రూ.1.35లక్షలు విద్యుత్ బిల్లు భారం తగ్గనుందని అంచనా. ఎల్ఈడీ బల్బుల వినియోగంలో ప్రతి స్తంభానికి ఐడెంటిఫికేషన్ మార్కు ఇవ్వడం ద్వారా ఎక్కడ ఏ లైట్ వెలుగకపోయినా తెలుసుకునే అవకాశం కలుగుతుంది. వెంటనే దాని సమస్యను గుర్తించి పరిష్కరించేందుకు వీలుగా ఉంటుంది.

# శరవేగంగా భద్రకాళి బండ్ నిర్మాణం

## కాకతీయ కళావైభవం ఉట్టిపడేలా ఏర్పాట్లు

వరంగల్,ఆగస్టు16 (ఆర్ఎన్ఎ): కాకతీయ చారిత్రక వైభవం ఉట్టిపడేలా చారిత్రక నగరంలోని ప్రసిద్ధ భద్రకాళి దేవాలయం పక్కన భద్రకాళి బండ్ అభివృద్ధి అద్భుతంగా సాగుతోంది. కాకతీయుల కళా సంపద ఉట్టిపడేలా బండ్పై ఆర్చీల నిర్మాణం అబ్బురపరిచేలా ఉంది. భద్రకాళి బండ్పై కాకతీయుల కళా సంస్కృతి ఉట్టిపడుతోంది. బండ్పై ఏర్పాటు చేసిన ఆర్చీల నిర్మాణం పర్యాటకులను అబ్బుర పరుస్తున్నాయి. వేయిస్తంభాల దేవాలయం, రామప్పలోని శిల్పసంపదను మేళవింపుతో చెక్కిన ఆర్చీలు చాలా బాగా ఆకటుకుంటున్నాయి. సహజసిద్ధమైన అందాలు ఉన్న భద్రకాళి బండ్ వరంగల్ ప్రజలకు వరం కానుంది. తెలంగాణ పండుగ బతుకమ్మ నాటికి బండ్ అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రారంభించాలని సంకల్పించారు. భద్రకాళి బండ్ వరంగల్ ప్రజలను ఆకటుకుంటుందని, భద్రకాళి చెరువులో వాటర్ పౌంటేన్లను ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేకంగా బండ్పై పార్కును ఏర్పాటు చేసి ఆక్సిజన్ మొక్కలు పెంచాలని చూస్తున్నారు. వరంగల్ నగరానికి భద్రకాళి బండ్ ఐకాన్గా నిలుస్తుందని భావిస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, కమిషనర్ రవికిరణ్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ముందుకు సాగుతున్నారు. మొదటి దశలో 1.1 కిలోమీటర్ల మేరకు భద్రకాళి బండ్ను అభివృద్ధి చేస్తున్నారు. రెండో దశలో మరో 1.5 కిలోమీటర్ల బండ్ను అభివృద్ధి చేస్తారు. భద్రకాళి చెరువును గోదావరి నీటితో నింపడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక్కడి నుంచే పట్టణ ప్రజలకు తాగునీరు అందుతోంది. పర్యాటకులకు కనువిందు చేసేలా చెరువులో 5 వాటర్ ఫౌంటేన్లను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్చెప్పారు. అలాగే భద్రకాళి దేవాలయం గుట్టకు రాక్షో ప్రదర్శన చేసేలా ప్రణాళికలు చేస్తున్నామని ఆయన వివరించారు. భద్రకాళి చెరువులో నీటి తెర వచ్చేలా ఫౌంటెన్ను ఏర్పాటు చేసి దానిపై లెజర్షో ప్రదర్శన నిర్వహించేలా ప్రణాళికలు చేస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మొదటి సారిగా భద్రకాళి బండ్పై సింథటిక్ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. భద్రకాళి బండ్ పూర్తయితే సినిమాలకు షూటింగ్ స్పాట్గా నిలుస్తుందని అన్నారు. బండ్ అందాలు జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఎంతోగానో ఆకట్టుకుంటున్నాయిఇ. భద్రకాళి బండ్ అభివృద్ధిలో నిరంతరం కష్టపడుతున్న ప్రజాప్రతిధులు, అధికారులను పలువురు అభినందించారు.

# కులవృత్తులకు పెరిగిన ప్రాధాన్యం

## ఆర్థికంగా బలపడుతున్న ప్రజలు

యాదాద్రి,ఆగస్ట్16(ఆర్ఎన్ఎ): ప్రభుత్వం కుల వృత్తులను ప్రోత్సహించి తద్వారా గ్రామాల్లో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టిందని ఆలేరు ఎమ్మెల్యే సునీతా మహేందర్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా గొల్ల, కురుమ, యాదవ కుటుంబాలకు గొర్రెల పంపిణీ, మత్స్యకారుల కుటుంబాల ఆర్థిక జీవనం పెంపొందించేందుకు చెరువుల్లో ఉచితంగా చేపపిల్లలను వదలడం, ఓబీసీల ఆర్థిక పురోగతికి ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించడంపై ప్రత్యేకదృష్టి సారించి అమలు చేస్తోందన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలకు సంబంధించిన నిరుద్యోగులకు వారి అర్హతలను పరిశీలించి బ్యాంకు రుణాలు మంజూరీ చేసే కార్యక్రమాలు చేపట్టామన్నారు. జిల్లాలో ఉన్న గొల్లకురుమ, యాదవ కుటుంబాలకు చెందిన వారిని సంఘాలుగా ఏర్పాటు చేసి లబ్ధిదారులను లాటరీ ద్వారా ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరికి రెండు సంవత్సరాల కాలంలో 75 శాతం సబ్సిడీపై గొర్రెల యూనిట్ను పంపిణీ చేస్తామన్నారు. గొర్రెల రవాణాలోనూ, బీమా సౌకర్యం కల్పించడంలోనూ వాటిని తీసుకువచ్చాక పశుగ్రాసం అందంచడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. మత్స్యకారుల కుటుంబాలకు వారి జీవనంలో ఆర్థికాభివృద్ధి పెంపొందించేందుకు చేపపిల్లలను ఉచితంగా నిలువ చేశామన్నారు. దీంతో మత్స్యకారుల సంఘాలకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. చేనేత కార్మికుల సంక్షేమం దృష్ట్యా వారికి ఆర్థిక సాయం కల్పించేందుకు వారు చేసే పొదుపునకు ఎక్కువ లబ్ధి చేకూర్చేందుకు త్రిఫ్ట్ ఫండ్ పథకం ప్రారంభించినట్లు తెలిపారు.

# రేషన్ డీలర్లకు అదనపు ఆదాయం

## డీలర్ కేంద్రాల్లో అందుబాటులోకి ఈ-సేవలు

హైదరాబాద్,ఆగస్టు16 (ఆర్ఎన్ఎ): గ్రామీణ ప్రజల్లో అక్షరాస్యతను పెంచి డిజిటల్ ఇండియాలో భాగస్వాములను చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే పౌరసరఫరాల శాఖ ద్వారా ఈ-పాస్ విధానాన్ని విజయవంతంగా అమలు చేస్తోంది. ఇందులో భాగంగా మరిన్ని సేవలు అందుబాటులోకి రానున్నాయి. గ్రామాల్లోని రేషన్ దుకాణాల్లో వచ్చేనెల నుంచి డిజిటల్ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు తెలంగాణ సర్కార్ శ్రీకారం చుట్టింది. సెప్టెంబర్ లేదా అక్టోబర్ 2 నుంచి రేషన్ దుకాణాల్లో అందుబాటులోకి తేనున్న ఈ-సేవ కేంద్రాల ద్వారా గ్రామీణులకు బ్యాంకుల ద్వారా అందే సేవలతోపాటు ఆధార్, వివిధ రకాల పరీక్ష ఫీజులు, పన్నుల చెల్లింపుతోపాటు ఇతర అన్ని సేవలను అనుసంధానం చేయనున్నారు. వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సేవలు, నగదు రహిత సేవలను అందుబాటులోకి తేవడం ద్వారా వాటి కోసం పట్టణాలకు వెళ్లే బాధలు ప్రజలకు తప్పుతాయి. పౌరసరఫరాల శాఖ ప్రజాపంపిణీ ద్వారా అందించే సరుకులు తగ్గి ఆదాయం లేకుండా పోయిందని ఆందోళన పడుతున్న రేషన్ డీలర్లకు ప్రభుత్వం ఈ-సేవల నిర్వహణ అప్పగించి ఆదాయాన్ని రెట్టింపు చేయడంతోపాటు రోజంతా చేతినిండా పని కల్పించబోతున్నది. రేషన్ దుకాణాల్లో త్వరలో ప్రారంభం కానున్న ఈ-సేవల ద్వారా ప్రతీ సేవకు డీలర్లకు నిర్వహణ కోసం కమిషన్ రూపంలో చెల్లించబోతున్నది. దీంతో పట్టణ, గ్రామీణ ప్రాంత రేషన్ డీలర్లకు ఆదాయం పెరగడంతోపాటు ప్రజలకు వివిధ రకాల పన్నులు చెల్లించడం సులభతరం కానుంది. ప్రస్తుతం కామన్ సర్వీస్ కేంద్రాలు పని చేస్తుండగా వాటికి తోడు రేషన్ షాపుల్లోనూ టీ-వాలెట్ ద్వారా ఆన్లైన్ సేవలను అందిస్తారు. నిత్యావసర సరుకుల పంపిణీలో పారదర్శకత కోసం ప్రభుత్వ రేషన్ దుకాణాల్లో ఈ-పాస్ విధానాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ విధానం ద్వారా లబ్దిదారుడి కుటుంబంలో ఎవరైనా స్వయంగా దుకాణానికి వచ్చి వేలిముద్రల ద్వారా బియ్యం, ఇతర వస్తువులు తీసుకోవాలి. దీంతోపాటు రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ దుకాణంలో సరుకులు తీసుకునే అవకాశం ఉంది. ఈ విధానంతో నిజమైన లబ్దిదారులకు సరుకులు అందుతున్నాయి. దీంతో పట్టణాలకే పరిమితమైన డిజిటల్ విప్లవం ఇక పల్లెలకూ విస్తరించనుంది. ప్రస్తుత రోజుల్లో చేతిలో స్మార్ట్ఫోన్ ఉంటే చాలు.. బ్యాంకింగ్ సేవల నుంచి మొదలుకొని.. అన్ని చెల్లింపులూ చేయొచ్చు. అయితే, పల్లెల్లో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉంటాయి. ఈ నేపథ్యంలో ప్రజా పంపిణీ వ్యవస్థలో కీలకంగా ఉన్న రేషన్ దుకాణాల్లో మరిన్ని సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సెప్టెంబర్ నుంచి రేషన్ దుకాణాల్లో నిత్యావసర వస్తువుల పంపిణీతోపాటు ఈ-సేవ కేంద్రాల్లో లభించే అన్ని రకాల సేవలు గ్రామీణ ప్రజలకు టీ-వాలెట్ ద్వారా అందుబాటులోకి రానున్నాయి. రేషన్ షాపుల్లో ఈ-సేవలు అందుబాటులోకి వస్తే గ్రామీణ ప్రాంతాల ప్రజలు మరిన్ని ప్రయోజనాలు పొందనున్నారు. గత ఏడాది ఏర్పాటు చేసిన కామన్ సర్వీస్ సెంటర్లపై గ్రామీణులు ఆసక్తి చూపుతున్నారు. నగదు రహిత లావాదేవీలు, వివిధ రకాల పథకాలకు సంబంధించిన సేవలను ఈ-కేంద్రాల ద్వారా ప్రజలు, వినియోగదారులు సమర్థంగా వినియోగించుకుంటున్నారు. ఇకపై రేషన్ షాపుల్లో టీ-వాలెట్ అందుబాటులోకి రానుండడంతో గ్రామీణులకు, ముఖ్యంగా సమాఖ్యలు, సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు చెందిన మహిళా సంఘాల సభ్యులకు తిప్పలు తప్పనున్నాయి.

# గ్యాస్ ఉంటే కిరోసిన్ కట్

వరంగల్,ఆగస్టు16 (ఆర్ఎన్ఎ): ఆహార భద్రతకార్డుతోపాటు ఎల్పీజీ కనెక్షన్ ఉన్న వినియోగదారుడికి సెప్టెంబర్ నుంచి కిరోసిన్ సరఫరా నిలిచిపోనున్నది. దీపం పథకం లబ్దిదారులకు మాత్రం మినహాయింపు ఉంది.

వారికి ఎప్పటి మాదిరిగానే రేషన్ దుకాణాల ద్వారా ప్రతినెలా లీటరు కిరోసిన్ సరఫరా చేస్తారు. ఈ మేరకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ నుంచి జిల్లా అధికారులకు ఉత్తర్వులు వెలువడ్డాయి. కిరోసిన్ బ్లాక్ మార్కెట్కు అడ్డుకట్ట వేసేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగానే గ్యాస్ వినియోగదారులకు కిరోసిన్ నిలుపుదల చేస్తున్నారు. ఆహార భద్రతకార్డు ఉంటే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్న భావనతో పేదలతోపాటు అనర్హులు చాలా మంది వాటిని పొందారు.

రేషన్ దుకాణాల ద్వారా తీసుకుంటున్న దొడ్డు బియ్యంతోపాటు కిరోసిన్ కూడా పక్కదారి పడుతుంది. బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తున్న అక్రమార్కులు, అదేమాదిరిగా కిరోసిన్ను కూడా గుట్టుచప్పుడు కాకుండా నల్లబజార్కు తరలిస్తున్నారు. కట్టెల పొయ్యిపై వంట చేసే వారు తప్ప ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్ ఉన్న వారంతా కిరోసిన్ను బయట అమ్ముకుంటున్నారు. డీజిల్ ధర ఎక్కువగా ఉండడంతో ఆటోలు, జీపులు, లారీలకు రేషన్ దుకాణాల్లో చౌకగా దొరుకుతున్న కిరోసిన్ వాడుతున్న ఫలితంగా మంచి డిమాండ్ ఉంది. రేషన్ షాపుల్లో లీటరు కిరోసిన్ రూ. 33కు లభిస్తుంటే బహిరంగ మార్కెట్లో రూ. 50కి అమ్ముతున్నారు.

# భద్రాచలంలో భారీ పతాక ప్రదర్శన

భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్టు16(ఆర్ఎన్ఎ): 73వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని భద్రాచలంలో గురువారం 100 మీటర్ల జాతీయ పతాకాన్ని ప్రదర్శించారు. మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ క్రాంతి విద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ముందుగా బ్రిడ్జి రోడ్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు జాతీయ పతాకాన్ని ప్రదర్శించి.. భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. చివరగా అంబేద్కర్ సెంటర్లో 100 మీటర్ల జాతీయ పతాకంతో మానవహారం నిర్మించారు. ఈ కార్యక్రమంలో క్రాంతి విద్యాలయం కార్యదర్శి సోమరౌతు శ్రీనివాస రావు, మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కొప్పుల మురళి పాల్గొన్నారు.

# ప్రతి పల్లెకు స్వాతంత్ర్య ఫలాలు అందాలి: ఎమ్మెల్యే

భద్రాద్రికొత్తగూడెం,ఆగస్టు16(ఆర్ఎన్ఎ): ప్రతి పల్లెకూ స్వాతంత్య్ర ఫలాలు అందేలా అధికారులు పనిచేయాలని అశ్వారావుపేట శాసనసభ్యుడు మెచ్చ నాగేశ్వరరావు అన్నారు. అశ్వారావుపేటలో 73వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జెండా ఎగురవేసి మాట్లాడారు. అదేవిధంగా మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ జె.శ్రీరామమూర్తి, స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు రాఘవరెడ్డి, వ్యవసాయ కళాశాలలో ఏడీ నరేందర్ రెడ్డి, ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో అన్నపూర్ణ, తపాలా కార్యాలయం వద్ద ఎస్పీఎమ్ సురేశ్ కుమార్, ఐటీడీఈఈ కార్యాలయంలో డీఈ రామారావు, పలు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల వద్ద మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమాల్లో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఇళ్ల ముందు ప్రత్యక్షమవుతున్న టీవీలు!!

- వర్జీనియాలో 50ఇళ్ల ముందు ప్రత్యక్షం
- మిస్టరీగా మారిన వ్యవహారం
- దర్యాప్తును ముమ్మరం చేసిన పోలీసులు

వాసింగ్టన్, ఆగస్టు16(ఆర్ఎన్ఎ) : ఉదయం లేచేసరికి మీ ఇంటిముందు టీవీ కనిపిస్తే ఎలా ఉంటుంది. పెద్ద అనుమానం వచ్చేస్తుంది. దాన్ని అక్కడ ఎవరు పెట్టారు? ఎందుకు పెట్టారు? దాంట్లో ఏమన్నా బాంబు ఉందా? ఇటువంటి అనుమానాలన్నీ బుర్రను తొలిచేస్తాయి. ఇప్పుడు... అమెరికా... వర్జీనియాలో అదే పరిస్థితి నెలకొంది. ఒకటీ కాదు రెండు కాదు ఏకంగా 50 ఇళ్ల ముందు టీవీలు ప్రత్యక్షమయ్యాయి. దీంతో వారు బుర్రగోక్కుంటున్నారు. వాటిని వదిలి పెట్టి వెళ్తున్నారు. ఎందుకు? ఏమిటీ? ఇలా ఒకటి కాదు ఎన్నో అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. ఎవరికీ అంతుబట్టటంలేదు. దీంతో ప్రతీ ఇంటి ముందు ఉన్న సీసీ కెమెరాల పుటేజీని గమనించారు. వాటిలో హెల్మెట్ పెట్టుకున్నట్లుగా.. తలకు టీవీనే హెల్మెట్లా పెట్టుకున్న వ్యక్తులు చేతులను పట్టుకొచ్చి ఇళ్లముందు పెట్టేస్తున్నట్లుగా ఉన్నాయి. ఇంటి ముందు పెట్టటమే కాకుండా..టాటా చెప్పి మరీ వెళ్లిపోతున్నట్లు ఉంది. ముఖాలకు టీవీ సెట్లు అడ్డంపెట్టుకోవటంతో వాళ్లెవరలో తెలియట్లేదు. కొంతమంది ఇది కావాలనే చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. క్రిస్మస్ పండుగకు శాంటాక్లాజ్... గిఫ్టుల్ని ఇంటి ముందు పెట్టి వెళ్లిపోతారు. ఇప్పుడు శాంటాక్లాజ్లు టీవీలను పెట్టి పోతున్నారని అనుకుంటున్నారు. ఇలా ఇళ్లముందుకు టీవీల్ని పెట్టుడుతున్న ఘటనలో ఎక్కువగా హెన్రికో కౌంటీలోనే జరుగుతోంది. 1990 టూ 2000 మధ్య మోడల్ టీవీలనే ఇళ్లముందు పెడతున్నారు. అంటే వాటిని ఇంటి నుంచి వదిలించుకోవటానికే ఇలా చేస్తున్నారని మరికొందరు అంటున్నారు. ఈ టీవీల మిస్టరీపై పోలీసులకు పలు కంప్లెంట్స్ వస్తున్నాయి. ఇది సరదాగా చేస్తున్నారా లేక... ఏదైనా కుట్ర ఉందా అనే మిస్టరీ వీడాల్సి ఉంది. దీన్ని సీరియస్ గా తీసుకున్న పోలీసులు దర్యాప్తు స్పీడప్ చేస్తున్నారు. ఇళ్లముందుకు పెట్టిన టీవీలను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు...వాటిని రీసైక్లింగ్ చేయిస్తామని చెబుతున్నారు.

# పాలకల్తీ నిరోధానికి చర్యలు

## పాడిరైతులకు అండగా ప్రభుత్వం: లోక

ఆదిలాబాద్,ఆగస్ట్16(ఆర్ఎన్ఎ): పాలకల్తీకి పాల్పడే వారిపట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని, అలాంటి వారి ఉచ్చులో చిక్కుకుని చిక్కులు తెచ్చుకోవద్దని రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సంస్థ చైర్మన్ లోకభూమారెడ్డి అన్నారు. పాడి రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం ఇచ్చి అదనపు ధరలు చెల్లిస్తోందని అన్నారు. విజయ డెయిరీతో పాల సేకరణ చేస్తూ పాల ఉత్పత్తి కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని చెప్పారు. పాడి రైతులు అభ్యున్నతికి సర్కారు ప్రోత్సాహకాలు అందజేస్తున్నట్లు చెప్పారు. పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్గా బాధ్యతలు చేపట్టిన అనంతరం 2 లక్షలుగా ఉన్న పాడి ఉత్పత్తిని 5 లక్షల వరకు పెంచినట్లు చెప్పారు. విజయడైరీ ఉత్పత్తులను పల్లెలకు విస్తరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. విజయడెయిరీ ఆధ్వర్యంలో పాడి పరిశ్రమ ద్వారా ఉపాధిని కల్పించేందుకు అన్ని మండల కేంద్రాల్లో ఉత్పత్తులను పెంచుతున్నామని, అసక్తిగల యువకులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. విజయ డెయిరీ కల్తీ లేకుండా నాణ్యమైన పాలను అందిస్తోందన్నారు. గతంలో ప్రైవేట్ సంస్థలకు అప్పగించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డ విషయాన్ని గుర్తు చేశారు. పాడిపరిశ్రమను మరింత అభివృద్ధి చేసేందుకు బర్రెల పంపిణీ పథకం ద్వారా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తోందని అన్నారు. రాష్ట్రంలో పాడి పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అధిక నిధులను కేటాయిస్తోందని అన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి దూడలను కొనుగోలు చేసి ఇక్కడి వాతావరణానికి తట్టుకునే విధంగా పెంచాలనే ఉద్దేశంతో వాటిని పెంచేందుకు ప్రత్యేక షెడ్లను నిర్మిస్తున్నామన్నారు. పాడి పరిశ్రమ ద్వారా రైతులు మంచి లాభాలు పొందే అస్కారముందని, రైతులను పాడి పరిశ్రమవైపు ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని లోక భూమారెడ్డి అన్నారు. పాడి రైతులకు ప్రస్తుతం ధర కంటే అదనంగా రూ. 4 ఇస్తున్నామని, తాను చైర్మన్గా ఎన్నికయ్యాక మరో రూ.2 పెంచినట్లు చెప్పారు. షామీర్పేటలో 100 ఎకరాల్లో మెగా డెయిరీ నిర్మాణ కేంద్రాన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆదిలాబాద్లో పశువుల దూడల పెంపకం కోసం చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రైతులు పాడి పరిశ్రమ ద్వారా లాభాలు పొందేలా చర్యలు తీసుకుంటునట్లు వెల్లడించారు.

# మొక్కల పెంపకంలో సత్ఫలితాలు

జనగామ,ఆగస్ట్16(ఆర్ఎన్ఎ): జిల్లాలో ఒక శాతం ఉన్న అడవిని మరింత పెంపొందించేందుకు జిల్లా యంత్రాంగం విశేషంగా కృషి చేస్తోంది. తెలంగాణకు హరితహారం కింద మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించుకుని కలెక్టర్ తీసుకున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు వివిధ శాఖల సమన్వయం, సహకారంతో లక్షల మొక్కలు నాటారు. మొక్కల సంరక్షణకు ప్రత్యేక జాగత్తలు తీసుకుని ట్రీగార్డ్సతో పాటు గ్రీన్బ్రిగేడ్స్ ద్వారా నీటి సరఫరా చేపట్టారు. ఈ చర్యలతో జిల్లా నుంచి కరువును పారదోలి సస్యశ్యామలం చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నది. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు ఎంతో ఉత్సాహంగా పాల్గొని మొక్కలు నాటారు. ఇటీవలి వర్షాలకు అవి మొలకెత్తనున్నాయి. అంతేగాక వాటిని కొండలు, గుట్టలు, సాగుకు అనువుగా లేని ప్రాంతాల్లో వేయడంలోనూ అదే స్ఫూర్తిని కొనసాగించడం అభినందనీయం. విత్తన బంతుల తయారీలో రాష్ట్రంలోనే కాక దేశంలోనే జనగామ జిల్లా అగ్రగామిగా ఉంది.

# అమరుల త్యాగాలను మరువలేం

## అధికారిక నివాసంలో జెండా ఎగురేసిన రాజ్నాథ్

న్యూఢిల్లీ,ఆగస్టు16(ఆర్ఎన్ఎ): 73వ స్వాతంత్య్ర వేడుకలు దేశవ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయి. కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తన అధికారిక నివాసంలో జెండా ఎగురవేసి సిబ్బందికి స్వీట్లు పంచిపెట్టారు. సమరయోధుల పోరాటాలతోనే దేశంలో మనం స్వేచ్ఛా జీవనం గడుపుతున్నామని రాజ్ నాథ్ సింగ్ అన్నారు. త్యాగధనుల ఆత్మబలిదానాలను జాతి మరువదన్నారు. కాగా యావత్తు జెండా వందన పండుగను దేశం యావత్తు గుండె నిండా సమరయోధుల త్యాగాలను స్మరిస్తూ..స్వాతంత్య్ర దినోత్సవంలో ఘనంగా పాల్గొంటున్నారు. అమరలు త్యాగాల మేరకు మనం ముందుకు సాగాల్సి ఉందన్నారు.

ఏపీ వార్తలు

# ప్రకాశం బ్యారేజి వద్ద కొనసాగుతున్న వరద

## సందర్శకుల తాకిడితో పండగవాతావరణం

విజయవాడ,ఆగస్ట్16 (ఆర్ఎన్ఎ): విజయవాడ ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. రాష్ట్రంలోను, పొరుగు రాష్ట్రమైన తెలంగాణ లోను విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో గత వారం నుంచి కృష్ణానదికి వరద నీరు రావడం మొదలైంది.

అయితే మళ్లీ వానలు తగ్గుముఖం పట్టకపో వడంతో ఇప్పుడు నీటిరాక నిలక డగా ఉంది. దీంతో ప్రకాశం బ్యారేంజి గేట్లను కొన్ని మూసేశారు. పులిచింతల ప్రాజెక్టుకు దిగువను న్న మునేరు, కట్టలేరు, వైరా, మదిర, పాలేరు, కట్టలవాగుల నుంచి వరద నీరు పోటెత్తడంతో నీటిని బ్యారేజీ గేట్లు ఎత్తివేసి కిందికి వదిలారు. నగర వాసులు, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చి నవారు సెల్ఫీలు తీసుకున్నారు.

నిండుకుండలా మారిన కృష్ణవేణమ్మను చూసి పరవశించారు. బ్యారేజీ వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘట నలు జరగకుండా పోలీసులు బందోబస్తును కొనసాగిస్తున్నారు.జిల్లాలో కృష్ణా నది వరద ఉధృతి రెండో రోజు కూడా కొనసా గింది. మంగళవారం కంటే కాస్త పెరిగింది. ప్రకాశం బ్యారేజి నుంచి సముద్రంలోకి విడుదల చేసే నీటి పరిమాణాన్ని మరింత పెంచారు.

పులిచింతల నుంచి ఇన్ఎ÷-లో పెరగడ మే ఇందుకు కారణం. మంగళవారం రాత్రి 4 లక్షలకు పెరిగిన ఔట్ఎ÷-లోను బుధవారం సాయంత్రానికి మరింత పెంచారు. ప్రస్తుతానికి నది వెంబడి ఉన్న గ్రామాలకు పెద్దగా ఇబ్బందులు లేవు. కానీ.. ఇంకా ముప్పు సమస్య వీడలేదు. ఈ ఒరవడి 8 లక్షల క్యూసెక్కులకు పెరిగితే ముంపు ఇబ్బందులు, ప్రాణ నష్టం సంభవిస్తాయని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. రాత్రి సమయానికి పులిచింతల ప్రాజెక్టు నుంచి 3,75,671 క్యూసెక్కులు వదులుతున్నారు. వరద నీటితో పాటు పరివాహక ప్రాంతాల నుంచి వస్తున్న నీటితో కలుపుకుని బ్యారేజికి 4,27,635 క్యూసె క్కుల మేర నీటి ప్రవాహం వస్తోం ది. దీంతో పూర్తి స్థాయిలో నింపి, మిగిలిన నీటిని కాలువలకు, సముద్రంలోకి వదులుతున్నారు.

# లంకభూముల్లో విపరీతంగా పంటనష్టం

## ఆందోళనలో రైతాంగం

విజయవాడ,ఆగస్టు16 (ఆర్ఎన్ఎ): లంకల్లో నీట మునిగిన పంటలు కృష్ణానది మధ్యలో లంక గ్రామాల రైతులు సాగు చేసిన పంటలు వరదతో ముంపునకు గురవుతున్నాయి. నదిలోకి 5 లక్షల క్యూసెక్కులకుపైగా ప్రవాహం ఉండటంతో పంటలు నీట మునిగాయి. పసుపు, కంద, పండ్ల తోటలు, అరటి పంటలు ముంపునకు గురయ్యాయి. ఇప్పటివరకు 670 హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు నీట మునిగినట్లు వ్యవసాయశాఖ గుర్తించింది. వీటిల్లో మొక్కజొన్న, పత్తి, పసుపు, అరటి, కంద కూడా ఉన్నాయి.

లంక భూములు అత్యంత సారవంతమైనవి కావడంతో ఇక్కడ ఉద్యాన, వాణిజ్య పంటలు విస్తారంగా సాగు చేస్తారు. దిగుబడులు కూడా ఎక్కువగా ఉండటం, భూగర్భ జలాల లభ్యత ఉండటంతో కౌలు ధరలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. ఉద్యాన, వాణిజ్య పంటలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే ఎగువన ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో నష్టతీవ్రత తగ్గుతుందని జలవనరుల శాఖ అంచనా వేస్తోంది.

కృష్ణానదికి వరద ప్రవాహం కొనసాగుతుండడంతో లంక గ్రామాల్లో పంటలు నీట మునుగుతున్నాయి.

ప్రకాశం బ్యారేజీ నుంచి 5 లక్షల క్యూసెక్కులకుపైగా నీటిని విడుదల చేస్తుండటంతో లంకల్లోని పంట పొలాలకు వరద చేరుతోంది.

ప్రస్తుతం ఉన్న ప్రవాహంతో పెద్దగా ఇబ్బంది లేకపోయినా మరికొంత పెరిగితే పంటలకు తీవ్ర నష్టం వాటిల్లనుంది. శ్రీశైలం ప్రాజెక్టుకు వరద తగ్గడంతో నాగార్జునసాగర్, శ్రీశైలంలలో నీటి నిల్వను క్రమంగా పెంచుతున్నారు. దీనిలో నిల్వను పెంచుతూ దిగువకు విడుదల చేసే పరిమాణాన్ని తగ్గించారు. ఇదే పరిస్థితి కొనసాగితే బ్యారేజీ దిగువన ఉన్న లంక గ్రామాలకు ఇబ్బంది ఉండదని జలవనరుల శాఖ అంచనా వేస్తోంది. వరద ముంపు ఉన్న లంక గ్రామాల ప్రజలను ముందస్తుగా ఖాళీ చేయించారు. కృష్ణానది, కరకట్టకు మధ్య ఉన్న లంక గ్రామాల్లోని పొలాల్లో ఇసుక, మట్టి కోసం పెద్దఎత్తున గోతులు పెట్టడంతో నది ప్రవాహం పంట పొలాల్లోకి వస్తోంది. తీరం వెంబడి ఉన్న గట్ల పక్కనే పెద్దపెద్ద గోతులు పెట్టి మట్టిని తరలించడంతో వాటిల్లోకి వరద చేరుతోంది. పోతార్లంక సమీపంలో ఇలా గట్టు తెగి పొలాల వైపు వస్తుందని రైతులు ఆందోళన చెందారు. ఇసుక బస్తాలు వేసి నీరు పొలాలు వైపు రాకుండా చూస్తున్నారు. నది ప్రవాహానికి మట్టి కోసుకుపోతూ కొన్నిచోట్ల గట్లు కోతకు గురవుతున్నాయి. నదిలో పెద్దఎత్తున ఇసుక, మట్టి తవ్వకాలు చేయడం వల్ల ప్రవాహాలు మరింత ప్రమాదకరంగా మారుతున్నాయి. రైతుల పొలాల చెంత పెట్టిన గోతులవల్ల పొలాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. ఇటుక బట్టీల కోసం తవ్విన గోతులు రైతులకు శాపంగా మారుతున్నాయి.

# హైదరాబాద్-రామేశ్వరం ప్రత్యేక రైలు

## టెంపుల్ టూరిజానికి అనుగుణంగా కూర్పు

## బయో టాయ్‌లెట్స్ దీని ప్రత్యేకం

హైదరాబాద్,ఆగస్టు16 (ఆర్ఎన్ఎ): హైదరా బాద్-రామేశ్వరం ప్రత్యేక రైలు నెంబరు. 07685 రైలు ప్రారంభం కానుంది. దీంతో ఈ మార్గంలో వెళ్లాలనుకున్న వారికి రామేశ్వరం యాత్ర సాగనుంది. ఆగస్టు 23, 30, సెప్టెంబరు 6, 13,20,27, అక్టోబరు 4, 11, 18, 25 తేదీల్లో (శుక్రవారం) మధ్యాహ్నం 2.30 గంటలకు బయలుదేరి మరునాడు అర్ధరాత్రికి రామేశ్రం చేరుకుంటుంది. సికింద్రాబాద్‌కు 3 గంటలకు, గుంటూరుకు రాత్రి 8 గంటలకు, తెనాలికి రాత్రి 9.43కు చేరుకొంటుంది. అలానే మరుసటి రోజు వేకువజామున 3.55 గంటలకు రేణిగుంట, 6.20కి కాట్పాడి, ఉదయం 9 గంటలకు తిరువన్నామలై, 11.20కి విల్లుపురం, మధ్యాహ్నం 12.55కి చిదంబరం, 3.45కి కుంభకోణం, సాయంత్రం 4.20కి తం జావూరు, రాతిర 7.33కి కోడైకెనాల్ రోడ్, 8.15కి మధురై, అర్ధరాత్రి 12.15కి రామేశ్వరం చేరుకొంటుంది. నెంబరు. 07686 రైలు ఆగస్టు 25, సెప్టెంబరు 1, 8, 15, 22, 29, అక్టోబరు 6, 13, 20, 27 తేదీల్లో (ఆదివారం) వేకువజామున 5 గంటలకు రామేశ్వరంలో బయలుదేరుతుంది. ఈ రైలు మధురైకి ఉదయం 8.20కి, కోడైకెనాల్ రోడ్డుకి 8.55కి, తంజావూరుకు మధ్యాహ్నం 12.35కి, కుంభకోణంకు 1.30కి, చిదంబరంకు 2.40కి, తిరువన్నామలైకి సాయంత్రం 6.15కి, కాట్పాడికి రాత్రి 8 గంటలకు, రేణిగుంటకు 10.30కి, తెనాలికి వేకువజామున 4 గంటలకు, గుంటూరుకు 4.40కి చేరుకొంటుంది. అనంతరం బయలుదేరి మిర్యాలగూడ, నల్గొండ మీదగా ఉదయం 10.15కి సికింద్రాబాద్, 11 గంటలకు హైదరాబాద్ చేరుకొంటుంది. ఈ రైలులో రెండు ఎస్ఎల్ఆర్, మూడు ఏసీ త్రీటైర్, 1 ఏసీ టూటైర్, 12 స్లీపర్‌క్లాస్ బోగీలు కలిపి మొత్తం 18 బోగీలు ఉంటాయి. రామేశ్వరం-మన్‌మధురై సెక్షన్ అంతా రైళ్లని బయో టాయ్‌లెట్స్ కోచ్‌లతో మాత్రమే నడపాల్సి ఉండటంతో ఈ ప్రత్యేక రైలులోని అన్ని బోగీలకు బయో టాయ్‌లెట్స్ అమర్చారు. చాలా రోజుల తర్వాత గుంటూరు మీదగా ఒక ప్రత్యేక దూరప్రాంతానికి ప్రయాణించే రైలుని నడపనుండటంపై రైల్వేవరాలు కూడా హర్షం వ్యక్తం చేస్తోన్నాయి. ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన రామేశ్వరం ఆలయాన్ని సందర్శించేందుకు గుంటూరు మీదగా పప్రథమంగా ఒక ప్రత్యేక రైలుని నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. తొలుత 10 ట్రిప్పులు నడిపి ఆ తర్వాత ప్రయాణీకుల ఆదరణనను బట్టి కొనసాగించే విషయంలో తుది నిర్ణయం తీసుకోనున్నట్లు పేర్కొన్నది. ఇప్పటివరకు జిల్లా ప్రయాణికులు రామేశ్వరం వెళ్లాలంటే తిరుపతి, చెన్నై ఎగ్మోర్, విజయవాడ రైల్వేస్టేషన్‌లకు వెళ్లి అక్కడ రైలు ఎక్కాల్సిన పరిస్థితి ఉన్నది. దీనివలన చాలా ఇబ్బందులు పడుతోన్నారు. తాజాగా రైల్వే శాఖ ప్రత్యేక రైలుని గుంటూరు మీదగా నడిపేందుకు తీసుకొన్న నిర్ణయం ఎంతో మేలు చేకూరునున్నదని అంతా భావిస్తోన్నారు. ప్రతీ శుక్రవారం హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి గుంటూరుకు రద్దీ అధికంగా ఉంటుంది. ఈ రైలుతో ఆ కొరత తీరుతుంది. ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ కంటే ముందే గుంటూరుకు చేరుకొంటుంది. ఇక తిరుపతి(రేణిగుంట)కి కనెక్టివిటీ వస్తోన్నది. అలానే తమిళనాడు రాష్ట్రంలో ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక ప్రదేశాలైన అరుణాచలం(తిరువన్నామలై), కాట్పాడి(గోల్డెన్ టెంపుల్), చిదంబరం, కుంభకోణం, తంజావూరు, కోడైకెనాల్, మధురై, రామేశ్వరంలకు ఈ రైలు ద్వారా చేరుకోవచ్చు.

# మరో ఇద్దరిని మింగిన సెల్ఫీ సరదా

## సెల్ఫీ దిగుతూ వరదలో కొట్టుకుపోయిన తల్లీకూతుళ్లు

భోపాల్,ఆగస్టు16(ఆర్ఎన్ఎ): సెల్ఫీ సరదా తల్లీకూతుళ్ల ప్రాణం తీసింది. ప్రమాదాలను పసికట్టకుండా చేస్తున్న విన్యాసాలు ప్రాణాల మీదకు తెస్తున్నాయి. గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నదులు, కాలువలు ఉప్పొంగుతున్నాయి. ఈ ప్రకృతి అందాలను తిలకించేందుకు ప్రజలు అక్కడికి వెళ్లి ఆ అందాలను తమ కెమెరాల్లో బంధిస్తున్నారు. ఈ క్రమంలో ఓ తల్లీ, కూతురు వరద కాలువ పక్కన సెల్ఫీ తీసుకోబోయి నీటిలో కొట్టుకుపోయారు. ఈ ఘటన మధ్యప్రదేశ్‌లోని మండ్‌సార్ జిల్లాలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... స్థానిక ప్రభుత్వ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆర్‌డీ గుప్తా బుధవారం తన కుటుంబ సభ్యులతో కలిసి సమీపంలోని వరద కాలువను చూసేందుకు వెళ్లారు. ఈ క్రమంలో అతడి భార్య బింధు గుప్తా(48), కూతురు అశ్రితి(21) కాలువ వద్ద సెల్ఫీ దిగబోయారు. కాలువలో వరద ఉధృతి ఎక్కువ అవ్వడంతో వారు నిల్చున్న కల్వర్టు కూలింది. ఈ ప్రమాదంలో బింధు, అశ్రిత వరద నీటిలో కొట్టుకుపోయారు. గమనించిన స్థానికులు వెంటనే వారిని రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. మరోవైపు మధ్యప్రదేశ్‌లో కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 39 మంది మృత్యువాత పడ్డారు. గత 24 గంటల్లోనే ఏడుగురు మృతి చెందినట్లు స్థానిక అధికారులు తెలిపారు. జిల్లాలోని హైదర్వాస్ తదితర ప్రాంతాల్లో వరదల్లో చిక్కుకున్న 3 వేల మంది నిరాశ్రయులను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు మాండ్‌సార్ జిల్లా ఎస్పీ తెలిపారు. భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలో ప్రధాన నదులైన నర్మదా, బెత్వా, తపతి, తవా, చంబల్, పార్వతి నదులు పొంగి పొర్లుతున్నాయి.

ప్రజల మనస్సులు గెలిచేవిధంగా..

# వాలంటీర్లు పనిచేయాలి

- వ్యవస్థను పటిష్టంగా తీర్చిదిద్దాలన్నదే నా లక్ష్యం
- మూడు నెలల్లోనే 4లక్షల ఉద్యోగాలు కల్పించాం
- రాష్ట్రంలో ఇంటిస్థలం లేనివారు ఎవరూ ఉండకూడదు
- ఉగాది నాటికి అందరికీ ఇంటి స్థలాలను చూపించాలి
- దీనిలో వాలెంటీర్లు కీలక పాత్ర పోషించాల్సి
- గ్రామ వాలంటీర్ల వ్యవస్థను ప్రారంభించిన సీఎం జగన్
- 2,66,796 మంది వలంటీర్ల నియామకం
- స్థానిక స్వపరిపాలనలో నవశకానికి నాంది

అమరావతి, ఆగస్టు16(ఆర్ఎన్ఎ) : ప్రజల మనస్సులు గెలిచే విధంగా వాలంటీర్లు పనిచేయాలని ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి అన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేసే 'వాలంటీర్ల' వ్యవస్థను స్వాతంత్య దినోత్సవం సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డి గురువారం లాంఛనంగా ప్రారంభించారు. విజయవాడలో ఏర్పాటు చేసిన వాలంటీర్ల ముఖాముఖి కార్యక్రమంలో సీఎం జగన్ పాల్గొని.. వాలంటీర్ల వ్యవస్థను ప్రారంభించారు. దీంతో స్థానిక స్వపరిపాలనలో నవశకానికి నాంది పలికింది. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మాట్లాడుతూ.. బాపూజీ కన్న కలలను సాకారం చేసే దిశగా ఆంధ్రప్రదేశ్‌లో విప్లవాత్మక మార్పునకు పునాది పడిందన్నారు. వాలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటారని అన్నారు. 'గడిచిన 73 ఏడేళ్లలో ఇప్పటికీ కొన్ని గ్రామాలు ఇంకా స్వాతంత్ర్యానికి దూరంగా ఉన్నాయని, అభివృద్ధి, ఉపాధిలేదన్న విషయాన్ని 3648 కి.మీ నా సుదీర్ఘ పాదయాత్రలో చూశానని జగన్ అన్నారు. పేదలకు అండగా ఉన్నామన్న భరోసా ప్రభుత్వం ఇచ్చే విధంగా ఉండాలని, దానిలో భాగవే గ్రామ వాలెంటీర్ల వ్యవస్థ ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. లంచాలు, వివక్ష, కులాలు, మతాలు, రాజకీయాలు లేని వ్యవస్థను తీసుకురావాలని, రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని, ప్రజల మనసులు గెలిచే విధంగా గ్రామ వాలెంటీర్లు పనిచేయాలన్నారు. వ్యవస్థను పటిష్టంగా తీర్చిదిద్దాలన్నదే నాలక్ష్యమని, అధికారంలోకి వచ్చిన మూడు నెలలు తిరగకముందే 4లక్షల ఉద్యోగాలు కల్పించిన చరిత్ర దేశంలో ఇప్పటి వరకూ లేదన్నారు. నేను విన్నాను నేను ఉన్నాను అని నా నోట వచ్చిన స్వరం.. ఇప్పటి నుంచి మీనోట కూడా కావాలని జగన్ వాలంటీర్లకు సూచించారు. ప్రభుత్వ పథకాలకు లబ్దిదారులను గుర్తించడం, డోర్ డెలివరీ చేయడం జరుగుతుందని అన్నారు. సెప్టెంబర్ 1న శ్రీకాకుళం నుంచి రేషన్ బియ్యం డోర్‌డెలివరీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని అన్నారు. మేనిఫెస్టోలో మనం చెప్పిన ప్రతి పథకం పేదలకు చేరాలని, ప్రధానంగా నవరత్నాలు ప్రతి ఒక్కరికి అందాలని అన్నారు. రైతు భరోసా అక్టోబర్ 15న ప్రారంభిస్తామని, ప్రతి రైతుకు పెట్టుబడి సాయంగా రూ.12500 ఇవ్వాలని నిర్ణయించామని, లబ్దిదారుల ఎంపికలో లంచాలు, వివక్ష ఉండకూడదని, ప్రతిఒక్కరికి ప్రభుత్వ ఫలాలు అందాలని అన్నారు. రాష్ట్రంలో ఇంటిస్థలం లేని వారు ఎవరూ ఉండకూడదని, ఉగాది నాటికి అందరికీ ఇంటి స్థలాలను చూపించాలని, దీనిలో వాలెంటీర్లు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని, మీలోనుంచే నేను లీడర్లను తయారుచేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పెద్దిరెడ్డి, వైసీపీ ఎమ్మెల్యేలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

కాకినాడ,ఆగస్ట్16(ఆర్ఎన్ఎ): వర్షాకాలం నేపథ్యంలో అపరిశుభ్రత వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి సూచించారు.

వర్షాకాలంలో తరచూ జలుబు, మలేరియా, టైఫాయిడ్, కామెర్లు, డెంగ్యూ, ఎలర్జీ, చికెన్‌గున్యా, ఆయాసం, శ్వాసకోశ వ్యాధులతో పాటు విరేచనాలు కూడా అవుతాయన్నారు. అలాగే ఫంగల్ ఇన్‌ఫెక్షన్ వచ్చే అవకాశం ఉందన్నారు. ఇలాంటి వాటిని గుర్తించి తక్షణం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులను సంప్రదించాలన్నారు. మలేరియా వస్తే చలి జ్వరం వస్తూ ఉంటుంది. డెంగ్యూ సోకితే అధిక ఉష్ణోగ్రత, తలనొప్పి, కడుపునొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి. టైఫాయిడ్ వస్తే జ్వరం తగ్గదు. వాంతులు అవుతాయి. ఫంగల్ ఇన్‌ఫెక్షన్ వల్ల చంకలో, గజ్జల్లో తామర వస్తుందని అన్నారు. ఇలాంటి లక్షణాలు గుర్తిస్తే స్థానికంగా వైద్యుల సహకారం తీసుకుని మందులు వాడాలని అన్నారు. వ్యాధులు దరిచేరకుండా వ్యక్తిగత పరిశభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఇంటితో పాటు పరిసరాల్లో వాడి పడేసిన కొబ్బరి బొండాలు, టైర్లలో నీరు నిల్వ ఉండకుండా ఉంచుకోవాలి. నీరు నిల్వ ఉన్నచోట దోమల లార్వా ఉత్పత్తి అవుతుంది. ప్రతి ఒక్కరూ చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే రోగాలకు దూరం కావచ్చన్నారు.

# సర్కార్ తీరుతో బడుగు విద్యార్థులకు అన్యాయం

ఏలూరు,ఆగస్ట్16(ఆర్ఎన్ఎ): ఉాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యారంగ ప్రయివేటీకరణ విధానాలను ఐక్యంగా తిప్పి కొట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కె రాజశేఖర్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. రేషనైలేజేషన్ పేరుతో ప్రభుత్వ పాఠశాలలను ఈ ప్రభుత్వం మూసేస్తోందని అన్నారు. దీంతో దళిత, గిరిజన బడుగు బలహీన తరగతుల విద్యార్థులు చదువుకు దూరం కానున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ బడులను మూసేసేందుకు పెద్ద ఎత్తున కుట్ర జరుగుతోందన్నారు. మరో వైపు మున్సిపల్ పాఠశాలల్లో బలవంతంగా ఇంగ్లీషు మీడియం అమలు చేస్తుండటం దుర్మార్గమని విమర్శించారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలానే స్కాలర్ షిప్‌లు కూడా పెంచాలన్నారు. ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించేలా చర్యలు తీసుకొంటున్నారు. సంబంధిత డిమాండ్లపై ఈ నెల 24న రాష్ట్ర వ్యాపితంగా నిర్వహించనున్న ఆందోళనను జయప్రదం చేయాలని విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు.

# గాంధీ భవన్‌లో ఘనంగా పంద్రాగస్టు వేడుకలు

హైదరాబాద్, ఆగస్టు 16(ఆర్ఎన్ఎ) : 73వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను గురువారం గాంధీ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు జానారెడ్డి, షబ్బీర్ అలీ, అంజన్ కుమార్ యాదవ్, మల్లు రవి, కొండా విశ్వేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్ రాష్ట్ర ప్రజలకు స్వాతంత్య దినోత్సవ, రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. నవ భారత నిర్మాణానికి బీజం వేసిన నెహ్రూకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న విమర్శలను తిప్పికొట్టాలని ఈ సందర్భంగా పార్టీ శ్రేణులుకు పిలుపునిచ్చారు. చరిత్రను భాజపా వక్రీకరిస్తోందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని మరోసారి గుర్తుచేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కలిసి కట్టుగా పని చేద్దామని పిలుపునిచ్చారు.

తెలంగాణ భవన్‌లో..

తెలంగాణ భవన్‌లో 73వ స్వాతంత్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని.. జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దానం నాగేందర్, పార్టీ నాయకులు గుత్తా సుఖేందర్ రెడ్డితో పాటు పలువురు నాయకులు

పాల్గొన్నారు. జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం రాఖీ పండుగ సందర్భంగా కేటీఆర్ కు.. మహిళా కార్యకర్తలు రాఖీ కట్టారు. మహిళలందరికీ కేటీఆర్ రాఖీ శుభాకాంక్షలు తెలిపారు.

భాజపా కార్యాలయంలో..

రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. లంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలకు 73వ స్వతంత్ర దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యమ సమయంలో విమోచన దినం జరపాలని అన్న కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చారని విమర్శించారు. నేను తెలంగాణ ప్రజలకు హామీ ఇస్తున్న... ఈ సారి మేము విమోచన దినోత్సవం జరుపుతామన్నారు. 70 ఏళ్ల కాశ్మీర్ సమస్యకు మోదీ ముగింపు పలికారని, 18 రాష్ట్రాల్లో 50శాతానికిపైగా ప్రజలు మోదీకి మద్దతు ఇస్తున్నారని, కేటీఆర్ పరమత సహనం పట్ల వేదాలు వల్లిస్తున్నారన్నారు. తెలంగాణలో ప్రజలు అభద్రత భావంలో వున్నారని, మజ్లీస్‌ను చంకలో పెట్టుకొని కేటీఆర్ పరమత సహనం గురించి మాట్లాడుతున్నారని, మత విద్వేషాలు రెచ్చ గొట్టే వారితో టీఆర్ఎస్ అంట కాగుతున్నదన్నారు. నియంతృత్వ పోకడలకు, కుటుంబ పాలనకు చరమ గీతం పాడుదామని కాబట్టి అందరూ బీజేపీతో కలిసి రావాలని లక్ష్మణ్ పిలుపు ఇచ్చారు

జాతీయ జెండా ఆవిష్కరించిన చంద్రబాబు..

ప్రపంచంలోనే గర్వించదగ్గ స్వాతంత్య ఉద్యమ చరిత్ర మనదని తెలుగుదేశం అధినేత చంద్రబాబు అన్నారు. స్వలాభం, కుటుంబ బంధాల వంటి వాటిని తృణప్రాయంగా భావించిన ఎందరో వీరుల త్యాగఫలం నేటి మనదేశమని ఆయన అభివర్ణించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో చంద్రబాబు జాతీయ జెండాను ఎగురవేశారు. భారతదేశాన్ని ప్రపంచంలోనే అత్యుత్తమ దేశంగా ఉంచడం మన బాధ్యతని అన్నారు. ఈ సందర్భంగా దేశ ప్రజలందరికీ ఆయన 73వ భారత స్వాతంత్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కొన్ని తరాల పోరాటం, దేశప్రజల త్యాగం, సహకారం, ఐక్యతవల్లే దేశానికి స్వేచ్ఛ లభించిందని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. అలాంటి జాతీయతా స్ఫూర్తిని మనలో కలిగించిన మహానుభావులందరినీ స్మరించుకోవాల్సిన అవసరముందన్నారు.

షార్‌లో ఘనంగా స్వాతంత్య దినోత్సవం..

శ్రీహరికోట సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రంలో గురువారం 73వ స్వతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జాతీయ పతాకాన్ని షార్ డైరెక్టర్ రాజ రాజన్ ఆర్ముగం ఆవిష్కరించారు. సీఐఎస్ఎఫ్ దళాల గౌరవ వందనాన్ని స్వీకరించారు. సీఐఎస్ఎఫ్ దళాల పెరేడ్, విన్యాసాలు కేంద్రీయ పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం రాజరాజన్ మాట్లాడుతూ.. స్వతంత్ర వీరుల త్యాగమే దేశ ప్రజల స్వేచ్ఛా జీవనానికి కారణమన్నారు. దేశ అంతరిక్ష ప్రయోగాల పురోగతికి మహామహులు కృషి చేసారన్నారు. విక్రమ్ సారాభాయ్ శతజయంతి ఉత్సవాలను ఇస్రో ఏడాది పాటు నిర్వహిస్తోందని తెలిపారు. చంద్రయాన్ 2 విజయవంతంగా చంద్రగ్రహాన్ని చేరుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

# హిజ్రాల వేషంలో దొంగతనాలు

## ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు

హైదరాబాద్,ఆగస్టు16(ఆర్ఎన్ఎ): హిజ్రాల వేషం వేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను మల్కాజిగిరి సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. ఒకప్పుడు గ్రామంలో బుర్ర కథలు, ఒగ్గు కథలు చెప్పుకుని జీవించే వీరు వాటికి ఆదరణ తగ్గడంతో నగరానికి వచ్చి దొంగతనాలకు పాల్పడుతున్నారు. బోడుప్పల్‌కు చెందిన యాదయ్య, ఆంజనేయులు, బాబయ్య హిజ్రాల వేషం వేసుకొని డబ్బులు అడుక్కొని జీవిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం కుషాయిగూడ సిల్వర్ ఓక్ బంగ్లాస్ కాలనీలో ఓ ఇంటికి వెళ్లి మహిళను డబ్బులు అడగగా రూ. 200 ఇచ్చింది. ఆమె దృష్టి మళ్లించి ఇంట్లో లక్ష్మీదేవి విగ్రహం వద్ద పెట్టిన రూ. 50 వేలు అపహరించారు. డబ్బులు కనిపించకపోవడంతో బాధితురాలు కుషాయిగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సదరు నిందితులపై నిఘా పెట్టిన పోలీసులు బోడుప్పల్‌లో వారిని అదుపులోకి తీసుకున్నారు. విచారించగా చోరీలకు పాల్పడుతున్నట్లు అంగీకరించారు. వారి నుంచి ఆటో, రూ. 42 వేలు స్వాధీనం చేసుకున్నారు. ఆంజనేయులు, బాబయ్య దొంగతనాల కేసుల్లో గతంలో అరెస్టయ్యారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. అడిషనల్ డీసీపీ ఎస్‌కే సలీమా వివరాలు వెల్లడించారు.

# జవాన్ కుటుంబానికి సాయం ..అదే ఆనందం

## ట్విట్టర్‌లో వెల్లడించిన కెటిఆర్

హైదరాబాద్,ఆగస్టు16(ఆర్ఎన్ఎ): జవాన్ కుమార్తెకు సాయమందించిన విషయాన్ని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్విట్టర్ ద్వారా పంచుకున్నారు. ఆర్మీ అధికారి వీరభద్రాచారి కుమార్తెకు ఏవియేషన్ అకాడెమిలో సీటు లభించింది. ఆమె చదువుకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ఆర్థిక చేయూతను తన స్నేహితుడి ద్వారా అందించానని కేటీఆర్ ట్వీట్ చేశారు. స్వాతంత్య దినోత్సవాన్ని జరుపుకోవడానికి దీనికి మించినది ఏముంటుందని ఆయన ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ప్రచారానికి ఇష్టపడని కారణంగా తన స్నేహితుడి పేరును కేటీఆర్ వెల్లడించలేదు.

## ఐదేళ్లలో 5ట్రిలియన్ డాలర్ల..

# ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

**- 70ఏళ్లలో లేనిది 70రోజుల్లో చేసి చూపించాం**
**- ఆర్టికల్ 370 రద్దుతో పటేల్ కల నెరవేరింది**
**- ట్రిపుల్ తలాక్ రద్దుతో ముస్లిం మహిళలకు అండగా నిలిచాం**
**- ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చుతున్నాం**
**- ప్రజల కష్టసుఖాలు ఎరిగి నడుచుకుంటున్నాం**
**- రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కృషిచేస్తున్నాం**
**- ప్రతినీటి బొట్టును ఒడిసి పట్టాల్సిన అవసరం ఉంది**
**- వర్షపునీటి సంరక్షణకు ముందుకొచ్చేవాళ్లని తగినంత ప్రోత్సాహం అందిస్తాం**
**- ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో మనమే ముందు**
**- జిల్లాలను ఎగుమతుల హబ్‌లుగా మార్చుతాం**
**- సుస్థిర పాలనతో ప్రజల ఆకాంక్షలు పెరిగాయి**
**- స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోదీ**
**- ఎర్రకోటపై జాతీయ జెండాను ఎగురవేసిన మోదీ**

న్యూఢిల్లీ, ఆగస్టు16(ఆర్ఎన్ఎ) : వచ్చే ఐదేళ్లలో 5ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను మార్చడమే మా లక్ష్యమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. స్వాతంత్య దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని ఎర్రకోటపై ప్రధాని నరేంద్రమోదీ ఆరోసారి జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం త్రివిధ దళాల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మోదీ ప్రసంగిస్తూ.. 2014కు ముందు దేశ ఆర్థిక వ్యవస్థ 2ట్రిలియన్ డాలర్లు మాత్రమే అని తెలిపారు. 2014 నుంచి 2019 మధ్య 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగామని, దేశంలో మౌలిక వసతుల అభివృద్ధికి వంద లక్షల కోట్ల పెట్టుబడులు అవసరమన్నారు. వచ్చే ఐదేళ్లలో 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. అధికరణ 370 రద్దు నిర్ణయంతో సర్దార్ పటేల్ లాంటి స్వాతంత్య్ర సమరయోధుల కలలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుందని మోదీ అన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ఆర్టికల్ 370 రద్దుపై కొందరు రాజకీయ రాద్ధాంతం చేశారని చెప్పారు. జమ్మూ కశ్మీర్, లధక్ ప్రజలు ఆర్టికల్ 370, 35(ఏ) రద్దును స్వాగతించారని అన్నారు. గత ప్రభుత్వాలు ఆర్టికల్ 370పై ఎలాంటి నిర్ణయం ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. ట్రిపుల్ తలాక్ రద్దుతో ముస్లిం మహిళలకు అండగా నిలిచామని ప్రధాని పేర్కొన్నారు. చిన్నారులపై లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా కఠిన చర్యలు చేపట్టామని అన్నారు.

తాము అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవస్థలను గాడిలోకి తెచ్చామని చెప్పారు. సాగునీటి వనరుల అభివృద్ధికి జలశక్తి అభియాన్ తీసుకువచ్చామని చెప్పారు. అధికారంలోకి వచ్చిన పదినెలల్లోనే కీలక నిర్ణయాలు తీసుకున్నామని పేర్కొన్నారు. 70 ఏళ్లలో చేయలేని పనులను తాము 70 రోజుల్లోనే పనిచేశామని చెప్పుకొచ్చారు. దేశ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చామని అన్నారు.

మనం ఈరోజు స్వాతంత్య్ర దినోత్సవం జరుపుకోవడం వెనక ఎందరో మహానుభావుల ప్రాణత్యాగం ఉందని, వారి ప్రాణాలను పణంగాపెట్టి దేశం కోసం పోరాడారన్నారు. మన స్వాతంత్య్రం కోసం ఎందరో ఉరి తాళ్లకు బలయ్యారు. ఈరోజు నేను వారందరినీ గుర్తు చేసుకుంటున్నానని, వారి త్యాగాల వల్ల స్వేచ్ఛతో పాటు మన దేశం పురోగతిలో ముందుకు దూసుకెళ్తోందని మోదీ అన్నారు. ఎన్నో రంగాల్లో అభివృద్ధి చెందుతున్నామని ప్రధాని పేర్కొన్నారు. దేశంలోని రైతులు ఇబ్బందులను తొలగించి వారి అండగా ఉంటామని ప్రధాని పేర్కొన్నారు. మద్దతు ధర, పింఛన్ల పథకాల ద్వారా రైతులకు, కార్మికులకు సాంత్వన లభిస్తోందని మోదీ తెలిపారు.

నీటి సంరక్షణ కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఉండాలని భావించి ఎప్పుడూ లేని విధంగా జలశక్తి మంత్రిత్వశాఖను ఏర్పాటు చేశామని ప్రధాని తెలిపారు. ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టాల్సిన అవసరం ఉంది. వాన నీటి సంరక్షణకు ముందుకొచ్చేవాళ్లని తగినంత ప్రోత్సాహం అందిస్తాం. 2014 ఎన్నికలకు ముందు దేశం మొత్తం కలియ తిగిరానని, ఆ సమయంలో ప్రజల కష్ట సుఖాలను ప్రత్యక్షంగా చూశానని ప్రధాని తెలిపారు. దేశం పట్ల మనసులో ఏమనుకుంటున్నారో పసిగట్టగలిగానని, ప్రతిఒక్కరూ దేశంలో మార్పు రావాలని కోరుకున్నారని, ఐదేళ్ల మా పనితనంతో 2019లోనూ ప్రజలను మెప్పించగలిగామన్నారు. వ్యవస్థలను గాడిలో పెట్టామని, వేగవంతంగా పనిచేసేలా ముందుకెళుతున్నామని ప్రధాని తెలిపారు. ఎన్డీఆర్ఎఫ్ దళాల సేవలు ప్రశంసనీయమన్నారు. జమ్ముకశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి కల్పించే అధికరణ 370 రద్దుతో ఒకే దేశం ఒకే రాజ్యాంగం కల సాకారమైందని మోదీ అన్నారు. ఈ కీలక నిర్ణయానికి పార్లమెంటులో మూడు వంతుల మద్దతు లభించిందన్నారు.

స్వయంప్రతిపత్తితో అనివీతి పెరిగిపోయిందని.. మహిళలు, యువకులు, గిరిజనులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ప్రభుత్వ సాహసోపేత నిర్ణయంతో కశ్మీర్ ఇక అభివృద్ధిలో పరుగులు పెట్టనుందన్నారు. ఉగ్రవాద కార్యకలాపాలకు సైతం తెరపడనుందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భారత్ అగ్రపథాన దూసుకెళ్తోందన్నారు.

దీంతో విదేశాల్లోనూ విశ్వాసం పొందగలిగామని.. రోజు రోజుకీ ప్రజల ఆలోచనల్లో మార్పు వస్తోందన్నారు. మౌలిక సదుపాయాల గురించి ప్రజల్లో అవగాహన పెరుగుతోందన్నారు. 2014కు ముందు భారత ఆర్థిక వ్యవస్థ 2 ట్రిలియన్ డాలర్లు మాత్రమేనని.. 2014 నుంచి 19 మధ్య 3 ట్రిలియన్ డాలర్లకు చేరిందన్నారు. రానున్న ఐదేళ్లలో 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సృష్టించడమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు.

ఇందులో ప్రతిఒక్కరూ భాగం కావాల్సిన అవసరం ఉందన్నారు. దేశ మౌలిక రంగాన్ని రూ.100 లక్షల కోట్ల పెట్టుబడులతో పరుగులు పెట్టించనున్నామన్నారు. జిల్లాలు ఎగుమతి హబ్‌లుగా ఎందుకు మారకూడదు? సుస్థిరమైన ప్రభుత్వంతోనే ప్రజలకు భరోసా కలుగుతుందన్నారు. అధిక జనాభా వల్ల భావితరాలు సమస్యలను ఎదుర్కొనే ప్రమాదం ఉంది. అధిక జనాభాపై అవగాహన పెంచేలా ప్రజల్లో చర్చ జరగాలి. రైతుల ఆదాయ రెట్టింపునకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామన్నారు. వ్యవసాయం రంగంలో అంతర్జాతీయ ప్రమాణాలను అందుకునే దిశగా అడుగులు ప్రారంభించామన్నారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. మేడిన్ ఇండియా, ప్లాస్టిక్ రహిత, డిజిటల్ చెల్లింపుల విధానాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. రోజురోజుకు ప్రజల ఆలోచన తీరు మారుతోందని, మౌలిక సదుపాయాల గురించి ప్రజల్లో అవగాహన పెరుగుతోందని, చిన్న చిన్న సదుపాయాలతో ప్రజలు సంతృప్తి చెందడం లేదని, నిరంతరం మరింత అభివృద్ధిని కాంక్షిస్తున్నారని అన్నారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు కాదు.. విమానాశ్రయం ఎప్పుడొస్తుందని ప్రజలు అడుగుతున్నారని ప్రధాని తెలిపారు.

ప్రజలు ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో మాకు అవకాశం ఇచ్చారని, ప్రజలు ఆశించిన మేరకు సుపరిపాలన అందిస్తామని, ప్రజల ఆకాంక్షల మేరకు చట్టాల్లో మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. సుస్థిర ప్రభుత్వం అధికారంలో ఉండడం, సుపరిపాలన దిశగా అడుగులు వేగంగా పడుతుండడంతో సామాన్య ప్రజలు ఆశలు, ఆకాంక్షలు అమాంతం పెరిగిపోయాయని

ప్రధాని మోదీ అన్నారు. వారి ఆశల్ని, ఆశయాల్ని సాకారం చేసే దిశగా పాలన అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగా కీలక నిర్ణయాలకు శ్రీకారం చుట్టామన్నారు. రోడ్లు, రైల్వే రంగాల్లో ఆధునిక వసతులు సమకూరుతుండడంతో ప్రజలు విమానాశ్రయాల కోసం వేచిచూస్తున్నారన్నారు. ఈ ప్రసంగం సందర్భంగా మోదీ.. దేశ త్రివిద దళాలపై ప్రశంసల వర్షం కురిపించారు. దేశ రక్షణలో భాగంగా వారు చూపిన తెగువను ప్రశంసించారు.



గోల్కొండ కోటలో జెండా ఎగురేసిన అనంతరం మాట్లాడుతున్న సిఎం కెసిఆర్. చిత్రంలో సిఎస్ ఎస్‌కె జోషి కూడా ఉన్నారు.

## రైతులకు తీపి కబురు

**- ఎరువుల ధర తగ్గిస్తున్నట్లు ప్రకటించిన ఇఫ్కో**
**- అమల్లోకి వచ్చిన తగ్గింపు ధరలు**

హైదరాబాద్, ఆగస్టు16 (ఆర్ఎన్ఎ) : ఎరువుల తయారీ కంపెనీ ఇఫ్కో తాజాగా రైతులకు తీపికబురు అందించింది. కాంప్లెక్స్ ఎరువుల ధరలను తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. డీఏపీ సహా వివిధ ఫెర్టిలైజర్స్ ధరను బస్తాకు (మూటేకు) రూ.50 తగ్గించింది. ఎరువుల ధర తగ్గింపు గురువారం నుంచి అమలులోకి వచ్చింది. రైతుల ఉత్పత్తి వ్యయాలను తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని కంపెనీ తెలిపింది. 73వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా అన్ని సంక్లిష్ట ఎరువుల ధరను బ్యాగ్‌కు రూ.50 తగ్గించామని, రైతులకు ప్రయోజనం కలిగించేందుకు, వారి వ్యవసాయ ఉత్పాదక వ్యయాలను తగ్గించాలని ఈ నిర్ణయం తీసుకున్నామని ఇఫ్కో ఒక ప్రకటనలో తెలిపింది. ధర తగ్గింపుతో డీఏపీ (50 కేజీల బస్తా) ధర ఇప్పుడు రూ.1,250కు దిగొచ్చింది. ఇదివరకు దీని ధర రూ.1,300గా ఉంది. ఎన్‌పీకే 1 ధర కూడా రూ.1,250 నుంచి రూ.1,200కు తగ్గింది. ఎన్‌పీకే 2 రేటు రూ.1,210కు దిగొచ్చింది. దీని ధర ఇదివరకు రూ.1,260. ఎన్‌పీ ధర రూ.1,000 నుంచి రూ.950కి తగ్గింది. ఎన్‌పీకే అంటే నైట్రోజన్, ఫాస్పరస్, పొటాషియం. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఈయన లక్ష్యానికి అనుగుణంగా, రైతులకు ప్రయోజనం కలిగించేందుకు ఎరువుల ధర తగ్గించామని ఇఫ్కో మేనేజింగ్ డైరెక్టర్ యూఎస్ ఆవాస్తి తెలిపారు. ఇఫ్కో దేశవ్యాప్తంగా 35,000 కోఆపరేటివ్ సొసైటీల ద్వారా 5 కోట్లకు పైగా రైతులకు సేవలు అందిస్తోంది. ప్రపంచంలోనే అదిపెద్ద ప్రాసెస్డ్ ఫెర్టలైజర్ కోఆపరేటివ్‌గా ఉంది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ టర్నోవర్ రూ.27,852 కోట్లు. దీనికి ఐదు తయారీ ప్లాంట్లు ఉన్నాయి. ఈ కంపెనీ కేవలం ఎరువులు మాత్రమే కాకుండా ఇన్సూరెన్స్, రూరల్ మొబైల్ టెక్నాలజీ, ఆయిల్ అండ్ గ్యాస్, ఇంటర్నేషనల్ ట్రేడింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి పలు విభాగాల్లోనూ కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

## ఆదర్శ పాలనతో..

# దేశం దృష్టిని ఆకర్షించాం

**- తెలంగాణ రైతాంగం యావత్ భారతానికే ఆదర్శం నిలుస్తుంది**
**- పల్లెలను ప్రగతి కేంద్రాలుగా తీర్చిదిద్దుతాం**
**- అవినీతిలేని పాలనకోసమే కొత్తచట్టాలు**
**- ఐదేళ్లుగా సుస్థిర ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నాం**
**- ఉత్పత్తుల రంగంలో ముందువరుసలో ఉన్నాం**
**- రైతుబంధు, రైతుబీమా పథకాలను ఐరాస ప్రస్తావించడం గర్వకారణం**
**- కాళేశ్వరం ప్రాజెక్టును స్వల్పకాలంలోనే పూర్తి చేశాం**
**- ఇదే తరహాలోనే పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టునూ పూర్తిచేస్తాం**
**- అన్నివర్గాల సంక్షేమం కోసం ప్రత్యేక కార్యక్రమాలు**
**- కొత్త జోనల్ వ్యవస్థ ప్రకారమే నియామకాలు**
**- స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో తెలంగాణ సీఎం కేసీఆర్**
**- గోల్కొండ కోటలో జాతీయ జెండా ఎగురవేసిన సీఎం**

హైదరాబాద్, ఆగస్టు16(ఆర్ఎన్ఎ) : ఆదర్శ పాలనతో దేశం దృష్టిని ఆకర్షించామని, మన పథకాలను, మన పాలన పద్దతులను ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్నాయని సీఎం కేసీఆర్ అన్నారు. గురువారం గోల్కొండ కోటలో 73వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. గొల్కొండకు చేరుకున్న ఆయనకు పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. పతాక ఆవిష్కరణ అనంతరం స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాన్ని సీఎం గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర ప్రజలకు స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ.. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలను ఉటంకిస్తూ స్వాతంత్య్ర దినోత్సవ ప్రసంగం చేశారు. గత ఐదేళ్లుగా సుస్థిర ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నామని అన్నారు. ఉత్పత్తుల రంగంలో ముందువరుసలో ఉన్నామని తెలిపారు. రాష్ట్రంలో శాంతిసామరస్యాలు వెల్లివిరుస్తున్నాయని, రాష్ట్రాన్ని వెంటాడుతున్న శాశ్వత సమస్యలకు పరిష్కారం చూపించామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఆత్మవిశ్వాసంతో సానుకూల దృక్పథంలో ముందడుగు వేస్తోందని సీఎం అన్నారు.

గ్రామాల అభివృద్ధికి 60 రోజుల ప్రణాళిక గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి చట్టపరమైన సంస్కరణలు చేపట్టామని అన్నారు. స్వచ్ఛతే లక్ష్యంగా గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి 60 రోజుల ప్రత్యేక కార్యాచరణ చేపట్టామన్నారు. వాడని బోరుబావులు ఎక్కడున్నా మూసేయాలని కోరారు. గ్రామాలు పట్టణాల్లో పచ్చదనం పెంచేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. పల్లెలను ప్రగతి కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు సర్కారు కృషి చేస్తోందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న రైతాంగ విధానం యావత్ దేశానికి ఆదర్శం అయింది అని కేసీఆర్ స్పష్టం చేశారు. వ్యవసాయాభివృద్ధి కోసం ప్రపంచ వ్యాప్తంగా అమలయ్యేగొప్ప కార్యక్రమాల జాబితాలో మన రైతుబంధు, రైతు బీమా పథకాలను పేర్కొనడం ద్వారా ఐక్యరాజ్యసమితి మన రాష్ట్ర కీర్తిని అంతర్జాతీయ స్థాయిలో పెంచిందని, మన రాష్ట్రానికి ప్రశంసలు అందించిందన్నారు. ఇది మన రాష్ట్ర రైతు లోకానికి, మనందరికీ గర్వకారణం అని కేసీఆర్ పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు రైతుబంధు పథకం ద్వారా ఇచ్చే ఆర్థిక సహాయాన్ని ఎకరానికి ఏడాదికి 8వేల నుంచి 10వేల రూపాయలకు పెంచి, అందిస్తున్నామన్నారు. దేశంలో మరెక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో రైతుబీమా పథకాన్ని కొనసాగిస్తున్నామని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు లక్ష రూపాయల వరకున్న పంట రుణాలను మాఫీ చేయడం కోసం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువులను పునరుద్ధరించుకున్నాం అని తెలిపారు. వడివడిగా రూపుదిద్దుకుంటున్న కృష్ణ, గోదావరి ప్రాజెక్టులు మన కళ్లముందే కనిపిస్తున్నాయని, ప్రపంచమే అబ్బురపడే కాళేశ్వరం ప్రాజెక్టును ఈ మధ్యనే మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రుల సమక్షంలో మనం సగర్వంగా ప్రారంభించుకున్నామని కేసీఆర్ గుర్తుచేశారు. తెలంగాణ ప్రభుత్వం యొక్క పరిపాలనా పరిణతికి, దౌత్యనీతికి, స్నేహ సంస్కారానికి ప్రతిబింబంలా నిలిచినకాళేశ్వరం ప్రాజెక్టు దేశానికి గొప్ప సందేశం ఇచ్చిందని యావత్ దేశం కొనియాడుతున్నదన్నారు. తెలంగాణ రాష్ట్రం అవలంభిస్తున్న లివ్ అండ్ లెట్ లివ్ పాలసీ అన్ని రాష్ట్రాలకు అనుసరణీయమైన విధానమనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయని సీఎం తెలిపారు. ఇంతటి భారీ ప్రాజెక్టు నిర్మాణం కావాలంటే కనీసం 15-20 ఏళ్లు పడుతుందని, కానీ ఎండనూ, వాననూ, చలినీ లెక్క చేయకుండా రాత్రనకా పగలనకా మూడు షిఫ్టులు శ్రమించి, మూడేళ్ల స్వల్ప వ్యవధిలోనే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసిన ఇంజనీర్లు, అధికారులు, కార్మికులు, ప్రతీ ఒక్కరికీ ఈ సందర్భంగా హృదయపూర్వక అభినందనలు తెలుపుతున్నానని కేసీఆర్ అన్నారు. కార్యసాధకులందరికీ వినమ్రంగా ధన్యవాదాలు తెలుపుతున్నాను అని కేసీఆర్ చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ప్రతీ ఏటా 400 టీఎంసీల నీటిని నికరంగా ఉపయోగించుకునే అవకాశం మన రాష్ట్రానికిఏర్పడిందని అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు నీరివ్వడానికి సీతారామ ప్రాజెక్టు ద్వారా 100 టిఎంసిలు, ఉమ్మడి వరంగల్ జిల్లాకు నీరివ్వడానికి దేవాదుల ద్వారా 75 టిఎంసిల నీటిని నికరంగా వాడుకోవడానికి వీలు కలుగుతుందని అన్నారు. శరవేగంగా నిర్మాణమవుతున్న ఈ రెండు ప్రాజెక్టుల ద్వారా వచ్చే ఏడాది నుంచే సాగునీరు అందించడానికి ప్రభుత్వం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నదన్నారు. గోదావరిపై నిర్మిస్తున్న ప్రాజెక్టుల వల్ల వచ్చే జూన్ నుంచి తెలంగాణ రైతాంగం ఇప్పుడున్న గోదావరి ప్రాజెక్టులకు అదనంగా 575 టిఎంసిల నీటిని నికరంగా ఉపయోగించుకునే అవకాశం కలుగుతున్నదనే సంతోషకరమైన విషయాన్ని మీతో పంచుకుంటున్నాను అని సీఎం కేసీఆర్ తెలిపారు. పాలమూరు జిల్లాలో ఆన్ గోయింగ్ ప్రాజెక్టుల నిర్మాణాన్ని ప్రభుత్వం చాలా వేగంగా పూర్తి చేసిందని, జూరాలతో కలిపి పాలమూరు జిల్లాలో నేడు 11లక్షల 20 వేల ఎకరాలకు సాగునీరు అందించుకోగలుగుతున్నామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు మాదిరిగానే పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని చాలా వేగంగా నిర్మించి ఉమ్మడి మహబూబ్ నగర్, వికారాబాద్, రంగారెడ్డి జిల్లా రైతులకు సాగునీరు అందిస్తామని తెలియచేస్తున్నాను కేసీఆర్ వెల్లడించారు. కొత్త జోనల్ వ్యవస్థ ప్రకారమే ఉద్యోగ నియామకాలు చేపడతామని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణను వెంటాడుతున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. తెలంగాణ ఆత్మ విశ్వాసం, సానుకూల దృక్పథంతో ముందడుగు వేస్తోందని అన్నారు. ఉత్పత్తుల రంగంలో ముందువరుసలో తెలంగాణ నిలిచిందని కేసీఆర్ పేర్కొన్నారు.

## ఎర్రకోట వేదికగా ప్రధాని కీలక నిర్ణయం...

**- త్రివిధ దళాల సమన్వయం కోసం సీడీఎస్ నియామకం**

న్యూఢిల్లీ, ఆగస్టు16(ఆర్ఎన్ఎ) : దేశ రక్షణ విషయంలో తనదైన శైలిలో దూసుకుపోతున్న ప్రధాని నరేంద్ర మోదీ ఎర్రకోట సాక్షిగా కీలక నిర్ణయాన్ని ప్రకటించారు. త్రివిధ దళాల్లో మార్పులే లక్ష్యంగా స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. త్వరలో త్రివిధ దళాల సమన్వయం కోసం ఒక చీఫ్‌ను నియమించనున్నామని ప్రకటించారు. ఆయన్ని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్‌గా (సీడీఎస్) వ్యవహరించనున్నారు. దీని ద్వారా సైనిక విభాగాల మధ్య మెరుగైన సమన్వయానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. దేశాల మధ్య పరిస్థితులు త్వరితగతిన మారుతున్నాయని.. రక్షణ సాంకేతికతలో పెను మార్పులు సంభవించాయన్నారు. ఈ తరుణంలో ఏదో ఒక సైనిక విభాగంపై ఆధారపడడం సరికాదని.. త్రివిధ దళాలను సమన్వయ పరుచుకుంటూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. దేశ భద్రత, ముఖ్యంగా మిలిటరీ వ్యవహారాల్లో ప్రధానికి సీడీఎస్ సాయ పడనున్నారు. ఈ నిర్ణయాన్ని పలువురు ప్రముఖులు గొప్ప సంస్కరణగా అభివర్ణించారు. సీడీఎస్‌ను త్రివిధ దళాల్లోని ఏదో ఒక విభాగం నుంచి ఎన్నుకోనున్నారు. మూడు దళాల్లోని సీనియర్ అధికారిని ఎన్నుకునే అవకాశాలు ఉన్నాయని నిపుణులు అభిప్రాయపడ్డారు. కార్గిల్ యుద్ధం తరవాత రక్షణ సంస్కరణలపై ఏర్పాటైన కె.సుబ్రహ్మణ్యం కమిటీ.. తొలిసారి సీడీఎస్ నియామకాన్ని సిఫార్సు చేసింది. అనంతరం రక్షణ దళాల ఉన్నతాధికార వ్యవస్థలో మార్పుల కోసం ఏర్పాటైన నరేశ్ చంద్ర కమిటీ సైతం సీడీఎస్ వ్యవస్థ ప్రాముఖ్యతను నొక్కి చెప్పింది. దివంగత నేత మనోహర్ పారికర్ రక్షణ మంత్రిగా ఉన్న సమయంలోనే సీడీఎస్ నియామకానికి సంబంధించి కొన్ని సంకేతాలిచ్చారు. కానీ, రాజకీయపరమైన నిర్ణయాల్లో భాగంగా ఆయన తిరిగి సొంత రాష్ట్రం గోవాకు వెళ్లిపోవడంతో ఆ ప్రతిపాదన మరుగున పడింది.

## కేసీఆర్ కిట్‌తో పెరిగిన ప్రసవాలు

జనగామ,ఆగస్ట్16 (ఆర్ఎ న్ఎ): కెసిఆర్ కిట్ పథకంతో ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగిందని స్టేషన్ ఘనాపూర్ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య అన్నారు.

ప్రభుత్వం ఆస్పత్రులకు అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించి, అవసరమైన సాంకేతిక పరికరాలు అందించి సామాన్య ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషిచేస్తోందన్నారు. సర్కార్ దవాఖానాల్లో ప్రసవాల సంఖ్య పెరిగేందుకు తల్లీబిడ్డల సంరక్షణకు ప్రవేశపెట్టిన కేసీఆర్ కిట్ పథకం కింద జిల్లాలో ప్రసూతి పొందిన స్త్రీలకు 15 రకాల వస్తువులతో కూడిన కేసీఆర్ కిట్‌తో పాటు ఆడపిల్ల పుడితే 13వేలు, మగపిల్లవాడయితే రూ.12వేల అందిస్తున్నట్లు తెలిపారు.

జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధి ద్వారా అనేక మంది దేశ, విదేశ పర్యాటకుల దృష్టి పడి వారి సందర్శనతో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయనడంతో ఎలాంటి సందేహం లేదన్నారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో పలు పర్యాటక ప్రాంతాలకు మంజూరు చేసిన పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు.

## ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ సంచలన నిర్ణయం

**- రాష్ట్రంలోని మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం**
**- అక్టోబర్ 29 నుంచి అమల్లోకి**

న్యూఢిల్లీ, ఆగస్టు16(ఆర్ఎన్ఎ) : త్వరలో అసెంబ్లీ ఎన్నికల రానున్న నేపథ్యంలో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ సంచలన నిర్ణయాలు తీసుకుంటున్నారు.

ఒక్కొక్కటిగా ఉచిత పథకాలను అమలు చేస్తూ ప్రజాభిమానాన్ని మరింత పెంచుకొనేందుకు దృష్టిసారించారు. ఇప్పటికే బీజేపీ ఈదఫా ఢిల్లీలో పాగావేయాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తుండగా, బీజేపీ ఎత్తులను చిత్తుచేస్తూ ప్రజలను మరింత దగ్గరయ్యేందుకు కేజ్రీవాల్ వినూత్నరీతిలో ముందుకెళుతున్నారు. తాజాగా కేజ్రీవాల్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల కొద్ది రోజులుగా ఢిల్లీ వాసులపై వరాలు కురిపిస్తున్న ఆయన రక్షాబంధన్ పండుగ సందర్భంగా వినూత్న పథకానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలోని మహిళలందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపి, ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పిస్తున్నట్లు ప్రకటించారు. వచ్చే అక్టోబర్ 29 నుంచి ఈ పథకాన్ని అమల్లోకి తీసుకొస్తామని చెప్పారు. ఢిల్లీ మెట్రోల్లో, బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ వెసులుబాటును కల్పిస్తామని రెండు నెలల క్రితం చేసిన ప్రకటన మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ బస్సుల్లో రాష్ట్రంలోని మహిళందరూ ఉచితంగా ప్రయాణించొచ్చని పేర్కొన్నారు. సీఎం కేజ్రీవాల్.. ఢిల్లీ వాసులకు ఫ్రీ వైఫై సౌకర్యాన్ని కల్పిస్తామంటూ ఇటీవలే ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రతి పౌరుడికి 15జీబీ డేటా ద్వారా ఉచిత ఇంటర్నెట్ కల్పిస్తామని హామీ ఇచ్చారు. రానున్న మూడు లేదా నాలుగు నెలల్లో మొదటి విడతలో భాగంగా నగర వ్యాప్తంగా కనీసం 11 వేల వైఫై హాట్‌స్పాట్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. 70అసెంబ్లీ కేంద్రాల్లో ఒక్కోదాంట్లో 1000 హాట్‌స్పాట్లతోపాటు బస్ స్టేషన్‌లలో మరో 4000 కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు.

## భారత ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన రష్యా

న్యూఢిల్లీ, ఆగస్టు16(ఆర్ఎన్ఎ) : స్వాతంత్య్ర దినోవత్సవం సందర్భంగా భారత ప్రజలకు రష్యా శుభాకాంక్షలు తెలిపింది. ఈ మేరకు ఆ దేశ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్.. ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌లకు లేఖ రాశారు. 'భారతీయ ప్రజలకు స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు. ఆర్థికంగా, సాంకేతికంగా, సాంస్కృతికంగా భారత్ సరైన మార్గంలో ఉంది. అంతర్జాతీయంగా కూడా మంచి పేరు తెచ్చుకుంది. రష్యా-భారత్ మధ్య సంబంధాలు ఎప్పటికీ ఇలాగే కొనసాగాలి. ఇరు దేశాల మధ్య ఉన్న ద్వైపాక్షిక సంబంధాలను మరింత మెరుగుపడాలి. ఇది ఇరు దేశాల ప్రజల కోరిక.

# మూడు నెలల్లో చరిత్ర సృష్టించాం

- అవినీతి రహిత పాలనే ప్రభుత్వ లక్ష్యం
- త్వరలో 2.66 లక్షల ఉద్యోగాలు
- గ్రామ రూపురేఖలు మార్చేందుకు గ్రామసచివాలయాలు తీసుకొచ్చాం
- ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తాం
- గాంధీ, అంబేద్కర్ ప్రేరణతోనే నవరత్నాలు
- పేదలు, రైతులకు ఉచిత విద్యుత్ అందించేలా కృషి
- కౌలు రైతులకోసం వైఎస్ఆర్ రైతు భరోసా కార్యక్రమం
- ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేస్తాం
- బీసీ కమిషన్ ఏర్పాటు చేస్తున్న మొట్టమొదటి రాష్ట్రం మనదే
- నిరుద్యోగ యువతకు మేలుజరిగేలా చట్టాలు చేస్తే నానా యాగీచేస్తున్నారు
- దోపిడీదారుల అక్రమాలకు అడ్డుకొనేందుకే టెండరింగ్ విధానం మార్చాం
- ల్యాండ్ మాఫియా, అక్రమ రిజిస్ట్రేషన్‌లకు చెక్ పెట్టబోతున్నాం
- మన తలరాతలను మనమే మార్చుకోవాలి
- స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ముఖ్యమంత్రి జగన్

విజయవాడ, ఆగస్టు16(ఆర్ఎన్ఎ) : అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే చరిత్ర సృష్టించామని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు, పేద ప్రజల అభ్యున్నతికోసం ప్రత్యేక పథకాలను చేపట్టామని ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ మైదానంలో 73వ స్వాతంత్ర్యవేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యమంత్రి జగన మోహన్‌రెడ్డి జాతీయపతాకాన్ని ఎగురవేశారు. అంతకుముందుకు ఆయన పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పతాక ఆవిష్కరణ అనంతరం విధినిర్వహణలో ప్రతిభ కనబరిచిన పలువురు అధికారులకు సీఎం జగన్ పతకాలు ప్రదానం చేశారు. అనంతరం రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం చేశారు. మన తలరాతలను మనమే మార్చుకోవాలన్నారు. స్వాతంత్ర్య సాధనకు ఎన్ని పోరాటాలు చేయాలో మన స్వాతంత్ర్య ఉద్యమం చెబుతోందన్నారు. ప్రధానంగా శాంతి, అహింసా ఆయుధాలుగా స్వాతంత్ర్య తెచ్చుకున్నామని గుర్తు చేశారు. స్వాతంత్ర్యం ఓ నినాదం కాకుండా ప్రభుత్వ విధానం కావాలని అన్నారు. ప్రాథమిక హక్కులు రాజ్యాంగానికి ఆత్మ వంటివని అంబేద్కర్ చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా నవరత్నాలను రూపొందించామని ముఖ్యమంత్రి జగన్ వెల్లడించారు. భారతదేశ రాజకీయ చరిత్రను మలుపు తిప్పేలా సామాజిక న్యాయానికి చట్టాలు తీసుకొచ్చామన్నారు. అవినీతి రూపుమాపేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామ రూపురేఖలు మార్చేందుకు గ్రామసచివాలయాలు తీసుకొచ్చామని, రైతలుకు, పేదలకు ఉచితంగా విద్యుత్ ఇచ్చేందుకు కృషి చేస్తున్నామని జగన్ అన్నారు. పరిశ్రమల్లో 75శాతం ఉద్యోగాలు కచ్చితంగా స్థానికులకే ఇస్తామన్నారు. పరిశ్రమలకు దరఖాస్తు చేస్తున్నప్పుడే స్థానికులకు శిక్షణ ఇచ్చి వెన్నుదన్నుగా నిలబడాలని నిర్ణయించామన్నారు. సామాజిక న్యాయం చరిత్రలోనే లేని విధంగా బడుగు, బలహీన వర్గాల మహిళలకు పెద్దపీట వేశామన్నారు. బీసీ కమిషన్ ఏర్పాటు చేస్తున్న మొట్టమొదటి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని గట్టిగా చెప్పగలనన్నారు. బీసీ కులాలు అంటే భారతీయ సంస్కృతి, నాగరికతలకు బ్యాక్ బోన్ క్లాసులుగా చూస్తామని చెప్పామని, బీసీ, ఎస్సీ, ఎస్టీలకు నామినేటెడ్ పదవులకు 50 శాతం రిజర్వేషన్లు ఇస్తూ చట్టం చేశామన్నారు. బీసీ,ఎస్సీ, ఎస్టీ మైనారిటీలకు నామినేటెడ్ పనుల్లోనూ 50 శాతం రిజర్వేషన్లు ఇస్తూ చట్టం చేశామని సీఎం జగన్ అన్నారు. భూయజమాని హక్కులకు ఎలాంటి భంగం వాటిల్లకుండా కౌలు రైతుల కోసం వైఎస్ఆర్ రైతు భరోసా కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ముఖ్యమంత్రి అనారు. దీంతోపాటు ఉచితంగా పంటల బీమా కల్పించామన్నారు. కార్పొరేట్ సంస్కృతిని మార్చేందుకు పాఠశాల విద్యా నియంత్రణ పర్యవేక్షణ చేశామన్నారు. పేద, మధ్య తరగతి కుంటుంబాలకు అండగా నిలిచిన ప్రభుత్వం మనదని చెప్పడానికి గర్వపడుతున్నానని సీఎం జగన్ అన్నారు. మానవ అభివృద్ధి సూచీలో మనం ఎక్కడ ఉన్నామో ఆలోచించుకోవాలని సూచించారు. వ్యవసాయం, పరిశ్రమ, సేవా రంగాల్లో ఎంత అభివృద్ధి ఉందో చూడాలన్నారు. వీటికంటే దళారీ వ్యవస్థ, అవినీతి అంతకంటే ఎంతగానో బలపడిందన్నారు. కమీషన్లు, దోపిడీలుగా మారిన వ్యవస్థను మారుస్తున్నామని తెలిపారు. టెండర్ పనుల ఖరారు పక్రియను హైకోర్టు జడ్జి ముందు పెడుతున్నామని, దీంతో దేశ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా టెండర్ల పక్రియలో అత్యుత్తమ విధానాలకు శ్రీకారం చుట్టామని గుర్తు చేశారు. విద్యా ప్రమాణాలు మెరుగుపరచడం, సాంకేతిక నైపుణ్యాలను పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. కేవలం జీడీపీని మాత్రమే కాకుండా మానవ అభివృద్ధి సూచికను కూడా మెరుగు పరచాలని నిర్ణయించామని సీఎం జగన్ అన్నారు. ఫ్లలెల్లో ఉన్నవారికి కూడా సంక్షేమాన్ని అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గ్రామాలు బాగుంటేనే రాష్ట్రం బాగుపడుతుందని నమ్ముతున్నామని, పంచాయతీల్లో గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పట్టణాల్లో వార్డు సచివాలయాలు ఏర్పాటు చేస్తున్నామని, శాశ్వత ఉద్యోగాలతోపాటు గ్రామ, పట్టణ ప్రాంతాల్లో ప్రతి 50ఇళ్లకు ఒక వాలంటీర్‌ని నియమించామని అన్నారు. వాలంటీర్ల వ్యవస్థ ప్రారంభానికి ఇవాళే శ్రీకారం చుడుతున్నామని, మరో 2.66 లక్షల ఉద్యోగాలను ఇవ్వబోతున్నామని సీఎం చెప్పారు.

గోదావరి జలాలను సాగర్, శ్రీశైలానికి తరలించడం ద్వారా కృష్ణా ఆయకట్టును స్థిరీకరించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని సీఎం జగన్ అన్నారు. నీటి పారుదల ప్రాజెక్టులన్నీ యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మెట్ట ప్రాంత రైతుల కోసం 200 రిగ్గులు కొనుగోలు చేసి ఉచితంగా బోర్లు వేయబోతున్నామన్నారు. అప్పుల పాలవుతున్న రైతులకు అండగా ఉండాల్సిన అవసరముందని, పొగాకు ధరలు తగ్గుతున్నాయని తెలిసీ ధరల స్థిరీకరణకు వెంటనే చర్యలు తీసుకున్నామని సీఎం వెల్లడించారు. రానున్న మూడేళ్లలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చబోతున్నామని సీఎం ప్రకటించారు. బడులు ప్రారంభించేనాటికి విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు, బూట్లు అందిస్తామన్నారు. కేజీ నుంచి పీజీ వరకు ప్రతి స్థాయిలోనూ పేద కుటుంబాల పిల్లలకు అండగా ఉంటామన్నారు. నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. రూ.1000 ఉన్న పింఛన్ సొమ్మును రూ.2,250కి తీసుకెళ్లామన్నారు. ఏటా రూ.250 పెంచుకుంటూ భవిష్యత్‌లో దీనిని రూ.3వేలు చేస్తామన్నారు. పింఛన్ అర్హత వయస్సును 65 నుంచి 60 ఏళ్లకే తగ్గించిన విషయాన్ని సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రస్తావించారు.



విజయవాడలో పంద్రాగస్ట్ వేడుకల్లో పోలీసులకు మెడల్స్ ప్రదానం చేస్తున్న ఏపి సిఎం వైఎస్ జగన్

# యూఎన్ఎస్సీలో కశ్మీర్ అంశంపై చర్చ జరపాలి

- పాక్‌తో గొంతుకలిపిన చైనా

చైనా, ఆగస్టు16(ఆర్ఎన్ఎ) : ఐరాస భద్రతా మండలి (యూఎన్ఎస్సీ) సమావేశం ఏర్పాటు చేసి కశ్మీర్ అంశంపై చర్చలు జరపాలని పొరుగుదేశం చైనా డిమాండ్ చేసింది. జమ్ముకశ్మీర్‌పై భారత్ తీసుకున్న నిర్ణయం పట్ల చర్చించడానికి వీలైనంత త్వరగా ఈ సమావేశం ఏర్పాటు చేయాలని పాకిస్థాన్ అభ్యర్థనకు చైనా సైతం గొంతు కలిపింది. భారత్ తీసుకున్న జమ్ముకశ్మీర్ ప్రత్యేకప్రతిపత్తి రద్దు నిర్ణయంపై సంప్రదింపులు జరపడానికి సమావేశం ఏర్పాటు చేయాలని కోరింది. భద్రతా మండలిలో కశ్మీర్ అంశంపై చర్చలు జరపాలని చైనా కోరింది. పాక్ అభ్యర్థనను ఉటంకిస్తూ వారు లేఖ రాశారని ఐరాస రాయబారి ఒకరు వెల్లడించారు. అయితే దీనిపై ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. సమావేశం ఏర్పాటుకు ముందు ఇతర సభ్య దేశాల అభిప్రాయాలను సైతం పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల పాకిస్థాన్ విదేశాంగ శాఖ మంత్రి షా మహమూద్ ఖురేషీ యూఎన్ఎస్సీకి లేఖ రాసిన విషయం తెలిసిందే. జమ్ముకశ్మీర్ అంశంలో భారత్ తీసుకున్న నిర్ణయంపై అత్యవసర సమావేశాన్ని జరపాలని కోరారు. దీనిపై స్పందించిన ఐరాస.. ఇతర సభ్యులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. అనంతరం చైనాలో పర్యటించిన ఖురేషీ ఐరాస భద్రతా మండలిలో చైనా తమకు మద్దతుగా నిలుస్తుందని ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఇటీవల చైనాలో పర్యటించిన కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ కశ్మీర్‌పై నిర్ణయం పూర్తిగా అంతర్గత విషయమని ఆ దేశానికి తేల్చిచెప్పారు. కశ్మీర్ ప్రజల అబివృద్ధి కోసమే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. దీనివల్ల నియంత్రణ రేఖపై ఎటువంటి ప్రభావం ఉండదని స్పష్టం చేశారు.

## లక్ష్యం మేరకు మిషన్ భగీరథ పనులు :ఎమ్మెల్యే

కొత్తగూడెం,ఆగస్ట్16 (ఆంఎన్ఎ): మిషన్ భగీరథ పనులను నిర్దేశించిన లక్ష్యం మేరకు పూర్తి చేసి ఇంటింటికీ మంచినీరు అందిస్తామని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వర రావు అన్నారు. సిఎం కెసిఆర్ ఆదేశాల మేరకు పనులు శరవేగంగా సాగుతున్నాయని అన్నారు. ఇంటింటికి తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. జిల్లాలో మిషన్ భగీరథ పనులను వేగవంతం చేసి గడువులోపూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పలుచోట్ల మిషన్ భగీరథ పనులను ఆయన నీటిపారుదలశాఖ, విద్యుత్‌శాఖ అధికారులతో కలిసి పరిశీలించాక పనుల తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ పనులు చురుకుగా జరుగుతున్నాయని గడువులోపు పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

## రైతుల దుస్థితికి కాంగ్రెస్సే కారణం: వినయ్

వరంగల్,ఆగస్ట్16 (ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలకు, వ్యవసాయం నాశనం కావడానికి ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ అన్నారు. 40 సంవత్సరాలుగా రైతులకు చేసిన అన్యాయానికి కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులకు రుణమాఫీ చేసిన ఘనత టీఆర్ఎస్ ప్రభుత్వానిది అని తెలిపారు. రైతులకు 24 గంటల కరెంట్ ఇస్తున్నామని పేర్కొన్నారు. ప్రాజెక్టులు కట్టాలని పోరాటాలు చేస్తారు కానీ కాంగ్రెస్ మాత్రం ప్రాజెక్టులు కట్టొద్దని అడ్డుపడుతోందని మండిపడ్డారు. రైతు వ్యవసాయం చేసుకోవద్దని కాంగ్రెస్ కుట్రలు చేస్తోందని అన్నారు. కోటి ఎకరాలు సస్యశ్యామలం కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఉద్ఘాటించారు. సమైక్య పాలనలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొనే వారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వంలో ఉచిత కరెంట్, సాగునీటి సరఫరాతో రైతులు వ్యవసాయం ఇష్టంగా చేసుకుంటున్నారని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రైతు బాగుపడాలనే ఆలోచన ఉంటే ప్రాజెక్టుల నిర్మాణానికి అడ్డుతగలకుండా ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ నేతలను తెలంగాణ ప్రజలు క్షమించరు అని పేర్కొన్నారు.

## బాలీవుడ్ నటి విద్యా సిన్హా కన్నుమూత

ముంబయి,ఆగస్టు16 (ఆర్ఎన్ఎ): బాలీవుడ్ సీనియర్ నటి విద్యా సిన్హా (71) కన్నుమూశారు. కొంతకాలంగా ఆమె ఊపిరితిత్తులు, గుండె సంబంధించిన సమస్యలతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో ఆమె జులై 10న ఆస్పత్రిలో చేరారు. దీంతో ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు వెంటిలేటర్ పై చికిత్స అందించారు. శ్వాస తీసుకోవడంతో ఇబ్బంది పడుతూ తుదిశ్వాస విడిచారని వైద్యులు వెల్లడించారు. పతి పత్ని ఔర్ వో, రజ్నిగంధా, ఛోటి సి బాత్ వంటి హిట్ సినిమాలలో ఆమె నటించారు. సల్మాన్ ఖాన్ నటించిన బాడీగార్డ్ సినిమాలో విద్య నటించారు. కావ్యాంజలి టెలివిజన్ సీరియల్‌లో ఏక్తా కపూర్‌తో కలిసి నటించారు. 1968లో నటుడు వెంకటేశ్వరన్‌ను ఆమె పెళ్లి చేసుకుంది. వెంకటేశ్వరన్ 1996లో మరణించిన తరువాత 2001లో భీమ్ రావు సులేంఖ్‌ను విద్యా సిన్హా రెండో పెళ్లి చేసుకుంది. 2009లో రెండో భర్తతో ఆమె విడాకులు తీసుకున్నారు. రెండో భర్తపై గృహ హింస కేసు పెట్టారు.

### జమ్మూకశ్మీర్‌లో ఘనంగా..

# పంద్రాగస్టు వేడుకలు

- జాతీయ జెండాను ఎగురవేసిన గవర్నర్ సత్యపాల్ మాలిక్
- ఇక్కడి ప్రజల ఉనికికి ఎప్పటికీ ముప్పు వాటిల్లదు
- కేంద్ర నిర్ణయంతో రాష్ట్రం అభివృద్ధిలో పరుగుపెడుతుంది
- గవర్నర్ సత్యపాల్ మాలిక్

శ్రీనగర్,ఆగస్టు16 (ఆర్ఎన్ఎ): జమ్మూకశ్మీర్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ప్రశాంత వాతావరణంలో ఘనంగా జరిగాయి. షేర్-ఇ-కశ్మీర్ స్టేడియంలో జరిగిన పంద్రాగస్టు వేడుకల్లో గవర్నర్ సత్యపాల్ మాలిక్ పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం సైనికుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ వేడుకలకు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ సైతం హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యపాల్ మాలిక్ మాట్లాడుతూ.. జమ్మూకశ్మీర్ ప్రజల ఉనికికి ఎప్పటికీ ముప్పు వాటిల్లదని, ప్రాంతీయ సంస్కృతులకు భారత రాజ్యాంగం ఎంతో విశిష్టతను కల్పించిందని అన్నారు. ఇటీవల కేంద్రం తీసుకొన్న నిర్ణయం వల్ల రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు పెడుతుందని అన్నారు. ఆదివాసీ తెగలకు రాజకీయ ప్రాతినిధ్యం వహించే అవకాశం లభిస్తుందని, కశ్మీరీ పండిట్లను తిరిగి తమ సొంత ప్రాంతానికి తీసుకురావడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఉగ్రవాద నిరోధానికి తీసుకుంటున్న చర్యల్ని ప్రభుత్వం కొనసాగిస్తుందని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా అదుపులో ఉన్నాయని స్పష్టం చేశారు. ఏడాది గవర్నర్ పాలనలో ప్రజలకు ప్రజాస్వామ్య వ్యవస్థపై పూర్తి స్థాయి అవగాహన కల్పించే ప్రయత్నం చేశానన్నారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు భారీ ఎత్తున పాల్గొని ఉగ్రవాద, వేర్పాటువాదులకు సరైన సమాధానం చెప్పారన్నారు. అధికరణ 370ని అచేతనం తర్వాత జరుగుతున్న తొలి స్వాతంత్ర్య వేడుకలు కావడంతో జమ్మూకశ్మీర్‌లో భారీ ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రముఖ రాజకీయ నాయకులెవరూ ఈ వేడుకలకు హాజరుకాలేదు. ప్రత్యేకంగా జారీ చేసిన పాసులు కలిగి ఉన్న వారిని మాత్రమే స్టేడియంలోకి అనుమతించారు. ఎలాంటి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించలేదు. కొంతమంది ఉత్సాహంతో స్టేడియంలో 'వందేమాతరం', 'భారత్ మాతాకీ జై' నినాదాలు చేయడం గమనార్హం.

# ప్రగతి భవన్‌లో రాఖీపౌర్ణమి సందడి

- సీఎం కేసీఆర్‌కు రాఖీ కట్టిన అక్కాచెల్లెళ్లు
- కెటిఆర్‌కు రాఖీ కట్టిన కవిత

హైదరాబాద్, ఆగస్టు16 (ఆర్ఎన్ఎ) : హైదరాబాద్‌లోని సీఎం కేసీఆర్ అధికారిక నివాసం ప్రగతి భవన్‌లో ఆయన కుటుంబ సభ్యులు రాఖీ పండుగను వైభవంగా నిర్వహించారు. సీఎం కేసీఆర్‌కు ఆయన అక్కాచెల్లెళ్లు గురువారం రాఖీ కట్టారు. అనంతరం కేసీఆర్ తన సోదరీమణుల ఆశీర్వాదం తీసుకున్నారు.

టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాసంలో ఆయన సోదరి కవిత రాఖీ కట్టారు. కేటీఆర్ నివాసానికి వచ్చిన ఆమె రాఖీ కట్టి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ సందడి నెలకొంది. కవిత పిల్లలతో కేటీఆర్ కాసేపు సరదాగా గడిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలను కేటీఆర్ ట్వీట్ చేశారు. కొన్ని బంధాలు ఎప్పటికీ ప్రత్యేకమేనని పేర్కొన్న ఆయన.. మహిళలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఒకరికొకరు స్వీట్లు పంచుకొని, శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కేటీఆర్ కుమారుడు హిమాన్షుకు అతడి సోదరి అలేఖ్య రాఖీ కట్టింది. మరోవైపు తెలంగాణ భవన్‌లో రాఖీ పండుగ వేడుకలు జరిగాయి. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు పార్టీకి చెందిన పలువురు మహిళలు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో టీఆర్ఎస్ మహిళా కార్యకర్తలతో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు కేటీఆర్.. తెలంగాణ భవన్‌లో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. జాతీయ జెండా ఆవిష్కరించి, తెలంగాణ ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు 73వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

నారా లోకేశ్ కు రాఖీ కట్టిన భూమా అఖిలప్రియ..

దేశవ్యాప్తంగా గురువారం ప్రజలంతా రాఖీ పండుగను జరుపుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో టీడీపీ నేత నారా లోకేశ్ కు అదే పార్టీకి చెందిన భూమా అఖిల ప్రియ రాఖీ కట్టారు. అనంతరం లోకేశ్ ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ విషయాన్ని ట్విట్టర్ లో పంచుకున్న నారా లోకేశ్, 'థాంక్యూ అఖిలప్రియా. నీలాంటి సోదరి ఉండటం నిజంగా నా అదృష్టమే. రాఖీ పండుగ శుభాకాంక్షలు అని ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా అఖిలప్రియ తనకు రాఖీ కడుతున్న, స్వీట్ తినిపిస్తున్న ఫొటోలను లోకేశ్ పోస్ట్ చేశారు.

# ప్రాజెక్టులతో తెలంగాణ సస్యశ్యామలం : ఎమ్మెల్యే

మెదక్,ఆగస్ట్16(ఆర్ఎన్ఎ): ప్రాజెక్టుల నిర్మాణం ద్వారానే తెలంగాణ రాష్ట్రం సస్యశ్యామలవుతుందని కాంగ్రెస్ గుర్తించాలని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పదేళ్ల కాలంలో చేయలేని పనులను సిఎం కెసిఆర్ నాలుగేళ్ల కాలంలోనే చేసి చూపారని అన్నారు. కాళేశ్వరం పూర్తి కావడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. ఇది జీర్ణించుకోలేక విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు. బంగారు తెలంగాణ ప్రాజెక్టులతోనే సాధ్యమవుతుందన్న దృష్టితో సీఎం కేసీఆర్ ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రాధాన్యతనిస్తుంటే కాంగ్రెస్ కోర్టుల ద్వారా ప్రాజెక్టులను అడ్డుకుంటుందని, అన్నారు. ఇకనైనా అలాంటి పనులు మానుకోవాలని ఆయన హితవు చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు చేపడుతూ బంగారు తెలంగాణగా మార్చాలన్న ఉద్దేశంతో ప్రాజెక్టులకు పునర్జీవనం పోస్తున్నారని పేర్కొన్నారు. ఏదేమైనా ప్రాజెక్టుల కు ఎవరు అడ్డుపడొద్దని విజ్ఞప్తి చేశారు. రైతన్నలకు పంట పెట్టుబడుల కోసం ఎకరాకు రూ.5వేలు ఇస్తున్న విషయాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు. గతంలో కట్టిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టులను ఏ ప్రభుత్వం పట్టించుకున్న పాపానాపోలేదని పేర్కొన్నారు. శ్రీరాంసాగర్ వరద కాలువలతో పాటు పంట కాలువల నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. మల్లన్నసాగర్ పూర్తయితే నాలుగు జిల్లాలకు తాగునీరందుతుందని వెల్లడించారు. తెలంగాణలోని 31 జిల్లాలు సస్యశ్యామలంగా ఉండాలన్నదే సీఎం కేసీఆర్ ఆలోచన అని అన్నారు. మిషన్‌భగీరథ పనులలో కొంత జాప్యం జరిగినా, ప్రస్తుతం పనులు పూర్తి అయ్యాయని, డిసెంబర్ నాటికి మిగతా పనులు కాగలవని అన్నారు. మిషన్‌భగీరథ ట్రయల్స్ చేపట్టేందుకు పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్‌భగీరథ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో మిషన్ భగీరథలో భాగంగా చేపడుతున్న ఓవర్‌హెడ్ ట్యాంకులు, పైపులైన్ పనులను పరిశీలించారు.

# పులిచింతల 14గేట్లు ఎత్తివేత

సూర్యాపేట,ఆగస్టు16(ఆర్ఎన్ఎ): పులిచింతల ప్రాజెక్ట్ 14 గేట్లను అధికారులు ఎత్తివేశారు. ఇన్‌ఫ్లో 5.46 లక్షల క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 6.16 లక్షల క్యూసెక్కులు, పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం 45 టీఎంసీలు, ప్రస్తుతం 39.4 టీఎంసీలు గా ఉంది.

పులిచింతల ప్రాజెక్ట్‌కు వరద పోటెత్తింది. బ్యాక్ వాటర్‌తో మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయం జలదిగ్బంధంలో ఉంది. ఆలయ కరకట్టకు పగుళ్లు ఏర్పడ్డాయి. దాంతో వాటర్ కూడా లీకవుతుంది. లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోకి వరద నీరు భారీగా చేరుతుంది. దేవస్థానం సిబ్బంది డీవాటరింగ్ చేస్తున్నారు. భక్తులు ఆందోళనకు గురవుతున్నారు. ఆలయంను మూసివేశారు. ఉత్సవ విగ్రహాలను అధికారులు తరలించారు.

# వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌లో చోరీ

## 15 తులాలబంగారం చోరీపై ఫిర్యాదు

హైదరాబాద్,ఆగస్టు16(ఆర్ఎన్ఎ): వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌లో బంగారం చోరీ జరిగింది. అంబర్‌పేటకు చెందిన సత్యనారాయణ, సునీత దంపతులు బుధవారం రాత్రి చిత్తూరు నుంచి కాచిగూడకు వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరారు.

అయితే వీరి బ్యాగులో ఉన్న 15 తులాల బంగారు ఆభరణాలను దొంగలు చోరీ చేశారు. అయితే రైలు మహబూబ్‌నగర్ వచ్చిన తర్వాత తమ బంగారు ఆభరణాలు మాయమైనట్లు దంపతులు గుర్తించారు. దీంతో కాచిగూడ రైల్వే స్టేషన్‌లో బాధిత దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

క్రీడలు

# వన్డే సిరీస్ భారత్ కైవసం

- మూడో వన్డేలో వెస్టిండీస్‌పై గెలుపు
- ఆరు వికెట్ల తేడాతో భారత్ విజయం
- మరోసారి శతకంతో రాణించిన విరాట్ కోహ్లీ




పోర్ట్‌ఆఫ్‌స్పెయిన్, ఆగస్టు15(ఆర్‌ఎన్‌ఎ) : భారత్- వెస్టిండీస్ మూడు వన్డేల సిరీస్‌ను భారత్ కైవసం చేసుకుంది. బుధవారం చివరి వన్డేలో ఆరు వికెట్ల తేడాతో భారత్ విజయం సాధించి.. 2-0 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకుంది. సారథి విరాట్ కోహ్లీ(114, 99 బంతుల్లో ) మరో శతకంతో మెరవగా, యువ బ్యాట్స్‌మెన్ శ్రేయస్ అయ్యర్(65; 41బంతుల్లో) అర్ధశతకంతో చెలరేగారు. దీంతో గెలుపు సునాయాసమైంది. తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 35 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 240 పరుగులు సాధించింది. ఓపెనర్లు క్రిస్ గేల్(72; 41బంతుల్లో), లూయిస్(43; 29బంతుల్లో ) మెరిపించారు. ఓపెనర్లు ఆరంభంలో జాగ్రత్తగా ఆడారు. తొలి నాలుగు ఓవర్లలో స్కోరు 13 పరుగులే. కానీ ఐదో ఓవర్ నుంచి మోత మొదలైంది. మొదట బ్యాట్ ఝళిపించింది లూయిస్. భువనేశ్వర్ వేసిన ఇన్నింగ్స్ ఐదో ఓవర్లో అతడు రెండు ఫోర్లు, ఓ భారీ సిక్స్ కొట్టాడు. ఆ తర్వాత గేల్ గేర్ మార్చాడు. తన తొలి 16 బంతుల్లో 10పరుగులే చేసిన అతడు.. షమి ఓవర్లో ఓ సిక్స్, మూడు ఫోర్లు దంచాడు. అదే జోరు కొనసాగించాడు. గేల్, లూయిస్ ధాటికి ఖలీల్ తన తొలి రెండు ఓవర్లలో 33 పరుగులు సమర్పించుకున్నాడు. గేల్ కేవలం 30 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసుకోగా.. విండీస్ 10 ఓవర్లలో 114/0తో అత్యంత బలమైన స్థితిలో నిలిచింది. 11వ ఓవర్లో లూయిస్‌ను చాహల్ ఔట్ చేయడంతో ఎట్టకేలకు తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. భారత్ ఊపిరి పీల్చుకుంది. తర్వాతి ఓవర్లోనే గేల్‌ను ఖలీల్ వెనక్కి పంపాడు. ఆ తర్వాత పరుగుల వేగం తగ్గింది. హెట్‌మైయర్(25), హోప్(24) ఇన్నింగ్స్ నిలబెడుతూ వచ్చారు. కానీ 22వ ఓవర్‌లో వరుణుడు మళ్లీ వచ్చాడు. సుమారు రెండు గంటల వరకూ మ్యాచ్‌కు అంతరాయం కలిగింది. దీంతో మ్యాచ్‌ను 35 ఓవర్లకు కుదిస్తూ అంపైర్లు నిర్ణయం తీసుకున్నారు. తర్వాత భారత బౌలర్లు పిచ్‌ను సద్వినియోగం చేసుకున్నారు. హెట్‌మైయర్, హోప్‌ను వెంటవెంటనే ఔట్ చేసి కట్టడి చేశారు. భారీ షాట్లతో ధాటిగా ఆడుతున్న పూరన్(22)ను కూడా షమి బోల్తా కొట్టించాడు. బ్రాత్‌వైట్(16) బ్యాట్ ఝళిపించి విండీస్ ఇన్సింగ్స్‌ను నిలబెట్టాడు. భారత బౌలర్లలో ఖలీల్ మూడు వికెట్లు, షమి రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన భారత్.. ఆచితూచి ఆడుతూ సునాయాసంగా విజయం సాధించింది. లక్ష్య ఛేదనకు దిగిన భారత్ ఆరంభంలోనే రోహిత్(10) వికెట్ కోల్పోయింది. తొలి ఓవర్‌లో రెండు బౌండరీలు బాది ఊపు మీదున్న హిట్‌మ్యాన్.. మూడో ఓవర్‌లో లేని పరుగుకు ప్రయత్నించి రనౌట్‌గా వెనుదిరిగాడు. మరో ఓపెనర్ ధావన్(36; 36బంతుల్లో)తో కలిసి సారథి కోహ్లీ ఇన్నింగ్స్ నిలబెడుతూ వచ్చాడు. విండీస్ బౌలర్లను ధాటిగా ఎదుర్కొంటూ ఈ జోడీ కుదురుకున్నట్లే కనిపించింది. కానీ 13వ ఓవర్‌లో అలెన్ బౌలింగ్‌లో ధావన్ అనవసరపు షాట్ ఆడి కీమో పాల్ చేతికి చిక్కాడు. నాలుగో స్థానంలో వచ్చిన పంత్(0) కూడా అదే ఓవర్‌లో నాలుగో బంతికి చెత్త షాట్ ఆడి కీమో పాల్‌కే క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరుకున్నాడు. అప్పటికి స్కోరు 92/3కు చేరుకుంది. మ్యాచ్‌లోనూ కోహ్లీ-శ్రేయస్ జోడీ కీలకంగా ఆడారు. అప్పటికే కీలక మూడు వికెట్లు కోల్పోయి కాస్త కష్టాల్లో ఉన్న భారత్‌ను వీరిద్దరూ ఆదుకున్నారు. ఇద్దరూ చక్కటి సమన్వయంతో జోరు సాగించారు. శ్రేయస్ వీలుచిక్కినప్పుడల్లా సిక్సర్లు బాదుతూ ఆకట్టుకున్నాడు. 26వ ఓవర్‌లో అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. కానీ మరో 15 పరుగులు జోడించి రోచ్ బౌలింగ్‌లో హోల్డర్ చేతికి చిక్కాడు. వీరిద్దరూ కలిసి కీలక 120 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు

### విరాట్ మరో శతకం..

విరాట్ శతకాల పరంపర కొనసాగింది. మూడో వన్డేలోనూ సెంచరీ సాధించి వన్డేల్లో 43 శతకాలు పూర్తి చేసుకున్నాడు. ఆరంభం నుంచి ధాటిగా ఆడుతూ వచ్చిన కోహ్లీ చక్కటి షాట్లతో అలరించాడు. ఎక్కడా ఇబ్బందికి గురికాకుండా వీలుచిక్కినప్పుడల్లా బౌండరీలు సాధిస్తూ స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. శ్రేయస్ ఔట్ అయ్యాక క్రీజులోకి వచ్చిన కేదార్ జాదవ్(19; 12బంతుల్లో)తో కలిసి మరో వికెట్ పడకుండా బ్రాత్‌వైట్ వేసిన 33వ ఓవర్‌లో రెండు బౌండరీలు బాది భారత్‌కు అద్భుత విజయాన్ని అందించాడు. వన్డేల్లో అత్యధిక శతకాలు సాధించిన కెప్టెన్ల జాబితాలో కోహ్లీ(21సెంచరీలు) రెండో స్థానంలో ఉన్నాడు. అతని కంటే ముందు ఆసీస్ మాజీ సారథి రికీ పాంటింగ్(22) ఉన్నాడు. ఒక జట్టుపై అత్యధిక శతకాలు సాధించిన బ్యాట్స్‌మెన్‌గా కోహ్లీ(9-వెస్టిండీస్‌పై), సచిన్(9-ఆస్ట్రేలియాపై) సరసన నిలిచాడు.

### ఆదిలోనే కోహ్లీని ఔట్ చేయాల్సింది : హోల్డర్

ఫీల్డింగ్‌లోని తప్పిదాలతో భారీ మూల్యం చెల్లించుకున్నామని వెస్టిండీస్ కెప్టెన్ హోల్డర్ అన్నాడు. భారత సారథి విరాట్ కోహ్లీ ఇచ్చిన క్యాచ్‌ను వికెట్‌కీపర్ హోప్ చేజార్చడంతో మ్యాచ్‌ను కోల్పోయామని పేర్కొన్నాడు. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా భారత్‌తో జరిగిన ఆఖరి వన్డేలో వెస్టిండీస్ ఆరు వికెట్ల తేడాతో ఓటమి పాలైంది. దీంతో విండీస్ సిరీస్‌ను 2-0తో కోల్పోయింది. మ్యాచ్ అనంతరం జట్టు సారథి హోల్డర్ మాట్లాడుతూ.. 'బ్యాట్స్‌మెన్ తమ కర్తవ్యాన్ని పూర్తిచేశారు. మ్యాచ్ మా చేతుల్లోనే ఉందని భావించాం. కోహ్లీని ఆదిలోనే ఔట్ చేయాల్సిందని, అది జరగకపోవడంతో భారీ మూల్యాన్ని చెల్లించుకున్నామన్నారు. గత కొంతకాలంగా పేలవ ప్రదర్శన చేస్తున్నాం. దీని గురించి మేం సమీక్షించుకోవాలని, మా ఆటను మెరుగుపర్చుకోవడానికి ఎంతో శ్రమించాల్సి ఉంది. ఇతర దేశాల మాదిరిగా దేశవాళీ క్రికెట్‌పై మేము శ్రద్ధ పెట్టాలని తెలిపాడు.

## హెల్మెట్‌లో చిక్కిన బంతి.. ఆటపట్టించిన బ్యాట్స్‌మెన్

హైదరాబాద్: శ్రీలంకలోని గాలెలో కివీస్‌తో జరుగుతున్నతొలి టెస్టులో ఓ ఫన్నీ మూమెంట్ చోటుచేసుకున్నది. న్యూజిలాండ్ బ్యాట్స్‌మెన్ ట్రెంట్ బౌల్ట్ హెల్మెట్‌లో బంతి చిక్కుకోవడంతో.. ఇన్నింగ్స్ 82వ ఓవర్‌లో కాసేపు సరదా సన్నివేశం చోటుచేసుకున్నది.

స్పిన్నర్ లసిత్ ఎంబుల్దేనియా వేసిన బంతిని బౌల్ట్ స్వీప్ చేయడానికి ప్రయత్నించాడు. అయితే హెడ్జ్ తీసుకున్న బంతి నేరుగా వెళ్లి బౌల్ట్ హెల్మెట్ ముందుభాగంలో చిక్కుకున్నది. అయితే బౌల్ట్‌ను చుట్టి ఉన్న ఫీల్డర్లు ఆ బంతిని అందుకునే ప్రయత్నం చేశారు. కీపర్‌తో సహా స్లిప్స్, షార్ట్‌లెగ్‌లో ఉన్న ఫీల్డర్లు హెల్మెట్‌లో చిక్కుకున్న బంతిని అందుకునేందుకు ఆరాటపడ్డారు. ఆ సమయంలో బౌల్ట్ వారి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేశాడు. ఫీల్డర్లను ఆటపట్టించాడు.

దీంతో కాసేపు మైదానంలో నవ్వులు పూశాయి. కామెంటేటర్లు, ప్రేక్షకులు కూడా ఆ సన్నివేశాన్ని తెగ ఎంజాయ్ చేశారు. బౌల్ట్ 18 రన్స్ చేసి ఔటయ్యాడు.

# గాంధీ వేషధారణలో 500మంది చిన్నారులు

యాదాద్రి,ఆగస్టు16(ఆర్‌ఎన్‌ఎ): జాతిపిత మహాత్మా గాంధీని స్మరించుకుంటూ 500 మంది చిన్నారులు ఆయన వేషధారణలో సందడి చేశారు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో ఆవిష్కృతమైంది.

మహాత్మా గాంధీ 150వ జయంతి ఉత్సవాల్లో భాగంగా గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో రహదారిపై కిలోమీటరు పొడవైన జాతీయ జెండాను ప్రదర్శించారు. అనంతరం గాంధీ పార్కు ఆవరణలో భారతదేశం ఆకారంలో చిన్నారి గాంధీలు కూర్చున్నారు. వివిధ జాతీయ నాయకుల వేషధారణతో అలరించారు.

చిన్నతనంలోనే విద్యార్థుల్లో దేశ భక్తి పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదం చేస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు.

# బంగారం ధరల్లో ఒడిదుడుకులు

### సామాన్యులకు ఇక్కట్లు

ముంబై,ఆగస్ట్16(ఆర్‌ఎన్‌ఎ): బంగారం మార్కెట్లో ధరల పరుగులు, ఒడిదుడుకులు సామాన్యులకు ఇబ్బందిగా మారింది. బంగారం కొనుగోలు చేయాలనుకున్న వారికి ధరల మోత కలవరపెడుతోంది. ఇటీవల గతంలో ఎన్నడూ లేనంతంగా బంగారం ధరలు పరుగులు తీస్తున్నాయి. అయితే తాజాగా పసిడి పరుగుకు క్లళెం పడింది. రికార్డు గరిష్టాలను నమోదు చేసిన బంగారం ధర భారీగా దిగి వచ్చింది. దేశీయంగా పుత్తడి ధరలు క్షీణించాయి. హైదరాబాద్ మార్కెట్‌లో గురువారం ఒక్క రోజులోనే పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర ఏకంగా రూ.2,490 తగ్గుదలతో రూ.37,000కు పతనమైంది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర కూడా రూ.360 తగ్గుదలతో రూ.35,760కు దిగొచ్చింది. అంతర్జాతీయంగా బలమైన ట్రెండ్ ఉన్నప్పటికీ రికార్డుస్థాయిల వద్ద ఇన్వెస్టర్ల అమ్మకాలు, జువెలర్లు, రిటైలర్ల నుంచి డిమాండ్ పడిపోవడం ధరపై ప్రతికూల ప్రభావం చూపిందని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. అమెరికా-చైనా మధ్య ట్రేడ్‌వార్‌పై అంచనాలతో ఆసియా కరెన్సీలు బలపడ్డాయి. చైనా ఉత్పత్తుల దిగుమతులపై 10శాతం దిగుమతి సుంకం అమలును డిసెంబర్‌కు వాయిదా వేసింది ట్రంప్ సర్కార్. దీంతో దేశీయ కరెన్సీ రూపాయి, ఈక్విటీ మార్కెట్లు బుధవారం భారీగా పుంజుకున్నాయి. గ్లోబల్ మార్కెట్‌లో బంగారం ధర పెరిగింది. పసిడి ధర ఔన్స్‌కు 0.29 శాతం పెరుగుదలతో 1,532.15 డాలర్లకు చేరింది. అదేసమయంలో వెండి ధర ధర ఔన్స్‌కు 0.28 శాతం పెరుగుదలతో 17.32 డాలర్లకు ఎగసింది. మరోవైపు వెండి ధర మాత్రం స్థిరంగా ఉంది. కేజీ వెండి ధర రూ.47,265 వద్ద నిలకడగా కొనసాగుతోంది. పరిశ్రమ యూనిట్లు, నాణెళిపు తయారీదారుల నుంచి డిమాండ్ లేకపోవడం ఇందుకు కారణం. ఢిల్లీ మార్కెట్‌లో పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.300 క్షీణించి రూ.37,700 వద్ద ఉంది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర కూడా రూ.400 తగ్గి రూ.36,500 వద్ద ఉంది. ఇక కేజీ వెండి ధరలో ఎలాంటి మార్పు లేదు. రూ.47,265 వద్ద కొనసాగుతోంది.

## ఎమ్మెల్యేకు రాఖీ కట్టిన బ్రహ్మకుమారీలు

భద్రాచలం,ఆగస్టు16 (ఆర్‌ఎన్‌ఎ): రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని భద్రాచలంలో స్థానిక ఎమ్మెల్యే పొదెం వీరయ్యకు బ్రహ్మకుమారీలు రక్షాబంధనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీరయ్య మాట్లాడుతూ రాఖీ పౌర్ణమి రోజున అన్న చె÷-లలెలు అన్నలకు రాఖీ కట్టడం అనాదిగా వస్తున్న సంప్రదాయం అన్నారు. రక్షాబంధన్ ముఖ్య ఉద్దేశం మహిళలకు అన్నయ్యలు అన్ని విధాలా రక్షణగా ఉంటామని తెలపడమేనన్నారు. మహిళలు అభివృద్ధి చెందేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఇటీవల కాలంలో మహిళలపై వేధింపులు దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలకు పూర్తి రక్షణ కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు.

## సినీ గీత రచయిత శివగణెళిశ్ కన్నుమూత

హైదరాబాద్,ఆగస్టు16 (ఆర్‌ఎన్‌ఎ): ప్రముఖ సినీ గీత రచయిత శివగణెళిశ్ కన్నుమూశారు. వనస్థలిపురంలో తన నివాసంలో గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. శ్రీసూర్యమూవీస్ సంస్థ అధినేత ఏఎం రత్నంతో కలసి పలు సినిమాలకు పనిచేశారు. మ్యూజికల్ హిట్స్‌గా నిలిచిన ప్రేమికుల రోజు, నరసింహ, జీన్స్, ఒకే ఒక్కడు, బాయ్స్, 7జీ బృందావన్ కాలనీ లాంటి సినిమాలకు ఆయన సాహిత్యమందించారు. శివగణెళిశ్‌కు భార్య నాగేంద్రమణి, కుమారులు సుహాస్, మానస్ ఉన్నారు. తెలుగుతో పాటు పలు తమిళ సినిమాలకు కూడా ఆయన పనిచేశారు.

# కర్ణాటకలో దారుణం

## కుటుంబాన్ని చంపి తానూ ఆత్మహ్యాత

### అప్పుల బాధతో ఓ వ్యక్తి ఘాతుకం

బెంగళూరు,ఆగస్ట్16 (ఆంఎన్‌ఎ): కర్ణాటకలో దారుణం చోటు చేసుకుంది. చామరాజనగర్ జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. మైసూరుకు చెందిన ఓ వ్యక్తి కుటుంబసభ్యులను కాల్చి చంపి, ఆపై తానూ ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో ఓ కుటుంబం హతమైపోయింది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం... మైసూరుకు చెందిన ఓంకార్ ప్రసాద్(33) తన తల్లిదండ్రులు నాగరాజ్ భట్టాచార్య(60), హేమలత(54), భార్య నికిత(27), కుమారుడు ఆర్య కృష్ణ(5)ను కాల్చి చంపాడు. ఆపై తాను కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక సమస్యలే ఈ ఘటనకు కారణమై ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా తేల్చారు. అయితే ఘటనా స్థలంలో ఎలాంటి సూసైడ్ లేఖ లభించక పోవడంతో హత్య, అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు. ఓంకార్ కుటుంబం కొద్దిరోజుల క్రితం ఊరు వదిలి వెళ్లింది.

బందీపొ రాలోని యేలచెట్టి గ్రామంలో ఉండే వారి ఫామ్‌హౌజ్‌కు వెళ్లారు. అక్కడి నుంచి చామరాజనగర్ జిల్లా గుండ్లుపేట సమీపంలోని నంది హోటల్‌కు మూడు రోజుల క్రితం వచ్చి అక్కడే ఉంటున్నారు. డ్రైవర్‌కు అనుమానం రాకుండా కారుతో అతడిని బయటకు పంపారు. గుండ్లుపేట పట్టణానికి కిలోమీటరు దూరంలో ఉన్న శివారు ప్రాంతానికి వెళ్లి దారుణానికి పాల్పడ్డారు.

ఆర్థిక నష్టాలు, అప్పుల భారమే ఈ కుటుంబాన్ని బలిగొన్నట్టు చామరాజనగర్ పోలీసులు భావిస్తున్నారు. ఓంకార్ ప్రసాద్ (33) మృతదేహం వద్దే తుపాకి ఉండడంతో... అతడే తన తల్లిదండ్రులు నాగరాజ్ భట్టాచార్య (60), హేమలత (54), భార్య నికిత (27), కుమారుడు ఆర్య కృష్ణ (5) కాల్చిచంపినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. కుటుంబ సభ్యులను కాల్చిచంపిన తర్వాత అతడు కూడా అదే గన్నుతో ఆత్మహత్య చేసుకున్నట్టు భావిస్తున్నారు.

ఎటూకాని సమయంలో వీరంతా హోటల్ నుంచి దూరంగా వెళ్లారన్నది ఇంకా తెలియరాలేదు. హోటల్‌లో కూడా ఎలాంటి సూసైడ్ నోట్ దొరకలేదని పోలీసులు చెబుతున్నారు. ఈ ఘటన వెనుక మిస్టరీని ఛేదించేందుకు ఇప్పటికే ఓ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్టు చామరాజనగర్ ఎస్పీ హెచ్‌డీ అనందకుమార్ పేర్కొన్నారు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# ఇదేం పిటీషన్..!

- అరగంట చదివినా అర్థం కాలేదు
- అధికరణ 370 రద్దు పిటీషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు
- పిటిషన్‌దారుపై ప్రధాన న్యాయమూర్తి గొగొయి అసహనం
- కేంద్రానికి మరికొంత సమయమిద్దాం
- అనురాధా బేసిన్ పిటిషన్‌పై స్పష్టంచేసిన ధర్మాసనం

న్యూఢిల్లీ, ఆగస్టు16(ఆర్‌ఎన్‌ఎ) : ఇదేం పిటీషన్.. అరగంట చదివినా అర్థం కాలేదు.. ఏం కోరుకుంటున్నారో స్పష్టత లేకుండా వ్యాజ్యం ఎలా వేస్తారంటూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే.. అధికరణ 370 రద్దును సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై శుక్రవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన గొగొయి పిటిషన్ దారుడిపై అసహనం వ్యక్తం చేశారు. ఎలాంటి పిటిషన్ వేశాంటూ న్యాయవాది ఎం.ఎల్. శర్మను ప్రశ్నించారు. అరగంట పాటు చదివినా వ్యాజ్యం ముఖ్య ఉద్దేశ్యం ఏంటో అర్థం కాలేదన్నారు.

ఒకవేళ ఈ పిటిషన్ కొట్టివేస్తే సంబంధిత ఐదు వ్యాజ్యాలపైనా ప్రభావం పడుతుందని తెలిపారు. ఈ విషయంపై మొత్తం 7 పిటిషన్లు దాఖలు కాగా.. అందులో నాలుగింటిలో లోపాలున్నాయన్నారు. ఏం కోరుకుంటున్నారో స్పష్టత లేకుండా వ్యాజ్యం ఎలా వేస్తారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. పిటిషన్లు లోపభూయిష్టంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. దీంతో పిటిషన్‌లో సవరణలు చేసేందుకు అవకాశం ఇవ్వాలని న్యాయవాది శర్మ కోరారు.

### కేంద్రానికి మరికొంత సమయమిద్దాం..

ఈ సందర్భంగా కశ్మీర్‌లో మీడియా, కమ్యూనికేషన్ వ్యవస్థపై విధించిన ఆంక్షలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ద కశ్మీర్ టైమ్స్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ అనురాధా బేసిన్ వేసిన పిటిషన్‌పైనా ధర్మాసనం విచారణ జరిపింది. దీనిపై జస్టిస్ ఎస్ఏ బాబ్డే స్పందిస్తూ.. ల్యాండ్‌లైన్ వ్యవస్థ పనిచేస్తోందని, శుక్రవారం ఉదయం కశ్మీర్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌తో మాట్లాడినట్లు కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ.. కశ్మీర్‌లో పరిస్థితులు క్రమంగా చక్కబడుతున్నాయని తెలిపారు. జిల్లాల్లోని పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ.. దశలవారీగా ఆంక్షలు తొలగిస్తామని కోర్టుకి వివరించారు. దీంతో కేంద్రానికి మరికొంత సమయం ఇద్దామన్న ధర్మాసనం.. దీనిపై మరోసారి విచారిద్దామంటూ వాయిదా వేసింది. అయితే తేదీ మాత్రం ఖరారు చేయలేదు.

# కాశ్మీర్‌లో ప్రజలను జంతువుల్లా బంధించారు

## అమిత్ షాకు లేఖరాసిన మెహబూబా కూతురు

శ్రీనగర్,ఆగస్ట్16(ఆర్‌ఎన్‌ఎ): జమ్మూకశ్మీర్ ప్రజలను జంతువుల్లా బంధించారంటూ ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ కుమార్తె ఇల్తిజా జావేద్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ మేరకు కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. అంతేగాక ఓ వాయిస్ మెసేజ్‌ను కూడా విడుదల చేశారు. దేశమంతా స్వాతంత్య్ర దినోత్సవాన్ని జరుపుకుంటే.. మాకు మాత్రం ఆ అవకాశం లేదు. కశ్మీరీలను జంతువుల్లా బంధించారు. ప్రాథమిక హక్కులను హరించారు. నేను గొంతెత్తితే బెదిరింపులకు గురికావడం ఖాయమని తెలుసు. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో.. పౌరుడికి మాట్లాడే హక్కు లేదా? విషాదం ఏంటంటే.. నన్నో యుద్ధఖైదీగా పరిగణిస్తున్నారని ఆమె చెప్పుకొచ్చారు. ఆమె ఇంతకు ముందు కూడా ఇలాగే వాయిస్ మెసేజ్ విడుదల చేసి.. కశ్మీర్‌లో పరిస్థితులను ఖండించారు. ఆర్టికల్ 370 రద్దు అనంతరం జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీని అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత ఆమె కుమార్తెను గృహనిర్బంధంలో ఉంచారు. గత 12 రోజులుగా కశ్మీర్‌లోయ పూర్తిగా కేంద్రం ఆధీనంలో ఉంది. టెలీ కమ్యునికేషన్స్, ఇంటర్నెట్ సేవలను పూర్తిగా నిలిపేశారు. ముఖ్యనేతలను అరెస్ట్ చేశారు. విడతల వారీగా ఆంక్షలు తొలగిస్తామని కేంద్ర వర్గాలు తెలుపుతున్నాయి. అయితే ఇంట్లో బంధించడాన్ని ఇతిజా ఖండించారు.

# కెమికల్ ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం

పూణె,ఆగస్టు16(ఆర్‌ఎన్‌ఎ): మహారాష్ట్రలోని పూణెలో గల ఒక కెమికల్ ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటన పూణె-సోలాపూర్ హైవే సమీపంలోని దౌండ్ పరిధిలోని కుర్కుమ్ ఎంఐడీసీ ఏరియాలోగల ఒక కెమికల్ ఫ్యాక్టరీలో చోటుచేసుకుంది. ప్రస్తుతం మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఈ అగ్నిప్రమాదం కారణంగా సమీపంలోని గ్రామాలను అధికారులు ఖాళీ చేయిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో ఫ్యాక్టరీలో 15-16 మంది కార్మికులు ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో కొంతమంది మృత్యువాత పడివుండవచ్చని భావిస్తున్నారు.

# నిజామాబాద్‌లో రెండు లారీలు ఢీ..

### - ఇద్దరు డ్రైవర్లూ మృతి

నిజామాబాద్, ఆగస్టు16(ఆర్‌ఎన్‌ఎ) : రెండు లారీలు ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్లిద్దరూ మృతి చెందగా.. మరోవ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా బాల్కొండ సమీపంలో 44వ జాతీయ రహదారిపై చిట్టాపూర్‌వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి హైదరాబాద్ నుంచి నిర్మల్ వైపు రెండు లారీలు వెళ్తున్నాయి. శుక్రవారం వేకువజామున చిట్టాపూర్‌కు చేరుకొనేసరికి ముందు వెళ్తున్న లారీని వెనుక వైపునుంచి వచ్చిన మరో లారీ బలంగా ఢీకొంది. ఈ దాటికి వెనుకున్న లారీ కేబిన్ నుజ్జు నుజ్జు కాగా ముందు ఉన్న లారీ బోల్తాపడి కేబిన్ నుజ్జయింది. దీంతో రెండు లారీల్లో ఉన్న డ్రైవర్లు అక్కడికక్కడే మృతిచెందారు. మృతుల్లో ఒకరు రాజస్థాన్‌కు చెందినవారు కాగా మరొకరని అనంతపురానికి చెందినవారిగా గుర్తించారు. అందులో ఒక క్లీనర్‌కు తీవ్రగాయాలు కాగా అతన్ని నిజామాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారమందుకున్న బాల్కొండ ఎస్సై శ్రీహరి ఘటనా స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను బాల్కొండ ఆస్పత్రికి తరలించారు.

సినిమా

# మిలిటరీ కమాండో ఆఫీసర్‌గా విశాల్



ట్రైడెంట్ రవి నిర్మాణంలో విశాల్ హీరోగా నటిస్తున్న చిత్రం 'యాక్షన్'. సుందర్.సి దర్శకత్వం వహిస్తున్నారు. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో 'ఆంబల' విడుదలైంది. పూర్తి యాక్షన్ చిత్రంగా దీన్ని తెరకెక్కిస్తున్నారు. సినిమా గురించి చిత్ర వర్గాలు స్పందిస్తూ.. మిలిటరీ కమాండో ఆఫీసర్‌గా విశాల్ నటిస్తున్నారు.

ఓ ముఖ్యమైన విషయాన్ని కనిపెట్టడం కోసం పలు దేశాలు తిరుగుతాడు కథానాయకుడు. విదేశాల్లో ఛేజింగ్, యాక్షన్ సన్నివేశాలన్నీ చాలా కొత్తగా ఉంటాయి. అన్బరివ్ స్టంట్ మాస్టర్ ఆధ్వర్యంలో ప్రస్తుతం పోరాట సన్నివేశాలను తెరకెక్కిస్తున్నాం. కొన్ని సన్నివేశాల్లో విశాల్ డూప్ లేకుండానే నటించారు. అవన్నీ సినిమాకు హైలెట్‌గా ఉంటాయి.టర్కీ, ఇస్తాంబుల్, క్రాబి ఐలాండ్‌తో పాటు పలు దేశాల్లో చిత్రీకరణ జరిపాం. జైపూర్, రిషికేష్, హైదరాబాద్‌లో 50 రోజుల పాటు చిత్రీకరణ నిర్వహించాం.

ఇందులో విశాల్‌కు జోడీగా తమన్నా నటిస్తోంది. మలయాళ భామ ఐశ్వర్యలక్ష్మి రెండో నాయిక. ఈ సినిమా ద్వారా ఆమె కోలీవుడ్‌కు పరిచయమవుతున్నారని పేర్కొన్నాయి. యోగిబాబు, రాంకీ, ఛాయాసింగ్, పళ.కరుపయ్యలు ఇతర తారాగణం. హిప్‌హాప్ ఆది సంగీతం సమకూర్చుతున్నారు.

# సెప్టెంబర్‌లో 'నిన్ను తలచి' రిలీజ్




ఎస్ ఎల్ యెన్ ప్రొడక్షన్స్, నేదురుమల్లి ప్రొడక్షన్స్ సంయుక్తంగా ఓబిలేష్ మొదిగిరి, నేదురుమల్లి అజిత్ కుమార్ నిర్మాతలుగా, అనిల్ తోట దర్శకునిగా తెరకెక్కిన చిత్రం నిన్ను తలచి. క్యూట్ లవ్ స్టోరీ గా రూపొందిన ఈ సినిమాతో వంశీ యాకసిరి, స్టెఫీ పటేల్ హీరో హీరోయిన్లుగా పరిచయం అవుతున్నారు.

స్వతంత్ర దినోత్సవం, రక్షాబంధన్ సందర్బంగా ఈ సినిమాకి సంబందించిన లేటెస్ట్ పోస్టర్ విడుదల చేశారు. ప్రొడక్షన్, పోస్ట్ ప్రొడక్షన్ తో పాటు అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమాను సెప్టెంబర్ లో రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు గా నిర్మాతలు తెలిపారు.

నిర్మాత అజిత్ కుమార్ మాట్లాడుతూ.. ' ఒక హానెస్ట్ అ÷-టటెంప్ట్ చేసాము. ఈ సినిమాను కేవలం ఒక ప్రేమకథలా కాకుండా అటు ఫ్యామిలీ ఇటు యూత్ ని ఆకట్టుకునేలా రెడీ అయ్యింది. మా సినిమాకు మ్యూజిక్ హైలైట్ గా నిలుస్తుందని నేను బలం గా నమ్ముతున్నా, త్వరలోనే మా సినిమా లో ఉన్న వీడియో సాంగ్స్ ని విడుదల చేయడానికి ఎ÷-లాన్ చేస్తున్నాము. వంశి, స్టెఫీ పటేల్ జంట ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. సెప్టెంబర్ లో రిలీజ్ చేయడానికి ఎ÷-లాన్ చేస్తున్నం అన్నారు.

## విష్ణుకి చెల్లెలిగా కాజల్!

యంగ్ హీరో మంచు విష్ణు ఓ హాలీవుడ్ సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే. తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో మంచు విష్ణుతో పాటు కాజల్ అగర్వాల్ కూడా నటిస్తున్నారు. అయితే ఈ సినిమాలో కాజల్, విష్ణు సరసన హీరోయిన్‌గా నటించటం లేదట. ఈ ఇద్దరు ఈ మూవీలో అన్నా చెల్లెల్లుగా కనిపించనున్నారన్న టాక్ వినిపిస్తోంది.

క్రైమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాలో అన్నా చెల్లెల్ల పాత్రలు కీలకం కావటంతో విష్ణు, కాజల్‌లు అంగీకరించినట్టుగా తెలుస్తోంది. త్వరలో ప్రారంభం కానున్న ఈ మూవీకి సంబంధించి ప్రస్తుతం నటీనటుల ఎంపిక జరగుతోంది. త్వరలోనే సాంకేతిక నిపుణుల వివరాలను వెల్లడించనున్నారు.

## నాకు గాళ్ ఫ్రెండ్స్ లేరు: శర్వానంద్

ప్రస్తుతం టాలీవుడ్‌లో బ్యాచిలర్ హీరోల జాబితా పెద్దదే ఉంది. ప్రభాస్, రానా, నితిన్, శర్వానంద్ వంటి హీరోలు ఇంకా పెళ్లికి దూరంగానే ఉన్నారు. ప్రభాస్, రానాకు పెళ్లి గురించిన ప్రశ్నలు తరచుగా ఎదురవుతుంటాయి. నితిన్, శర్వానంద్ మాత్రం ఈ ప్రశ్నలను పెద్దగా ఎదుర్కోలేదు. అయితే తాజాగా 'రణరంగం' సినిమా ప్రమోషన్ కార్యక్రమంలో పాల్గొన్న శర్వానంద్‌కు పెళ్లి గురించి ప్రశ్నలు ఎదురయ్యాయి. 35 ఏళ్ల శర్వానంద్ ఇంకా పెళ్లి గురించి ఆలోచించడం లేదట. అలాగే తనకు గాళ్‌ఫ్రెండ్స్ కూడా లేరట. 'అసలు ఇప్పటివరకు పెళ్లి గురించిన ఆలోచనే రాలేదు. నాకు గాళ్‌ఫ్రెండ్స్ కూడా లేరు. పెళ్లిపై ప్రస్తుతం ఎలాంటి ఆలోచనలూ లేవు. ఎలాంటి అమ్మాయి కావాలనే దాని గురించి కూడా పెద్దగా ఆలోచించలేదు.

# ఉగ్ర కృష్ణమ్మ!

**- కృష్ణానదికి కొనసాగుతున్న వరద ఉధృతి**
**- జలదిగ్బంధంలో మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయం**
**- మూల విరాట్‌ను తాకిన కృష్ణమ్మ**
**- పులిచింతల బ్యాక్ వాటర్ పరిధిలో ఉన్న గ్రామాలు నీటమునక**
**- స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలించిన అధికారులు**
**- గుంటూరు జిల్లా పెసర్లంకలో కృష్ణానదికి గండి**
**- భయం గుప్పిట్లో లంక గ్రామాలు**
**- ప్రకాశం బ్యారేజీకి పోటెత్తుతున్న వరదనీరు**
**- బెజవాడలో ఇళ్లల్లోకి భారీగా వరద నీరు**
**- అప్రమత్తమై.. సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న అధికారులు**

విజయవాడ,ఆగస్టు 16(ఆర్ఎన్ఎ): కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది.. గత వారం రోజులుగా ఉగ్రరూపం దాల్చుతూ పరీవాహక ప్రాంతాల ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. తాజాగా ఎగువ ప్రాంతాల్లో రెండు రోజులుగా తెరపినిచ్చిన వర్షాలు మళ్లీ కురుస్తుండటంతో కృష్ణమ్మకు వరదనీరు పోటెత్తుతుంది. దీంతో నదీ పరీవాహక ప్రాంతాల్లోని ప్రజలు సురక్షిత ప్రాంతాలకు అధికారులు తరలిస్తున్నారు. ఎగువ ప్రాంతాలైన మహారాష్ట్ర, కర్ణాటకల నుంచి వరదనీరు వచ్చిచేరుతుంది. నారాయణపేట జిల్లాలో తెలంగాణలోకి ప్రవేశించే కృష్ణమ్మకు, నారాయణపేట జిల్లా మక్తల్ వద్ద భీమా నది వరద వచ్చి కలుస్తుంది. దీంతో కృష్ణమ్మకు వరదనీరు గంటగంటకు పెరుగుతోంది. ఈ నీరంతా జూరాలకు చేరుతుండటంతో జూరాల నుంచి 7లక్షలకు పైగా కూసెక్కుల నీటిని దిగువ ప్రాంతానికి వదులుతున్నారు. ఆ వరదనీరంతా శ్రీశైలం, అక్కడి నుండి నాగార్జున సాగర్, పులిచింతల, ప్రకాశంబ్యారేజ్‌కు చేరుతున్నాయి. శ్రీశైలం నుండి 8.78 లక్షల క్యూసెక్కులు, నాగార్జున సాగర్‌నుండి 7.34 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. దీంతో పులిచింతల ప్రాజెక్టుకు భారీగా వరద పోటెత్తడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. ఎగువ, దిగువ ముంపు ప్రాంతాలు జలదిగ్బంధంలోనే ఉన్నాయి. సూర్యాపేట జిల్లా మట్టంపల్లి మండలంలోని పలు గ్రామాల్లోకి నీరు చేరింది. దీంతో స్థానికులు భయాందోళనలో ఉన్నారు. మట్టపల్లి లక్ష్మినరసింహస్వామి ఆలయంలోకి ప్రవేశించిన వరద ఇప్పటికీ వెనక్కి తగ్గలేదు. ఈ ఆలయంలోకి మూడు రోజుల క్రితమే వరద నీరు చేరింది. గురువారం సాయంత్రం నుంచి వరద పోటు మరింత పెరిగింది. సాగర్ నుంచి భారీగా ఇన్‌ఫ్లో వస్తుండడంతో ఆలయం గర్భగుడిలోకి కూడా వరద చేరింది. దీంతో అధికారులు ఆలయాన్ని తాత్కాలికంగా మూసివేశారు. ఉత్సవ విగ్రహాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. నదీ తీరాలలో కొలువైన పంచ నారసింహ క్షేత్రాలలో మట్టం పల్లి నరిసింహుడు క్షేత్రం కూడా ఒకటి. 1500ల సంవత్సరాల చరిత్ర ఈ ఆలయానికి ఉంది. కృష్ణా నదీ తీరంలో స్వయంభూగా వెలసిన పంచ నారసింహుడిగా పేరొందని లక్ష్మీ నారసింహుడిగా పూజలందుకుంటున్నాడు. ఎంతో చారిత్రక ప్రాశస్త్యం కలిగిన ఈ నరసింహుడి ఆలయంలో నడుములోతు నీరు చేరుకుంది. దీంతో బుధవారమే భక్తుల దర్శనాలను నిలిపివచేశారు. దీంతో స్వామివారి నామస్మరణతో మారుమ్రోగే ఆలయం పరిసర ప్రాంతాలన్నీ బోసిపోయాయి. 2009 తరువాత అంటే 10 ఏళ్ల తరువాత ఇంత భారీ స్థాయిలో పులిచింతలకు నీరు చేసుకోవటం ఇదే మొదటిసారి. 45.7 టీఎంసీల సామర్థ్యం గల పులిచింతలకు ఇప్పటికే 39 టీఎంసీల మార్క్ దాటింది.దీంతో పులిచింత ప్రాజెక్టులోని బ్యాక్ వాటర్ పరిధిలో ఉన్న గ్రామాలన్నీ నీట మునిగిపోయాయి. ఈక్రమంలో ఆ పరిసర ప్రాంతాల్లోని ప్రజలంతా వరద ముప్పుతో తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. వరదముప్పుతు స్థానికులను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

పెసర్లంకలో కృష్ణానదికి గండి..

గుంటూరు జిల్లా పెసర్లంక గ్రామం సమీపంలో కృష్ణానదికి గండి పడింది. దీంతో కొల్లూరు లాక్ సెంటర్ సమీపంలో ఉన్న ఇటుక బట్టీలన్నీ వరద నీటిలో మునిగిపోయాయి. పలు గ్రామాల్లోని పంట పొలాలు జలమం అయ్యాయి. వరద నీరు ఇలాగే కొనసాగితే శుక్రవారం సాయంత్రానికి పెసర్లంటకలోని కరకట్ట పరిసర ప్రాంతాల్లోని గ్రామాలన్నీ వరదలో మునిగిపోయే ప్రమాదముంది. కృష్ణా నదికి వరద రోజు రోజుకు పెరిగిపోతుంటంతో లంక గ్రామాలవాసులు బిక్కు బిక్కుమంటు గడుపుతున్నారు. శనివారం మరింత పెరిగే అవకాశం ఉండటంతో కృష్ణా, గుంటూరు జిల్లాలోని లంక గ్రామాల ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. పెద్ద సంఖ్యలో ప్రజలను అధికార యంత్రాంగం పునరావాస శిబిరాలకు తరలించింది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండటం, జూరాల నుండి భారీ ఎత్తున వరద నీరు శ్రీశైలానికి చేరింది. దీంతో శ్రీశైలం నుండి 8.78 లక్షల క్యూసెక్కులు, నాగార్జున సాగర్‌నుండి 7.34 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఈ పరిమాణం మరింత పెరిగే అవకాశం ఉండటంతో లంక గ్రామాల ప్రజలు అప్రమతంగా ఉండాలని రెండు జిల్లాల కలెక్టర్లు హెచ్చరికలు జారీ చేశారు. ముందు జాగ్రత్త చర్యగా సహాయక సిబ్బందిని తరలించారు.

**బెజవాడలో ఇళ్లల్లోకి భారీగా వరద నీరు..**

కృష్ణానది వరదలకు విజయవాడలోని పలు కాలనీలు మునిగిపోయాయి. ఇళ్లల్లోకి మెుకాల్లలోతున నీరు చేరింది. రాత్రి జనమంతా నిద్రపోతున్న సమయంలో వరదనీరు ఒక్కసారిగా ఇళ్లలోకి ప్రవేశించగా ప్రజలు హడలిపోయారు. ప్రాణాలు అరచేతిలో పట్టుకొని కట్టు బట్టలతో బయటపడ్డారు.

వివరాలు... ప్రకాశం బ్యారేజీకి వరద నీరు పోటెత్తుతోంది. శుక్రవారం రాత్రి 11గంటల సమయంలో ఒక్కసారిగా ఇళ్లన్నీ నీరుతో మునిగిపోయాయి. బాలాజీనగర్, భూపేష్‌గుప్తానగర్, రామలింగేశ్వర నగర్ నీట మునిగాయి. అక్కడున్న లోతంటు ప్రాంతాలు పూర్తిగా జలమయం అయ్యాయి. ఇంట్లోని వస్తువులను బయటకు తీసేందుకు ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇంట్లోని సామాన్లు అన్నీ బయట ఉండటంతో వర్షం వస్తే వారి పరిస్థితి ఇంకా ఇబ్బందికరంగా మారుతోందని వారంతా బయపడుతున్నారు. ఇప్పటికే నాలుగు రోజుల నుంచి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మరో 24 గంటల పాటు వరద ఉధృతి కొనసాగే అవకాశం ఉన్నట్లు తెలిసింది. దీంతో నగర ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

కృష్ణానది ఉగరం కరకట్టకు గండి..

కృష్ణమ్మ ఉగ్రరూపానికి ప్రజలు అల్లాడిపోతున్నారు. ఎప్పుడు వరద ముంచేస్తుందోనని హడలిపోతున్నారు. పైన కురుస్తున్న భారీ వర్షలతో కృష్ణానదికి భారీగా వరద నీరు చేరుకుంటోంది. గుంటూరు జిల్లాలో కృష్ణానది పొంగి ప్రవహిస్తోంది. తెనాలి మండలం వల్లభాపురంలో ఉంగరం కట్టకు భారీగా గండి పడింది. దీంతో వరదనీరు పంటలపోలాలను ముంచివేసింది. వరద ఉదృతి అంతకంతకూ పెరగటంతో చుట్టుప్రక్కల గ్రామాలన్నీ మునిగిపోయాయి. జిల్లా యంత్రాంగం అంతా అప్రమత్తమై పరిస్థితిని సమీక్షిస్తున్నారు. కృష్ణా నదికి వరదపోటు కొనసాగుతోంది. పలు లంక గ్రామాలలోని ఇళ్లలోకి వరదనీరు చేరుకోవటంతో ప్రజలు నానా అగచాట్లు పడుతున్నారు. వరద తీవ్రత రోజు రోజుకు పెరిగిపోతుండటంతో తాగు నీరు లేక..నిత్యావసర వస్తువులు తెచ్చుకునే వీలు లేక పలు సమస్యలనుఎదుర్కొంటున్నారు.

మెకాలు లోతులో ఇళ్లల్లో నీరు చేరుకోవటంతో..నీటిలో పనులు చేసుకుంటున్న మహిళలు చిన్నారులతో నానా ఇబ్బందులు పడుతున్నారు. మరోపక్క పంట పొలాలు నీటిలోమునిగిపోవటంతో రైతులు విచారం వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు. వరద ఉదృతి రోజు రోజుకు పెరుగుతుండటంతో..అంటువ్యాధులు రాకుండా అధికారులు వెంటనే సహాయక చర్యల్ని చేపట్టాలని బాధితులు కోరుతున్నారు.

## ఉమ్మడి వరంగల్‌ను..

# సస్యశ్యామలం చేస్తాం

**- మత్స్యకారుల బతుకుల్లో కేసీఆర్ వెలుగులు నింపారు**
**- గ్రామాల అభివృద్ధికి 60రోజుల ప్రణాళిక**
**- అన్నివర్గాల అభివృద్ధే కేసీఆర్ ధ్యేయం**
**- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు**

వరంగల్, ఆగస్టు16(ఆర్ఎన్ఎ) : ఉమ్మడి వరంగల్ జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. కాజీపేట మడికొండ పెద్ద చెరువులో మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో అన్నివర్గాల అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్తశుద్ధితో పనిచేస్తున్నారనిన్నారు. సీఎం కేసీఆర్ మత్స్యకారుల బతుకుల్లో వెలుగులు నింపారన్నారు. ఉచితంగా చేప పిల్లలతో పాటు, సబ్సిడీతో వాహనాలు ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఎస్సీల అభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రణాళిక రూపొందించారని తెలిపారు. ప్రతి కుటుంబానికి బర్రెలు ఇప్పించాలని యోచిస్తున్నట్లు చెప్పారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం అభివృద్ధికి సహకారం అందిస్తానని వెల్లడించారు. గ్రామాల అభివృద్ధికి 60 రోజుల ప్రణాళికను కేసీఆర్ రూపొందించారని వివరించారు. వచ్చే నాలుగు నెలల్లో దేవాదుల నుంచి 365 రోజుల పాటు నీటిని ఎత్తిపోస్తామన్నారు.. మల్కాపూర్ రిజర్వాయర్ పనులను త్వరలో ప్రారంభించనునట్లు తెలిపారు. దేవాదుల నీటితో ఉమ్మడి వరంగల్ జిల్లాను సస్యశ్యామలం చేస్తామని పేర్కొన్నారు. కేసీఆర్ అమలు చేస్తున్న పథకాల తీరుతో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. గ్రామ పంచాయతీలను పటిష్ఠం చేసేందుకు, మున్సిపాలిటీల్లో అవినీతి రహిత పాలన అందించేందుకు కొత్త చట్టాలను తీసుకురావటం జరిగిందని అన్నారు. త్వరలో మున్సిపల్ ఎన్నికలు జరుగుతాయని, ఆ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో తెరాస అభ్యర్థులు గెలుపొందటం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అరూరి రమేష్, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, తదితరులు పాల్గొన్నారు.



వరంగల్ జిల్లా మడికొండ, పెద్దపెండ్యాల చెరువుల్లో చేపపిల్లను వదిలిన ఎర్రబెల్లి దయాకర్ రావు. చిత్రంలో స్టేషన్ ఘనాపూర్ ఎమ్మెల్యే రాజయ్య, వరంగల్ కలెక్టర్ ప్రశాంత్ పాటిల్ తదితరులు

# తెలంగాణలో కూడా తీరని సమస్యలు

## ఆందోళన వ్యక్తంచేసిన తెలంగాణ లెక్చరర్స్ జేఏసీ

హైదరాబాద్,ఆగస్ట్16(ఆర్ఎన్ఎ): ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డ తరవాత కూడా తమ సమస్యలు పరిస్కారం కాలేదని, పరిస్థితి మరింత ఘోరంగా తయారయ్యిందని తెలంగాణ లెక్చరర్స్ జేఏసీ నేతలు ఆందోళన చెందారు. తమ సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని మాజీ ఎంపీ, బీజేపీ నేత జి. వివేక్ వెంకటస్వామిని తెలంగాణ లెక్చరర్స్ జేఏసీ నేతలు కలిశారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను వారు ఆయన దృష్టికి తీసుకొస్తూ వినతిపత్రం అందజేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా తాము ఘోరమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నామని చెప్పారు. కార్పొరేట్ కాలేజీల్లో 20 ఏళ్లుగా పని చేస్తున్న తెలంగాణ లెక్చరర్లను ఎలాంటి కారణం లేకుండా ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారని వివరించారు. తమకు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెస్సీ చేసిన పోస్ట్ గ్రాడ్యుయేట్లకు నెలకు రూ. 9 వేల వేతనం మాత్రమే చెల్లిస్తున్నారని, అదీ ఏడాదిలో పది నెలలే ఇస్తున్నారని చెప్పారు. తమ సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు. న్యాయం జరిగేలా చేస్తానని వివేక్ వారికి హామీ ఇచ్చారు.

లఘు ఉద్యోగ భారత్( సంఘం నేత విద్యాసాగర్, కార్యవర్గ సభ్యులు వివేక్‌ను కలిశారు.బీజేపీలో చేరినందుకు ఆయనకు అభినందనలు తెలిపారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com